అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

ఆదివారం 01-01-2023

సమగ్ర తెలుగు దినపత్రిక



సంపుటి : 8 | సంచిక : 360 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | www.navatelangana.com | 12 పేజీలు + సోపతి (వెబ్‌లో) | వెల : 8.00



రైతుల ఆదాయం

రెట్టింపేది..?

2022 నాటికి రెట్టింపుచేస్తానన్న మోడీ

- వాస్తవానికి రైతుల ఆదాయంలో క్షీణత
- రైతులపై పెరుగుతున్న రుణ భారం
- ఐదేండ్లలో 28,572 మంది రైతుల ఆత్మహత్యలు
- పీఎం కిసాన్ నుంచి రెండు కోట్ల మంది రైతులు తొలగింపు

'2022 నాటికి దేశంలోని రైతులందరి ఆదాయం రెట్టింపు చేస్తాం. అదే ప్రభుత్వం ఉద్దేశం. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 2022 నాటికి 75 ఏండ్లు పూర్తి అవుతుంది. అప్పటికి... రైతుల ఆదాయం రెట్టింపు అవ్వాలి. అందుకనుగుణంగా మా ప్రభుత్వం పని చేస్తుంది' అని 2016 ఫిబ్రవరి 28న ఉత్తరప్రదేశ్‌లోని బరేలీలో జరిగిన రైతు ర్యాలీలో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ హామీ ఇచ్చారు. రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామనే లక్ష్యం స్వాగతించదగినది. ప్రభుత్వ అధికారులు అనేకసార్లు పునరుద్ఘాటించినప్పటికీ 'రైతు' అంటే ఎవరు? రైతు ఆదాయం అంటే ఏమిటి? అనే దానిపై ప్రభుత్వం వద్ద స్పష్టత లేదు.



న్యూఢిల్లీ : 2022 ముగిసింది. 2023లోకి అడుగు పెట్టాం. సంవత్సరాలు మారుతున్నా.. రైతులు కన్నీళ్లు మాత్రం కారుతూనే ఉన్నాయి. పండిన పంటకు కనీస మద్దతు ధర లేకపోవడం, మరోవైపు పంట పండించడానికి పెట్టుబడి వ్యయం ఏడాదికి ఏడాది పెరగడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనివల్ల అప్పుల భారం పెరుగుతున్నది. జూలై 2018 - జూన్ 2019 ఏడాదిలో దేశంలో సగటున ఒక్కో కుటుంబంపై రూ.74,121 రుణభారం ఉందని కేంద్రమే తెలిపింది. మరోవైపు ఏడాదికి ఏడాది రైతుల ఆత్మహత్యలు కూడా పెరుగుతున్నాయి. ప్రధాని మోడీ రైతులకు రెట్టింపు ఆదాయం చేస్తామని ప్రకటించిన తరువాతే దేశంలో 28,572 (2017-2022) మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు.

రైతులకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చే సహాయంలో భారీ కోత విధించింది. ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పీఎంకిసాన్) పథకం నుంచి ఈ ...5లో

జనంలో ఉండాల్సిందే..

పోరాడాల్సిందే...

మతవిద్వేషాలతో పబ్బం గడుపుకుంటున్న బీజేపీ

- పాలకుల వైఫల్యాలను ఎండగట్టాలి
- క్షేత్రస్థాయిలో పోరాటాలను బలోపేతం చేయాలి : అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి.వెంకట్



ఖమ్మం నుంచి అచ్చిన ప్రశాంత్

వర్గపోరాటంలో విజయం సాధించాలంటే నిరంతరం జనం ఉండాల్సిందేననీ, సమస్యలపై వారి పక్షాన నిలబడి పోరాడాల్సిందేనని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ నొక్కిచెప్పారు. ఖమ్మంలోని వేదగిరి శ్రీనివాసరావు(భక్తరామదాసు కళాక్షేత్రం)లోని అమరవీరుల ప్రాంగణంలో జరుగుతున్న రాష్ట్ర మూడో మహాసభలో ప్రతినిధులనుద్దేశించి ఆయన ప్రసంగించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మత విద్వేషాలతో పబ్బం గడుపుకుంటున్నదని విమర్శించారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ ప్రజలకు, వ్యవసాయ కార్మికులకు ఇచ్చిన హామీలన్నింటిని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరంతరం ఎండగట్టాలని పిలుపునిచ్చారు. ఒకప్పుడు భూస్వాముల చేతుల్లో భూమి కేంద్రీకృతం అయ్యి ఉండేదనీ, అనేక పోరాటాల ఫలితంగా కొంతమేరకు భూమి పేదలకు దక్కిందని తెలిపారు. మళ్లీ ఇప్పుడు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ వ్యవసాయం పేరుతో భూమిని కొందరి వద్దనే కేంద్రీకృతం చేసే కుట్రకు పూనుకుంటున్నదని విమర్శించారు. రానున్న రోజుల్లో భూ సమస్య తీవ్రం కాబోతున్నదన్నారు. పేదల పక్షాన ..5లో



తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా

జి.నాగయ్య, ఆర్.వెంకట్రాములు



- 87 మందితో నూతన రాష్ట్ర కమిటీ ఎన్నిక

వివరాలు 5లో..

ఎన్ఐఏ కేసుల పెరుగుదలలో

ఆల్‌టైమ్ రికార్డు

ఏడాదిలో 19.67 శాతం పెరుగుదల

- 2021లో 61 కేసులు, 2022లో 73 కేసులు నమోదు
- 368 మందిపై 59 చార్జిషీట్లు



5లో..

సమానత్వం కోసం సమైక్యతతో పోరాటం

ఐద్వా అఖిల భారత మహాసభ నినాదం

- జనవరి 6 నుండి 9 వరకు తిరువనంతపురంలో నిర్వహణ
- 850 మందికి పైగా ప్రతినిధులు

తిరువనంతపురం : 'సమానత్వం కోసం సమైక్యతతో పోరాటం' నినాదంతో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) 13వ మహాసభ నిర్వహించనున్నట్టు ఐద్వా జాతీయ ఉపాధ్యక్షులు, మహాసభ ఆహ్వాన కమిటీ చైర్మెన్ పికె శ్రీమతి తెలిపారు. కేరళలోని తిరువనంతపురంలో ఈ నెల 6 నుంచి 9 వరకు ఐద్వా మహాసభ జరగనున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా శనివారం ఇక్కడ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఐద్వా కేంద్ర కమిటీ సభ్యులు, ఆహ్వాన కమిటీ కన్వీనర్ టిఎన్ సీమ, రాష్ట్ర కార్యదర్శి, జనరల్ కన్వీనర్ సిఎస్ సుజాతతో కలిసి పికె శ్రీమతి మాట్లాడారు. ఈ మహాసభకు దేశం నలుమూలల నుంచి దాదాపు 850 మంది పైగా ప్రతినిధులు హాజరుకానున్నట్టు ఆమె తెలిపారు. తిరువనంతపురం ఐద్వా మహాసభకు ఆతిథ్యమివ్వడం ఇది రెండోసారి అని, 36 ఏళ్ళ క్రితం 1986లో మొదటిసారిగా జాతీయ మహాసభ ఇక్కడ జరిగిందని తెలిపారు. 1981లో ఐద్వా ఏర్పడిన సంగతి విదితమే. 'సమానత్వం కోసం సమైక్యతతో పోరాటం" అనుది ఈ జాతీయ మహాసభ ప్రధానాంశంగా ఉండనున్నట్లు పికె శ్రీమతి పేర్కొన్నారు. బాల్య నృత్య కళాకారిణి, కేరళ కళా మండలం ఛాన్సలర్ మల్లికా సారాభాయి జనవరి 6న ఠాగూర్ థియేటర్‌లో జరిగే ప్రతినిధుల సమావేశాన్ని ప్రారంభిస్తారని, సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్ కీలకోపన్యాసం చేస్తారని తెలిపారు. క్యూబా విప్లవ నేత చె గువెరా కుమార్తె అలెదాగువెరా, ఆమె కుమార్తె ఎస్తెఫానియా మచిన్ గువెరా కూడా ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొన్నారు. 'ప్రభుత్వ ప్రాయోజిత తీవ్రవాదం, నేటి భారతదేశం' అనే అంశంపై సెమినార్‌ను సామాజిక కార్యకర్త తీస్తా సెతల్వాద్ అదే రోజు సాయంత్రం 4 గంటలకు గాంధీ పార్క్‌లో ప్రారంభిస్తారని తెలిపారు. మహాసభ చివరి రోజైన 9న సాయంత్రం 4గంటలకు పుత్తరికండం మైదానంలో జరిగే బహిరంగ సభలో ముఖ్యమంత్రి పినరయి విజయన్ పాల్గొంటారని తెలిపారు. గత నాలుగు దశాబ్దాల కాలంలో 98 లక్షల సభ్యత్వంతో ఐద్వా దేశంలోనే ప్రముఖ మహిళా సంస్థగా ఆవిర్భవించింది. మహిళా పోరాటాలు, వారి సమస్యలను ప్రముఖంగా పేర్కొంటూ వాటి పరిష్కారం కోసం పోరు సల్పడంలో, మహిళల అభ్యున్నతికి వివిధ చట్టాలను తీసుకురావడంలో కీలక పాత్ర పోషించింది.సభ్యులు బృందాకరత్ కీలకోపన్యాసం చేస్తారని తెలిపారు. క్యూబా విప్లవ నేత చె గువెరా కుమార్తె అలెదాగువెరా, ఆమె కుమార్తె ఎస్తెఫానియా మచిన్ గువెరా కూడా ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొన్నారు. 'ప్రభుత్వ ప్రాయోజిత తీవ్రవాదం, నేటి భారతదేశం' అనే అంశంపై సెమినార్‌ను సామాజిక కార్యకర్త తీస్తా సెతల్వాద్ అదే రోజు సాయంత్రం 4 గంటలకు గాంధీ పార్క్‌లో ప్రారంభిస్తారని తెలిపారు. మహాసభ చివరి రోజైన 9న సాయంత్రం 4గంటలకు పుత్తరికండం మైదానంలో జరిగే బహిరంగ సభలో ముఖ్యమంత్రి పినరయి విజయన్ పాల్గొంటారని తెలిపారు. గత నాలుగు దశాబ్దాల కాలంలో 98 లక్షల సభ్యత్వంతో ఐద్వా దేశంలోనే ప్రముఖ మహిళా సంస్థగా ఆవిర్భవించింది. మహిళా పోరాటాలు, వారి సమస్యలను ప్రముఖంగా పేర్కొంటూ వాటి పరిష్కారం కోసం పోరు సల్పడంలో, మహిళల అభ్యున్నతికి వివిధ చట్టాలను తీసుకురావడంలో కీలక పాత్ర పోషించింది.

టీచర్ల బదిలీలు.. పదోన్నతులకు ఆదేశాలివ్వండి...

- సీఎం కేసీఆర్‌కు ఎమ్మెల్సీ నర్సిరెడ్డి లేఖ

నవతెలంగాణ బ్యూరో -హైదరాబాద్

మండల, జిల్లా పరిషత్, గిరిజన సంక్షేమ పాఠశాలలు, మోడల్ స్కూళ్లలో పని చేస్తున్న ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్‌ను ప్రకటించాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. అందుకనుగుణంగా విద్యా, గిరిజన సంక్షేమశాఖకు ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఆయన శనివారం లేఖ రాశారు. బదిలీలు, పదోన్నతులపై సీఎం... గతంలో శాసనసభలో హామీనిచ్చారని గుర్తు చేశారు. కానీ ఆ హామీ ఇప్పటి వరకూ నోచుకోలేదని తెలిపారు.

అశాస్త్రీయ పద్ధతులకు అధికార ముద్ర!

- మనోవైజ్ఞానిక నిపుణుల సిఫారసులను పట్టించుకోని విద్యాశాఖ
- ఆదివారం పరీక్షలతో విద్యార్థులపై మానసిక ఒత్తిడి
- కార్పొరేట్ సంస్కృతిని పెంచేలా అధికారుల తీరు
- ఉదయం.. సాయంత్రం ప్రత్యేక తరగతులు సరే
- విద్యార్థులకు అల్పాహారం, స్నాక్స్ సంగతేంటీ?
- ఎస్సీఈఆర్టీ సర్క్యులర్‌పై సర్వత్రా విమర్శలు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

శాస్త్రీయ విద్యావిధానాన్ని అమలు చేయాల్సిన విద్యాశాఖ అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నదంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అశాస్త్రీయ పద్ధతులకు అధికార ముద్ర వేయడం ఉపాధ్యాయులు, విద్యార్థుల్లో చర్చనీయాంశంగా మారింది. అయితే మనోవైజ్ఞానిక నిపుణుల సిఫారసులను పట్టించుకోకపోవడం గమనార్హం. పాఠశాల పనివేళలకు అదనంగా ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులను తీసుకోవాలంటూ రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ మండలి (ఎస్సీఈఆర్టీ) గతనెల 30న సర్క్యులర్‌ను జారీ చేసింది. అయితే ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులకు హాజరు కావాలంటే వారికి అల్పాహారం, స్నాక్స్ సంగతేంటన్నది ప్రశ్నార్థకంగా మారింది. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల్లో అత్యధికమంది పేదలు, ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనార్టీ తరగతులకు చెందిన వారే ఉంటారు. వారికి ఇంటి నుంచి టిఫిన్ తెచ్చుకునే అలవాటు ఉండదు. సర్కారు బడుల్లో మధ్యాహ్న భోజన పథకంపై ఆధారపడే విద్యార్థులే ఎక్కువ మంది ఉంటారు. అయితే ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు ఉంటాయన్న విద్యాశాఖ విద్యార్థులకు సంబంధించిన అల్పాహారం, స్నాక్స్ గురించి ప్రస్తావించలేదు. ఇంకోవైపు విద్యార్థులు వారంలో ఆరు రోజులు బడికి వచ్చి ఆదివారం సెలవు తీసుకుంటారు. కానీ ఎస్సీఈఆర్టీ అధికారులు కార్పొరేట్ విద్యాసంస్థలని సర్కారు బడుల్లో ప్రవేశపెట్టాలని భావిస్తున్నారు. అందులో భాగంగానే ఆదివారం ఖాళీ లేకుండా పరీక్షలను నిర్వహించాలంటూ ఆదేశించారు. విద్యావ్యాపారాన్ని కట్టడి చేసి బాలల హక్కులను కాపాడాల్సిన విద్యాశాఖ ఇలాంటి అశాస్త్రీయమైన నిర్ణయాలు తీసుకోవడం గమనార్హం. ఉపాధ్యాయులు ఒకరో, ఇద్దరో వెళ్లి పరీక్షలను నిర్వహిస్తారు. కానీ విద్యార్థుల పరిస్థితి ఏమిటన్నది ప్రశ్నార్థకంగా మారింది. అందుకే ఈ సర్క్యులర్‌ను జారీ చేయడం పట్ల సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

విద్యార్థులపై పెనుభారం

పదో తరగతిలో వెనుకబడిన విద్యార్థులకోసం ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు తీసుకుని స్వచ్ఛందంగా కొందరు ఉపాధ్యాయులు తొలినాళ్లలో బోధించేవారు. తర్వాత జిల్లా కలెక్టర్లు, డీఈఓల మౌఖిక ఆదేశాలతో అన్ని పాఠశాలల్లో ప్రత్యేక తరగతులను తప్పనిసరి చేశారు. ఉపాధ్యాయులు కూడా కాదనకుండా బాధ్యతగానే బోధిస్తున్నారు. కానీ ఇప్పుడు ఏకంగా ఎస్సీఈఆర్టీ సర్క్యులర్ ద్వారా అధికారిక ఆదేశాలే ఇచ్చింది. అయితే వారంలో ఒక్కరోజు కూడా వెసులుబాటు ఇవ్వకుంటే విద్యార్థులపై మానసికంగా ఒత్తిడి పెరుగుతుంది. వారి సృజనాత్మకతపై ప్రభావం చూపుతుంది. వరుస తరగతులు, పరీక్షలతో పెనుభారం పడనుంది. ఇది బాలల హక్కులను హరించటం కాదా...?అంటూ ఉపాధ్యాయులు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు.

అల్పాహారానికి బడ్జెట్ కేటాయించాలి : చావ రవి, టీఎస్‌యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి

ఉపాధ్యాయులు ఎన్నో ఏండ్ల నుంచి పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు తీసుకుంటున్నారు. ఉపాధ్యాయులే దాతల సహాయంతో పిల్లలకు సాయంత్రం అల్పాహారం ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పుడు ప్రభుత్వమే అధికారికంగా సర్క్యులర్ ఇచ్చింది. కనుక అల్పాహారానికి బడ్జెట్ కేటాయించాలి. ఆదివారం పిల్లలకు ఆటవిడుపుగా ఉండాలి. వారాంతపు పరీక్షల పేరిట పిల్లలపై ఒత్తిడి లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

మతాన్ని మనిషికీ, మానవత్వానికి అంటగట్టొద్దు

- ధర్మం నాలుగు కృత్రిమ కాళ్లపై ఉంది
- వ్యవస్థలన్నీ కలుషితమయ్యాయి
- త్యాగాల పక్షానే తెలంగాణ సినిమా
- హైదరాబాద్ బుక్‌ఫెయిర్ సదస్సులో దర్శకుడు ఎన్ శంకర్



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

మనిషికీ, మానవత్వానికి మతాన్ని అంటగట్టొద్దని ప్రముఖ సినీ దర్శకులు ఎన్ శంకర్ అన్నారు. ప్రస్తుతం వ్యవస్థలన్నీ కలుషితమై ఉన్నాయనీ, ధర్మం నాలుగు కృత్రిమ కాళ్లపై నిలబడి ఉన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయాల కోసం మనుషుల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తే, కచ్చితంగా తెలంగాణ సినిమా త్యాగాల పక్షానే నిలుస్తుందని స్పష్టంచేశారు. హైదరాబాద్ బుక్ ఫెయిర్, ప్రభుత్వ సిటీ కళాశాల సాంస్కృతిక విభాగం సంయుక్తాధ్వర్యంలో తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మెన్ జూలూరు గౌరీశంకర్ అధ్యక్షతన 'సమకాలీన సినిమా' అంశంపై అలిశెట్టి ప్రభాకర్ వేదికపై సదస్సు జరిగింది. దీనికి ఎన్ శంకర్ ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. ప్రస్తుతం తెలుగు సినీ పరిశ్రమలో సమకాలీన, సమాంతర సినిమా ప్రజలతో సంబంధం లేకుండా సినీ మాఫియా తన్నేసిందని ఆందోళన వ్యక్తం చేశారు. చిన్న సినిమాలు బతికే పరిస్థితులు లేవనీ, ఎక్కడో ఒకటి రెండు చిత్రాలను ఉదాహరణగా చూపి, చిన్న సినిమా బతికే ఉందని ప్రచారం చేస్తున్నారనీ, ఆ కష్టం నిర్మాతలకే తెలుస్తుందన్నారు. నిర్మాత, దర్శకుడిని నమ్మి సినిమాలు చేసే ధైర్యం ఇప్పుడున్న హీరోలకు లేదని చెప్పారు. సినిమా ప్రజల జీవితాలతో ముడిపడి ఉంటుందనీ, అది వ్యాపారంతో కూడిన కళ అని విశ్లేషించారు.

ఈ సినిమా నాది అని హీరోలు ప్రమోట్ చేసుకొనే పరిస్థితులు దాపురించాయనీ, మరి నిర్మాత, దర్శకుడి పాత్ర ఏంటని ప్రశ్నించారు. ఎన్టీఆర్, ఏఎన్ఆర్ కాలంలో నిర్మాత, దర్శకుడిపై నమ్మకంతో గ్లామర్ లేని సామాన్యుల పాత్రలు వేసి ప్రేక్షకుల్ని మెప్పించారనీ, ఇప్పుడు దానికి పూర్తిభిన్నంగా హీరో పాత్రలు ఉంటున్నాయని చెప్పారు. ప్రస్తుతం సమాజానికి కావల్సింది శ్రీరాముడు కాదనీ, త్యాగం చేసిన ఆంజనేయులు కావాలని అన్నారు. శ్రీరాముడు రావణాసురుడిని చంపడానికి అష్టకష్టాలు పడ్డాడనీ, కానీ ఆంజనేయుడు సీతను వెతికి, లంకను తగులబెట్టి త్యాగానికి చిహ్నంగా మిగిలాడనీ, కానీ ఆ త్యాగాన్ని హీరోయిజంగా చూపించాలని చెప్పారు. భారతంలో శ్రీకృష్ణుడి లాజిక్ అర్థంకాదన్నారు. సైన్యం దుర్యోధనుడికి, తానొక్కడు పాండవుల పక్షంలో ఉండటం ఏం లాజిక్ అని ప్రశ్నించారు. కురుక్షేత్ర యుద్ధంలో పాల్గొన్న ఆదివాసీలు, మూలవాసులు బానిసల త్యాగాలు భవిష్యత్ తరాలకు చెప్పాలని అభిప్రాయపడ్డారు. ఇప్పుడు మత పోరాటాలతో ప్రజల్లో విద్వేషాన్ని పెంచే ప్రయత్నాలు చేస్తుంటారని హెచ్చరించారు. భీమ్లానాయక్ చిత్ర దర్శకులు సాగర్ చంద్ర మాట్లాడుతూ స్థానిక సంస్కృతి, సంప్రదాయాల లోతుల్లోకి ఎంత అధ్యయనం చేస్తే, అన్ని కథావస్తువులు దొరుకుతాయంటూ 'కాంతారా' చిత్రాన్ని ఉదహరించారు. 'మోర్ లోకల్-మోర్ గ్లోబల్' అని చెప్పారు. కార్యక్రమంలో ప్రముఖ సినీ విశ్లేషకులు రెంటాల జయదేవ, సినీ దర్శకులు వేణుశ్రీరామ్ (వకీల్‌సాబ్), భరత్ కమ్మ (డియర్ కామ్రేడ్), ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పీ బాల భాస్కర్, ప్రొఫెసర్ నీరజ తదితరులు పాల్గొన్నారు.

డీజీపీగా బాధ్యతలు స్వీకరించిన

అంజనీకుమార్

ఘనంగా మహేందర్‌రెడ్డికి వీడ్కోలు పలికిన ఐపీఎస్ అధికారులు



నవతెలంగాణ- ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్ర నూతన డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు (డీజీపీ) అంజనీకుమార్ శనివారం బాధ్యతలను స్వీకరించారు. మధ్యాహ్నం 12.50 గంటలకు ఆయన.. రిటైర్ అవుతున్న డీజీపీ మహేందర్‌రెడ్డి నుంచి బాధ్యతలను స్వీకరించారు. అంతకుముందు ఏసీబీ కార్యాలయం నుంచి డీజీపీ కార్యాలయానికి వచ్చిన అంజనీకుమార్‌కు సీనియర్ ఐపీఎస్ అధికారులు స్వాగతం పలికి లోనికి తీసుకెళ్లారు. లోపల అప్పటికే ఆయన కోసం వేచి ఉన్న మహేందర్‌రెడ్డి డీజీపీ చాంబర్‌లోకి అంజనీకుమార్‌ను సాదరంగా ఆహ్వానించి నేరుగా డీజీపీ సీటు వద్దకు తీసుకెళ్లి కూర్చోబెట్టారు. అనంతరం అధికారిక ఫైలులో అంజనీకుమార్ డీజీపీగా సంతకం చేశారు. అనంతరం రిటైరైన డీజీపీ మహేందర్‌రెడ్డిని సుందరంగా అలంకరించిన వాహనంలో కూర్చొబెట్టి దానికి ఇరువైపులా కట్టిన తాళ్లను సీనియర్ ఐపీఎస్ అధికారులు లాగుతూ డీజీపీ కార్యాలయ ప్రాంగణం నుంచి మేయిన్ గేటు వరకు తీసుకెళ్లారు. అక్కడ ప్రత్యేక వాహనం నుంచి దిగిన మహేందర్‌రెడ్డి తన కారులో కూర్చొని నివాసానికి బయలుదేరి వెళ్లారు. గత కొన్నేండ్లుగా రిటైరైన డీజీపీలను ప్రత్యేక వాహనంలో కూర్చోబెట్టి తాడుతో లాగుతు తీసుకెళ్లి మేయిన్ గేటు వద్ద వీడ్కోలు పలకటం ఆనవాయితీగా వస్తున్నది. ఈ మారు వాహనం తాడును లాగిన వారిలో సీనియర్ ఐపీఎస్ అధికారులు సీవీ ఆనంద్, శివధర్‌రెడ్డి, సందీప్ శాండిల్య, సంజయ్ జైన్, శిఖాగోయల్, స్టీఫెన్ రవీంద్ర, మహేష్ భగవత్ తదితర ఉన్నతాధికారులు ఉన్నారు. డీజీపీగా ఛార్జి తీసుకున్న తర్వాత తన చాంబర్‌లో వేద మంత్రాల మధ్య పూజలు చేసిన అంజనీకుమార్.. తర్వాత ముఖ్యమంత్రిని కలువడానికి వెళ్లారు. అంజనీకుమార్ డీజీపీగా బాధ్యతలను స్వీకరిస్తున్న సమయంలో డీజీపీ కార్యాలయంలోని అదనపు డీజీలు, ఐజీలు, డీఐజీలు, జిల్లాల ఎస్పీలు, నగర పోలీసు కమిషర్లు, డీజీపీ కార్యాలయ అధికారులు అక్కడే ఉండి ఆయనకు శుభాకాంక్షలు తెలియ చేశారు.

మంత్రి హరీశ్ రావుపై బీజేపీ తప్పుడు ప్రచారం

- రెడ్కో చైర్మెన్ సతీష్ రెడ్డి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్ర ఆర్థిక శాఖా మంత్రి టీ హరీశ్‌రావు సమక్షంలోనే భైరి నరేశ్ అయ్యప్పపై అనుచిత వ్యాఖ్యలు చేశారని బీజేపీ తప్పుడు ప్రచారం చేస్తున్నదనీ, దీన్ని పూర్తిగా ఖండిస్తున్నామని రెడ్కో చైర్మెన్ వై సతీష్‌రెడ్డి అన్నారు. పాత వీడియోను ప్రస్తుత వీడియో అన్నట్టుగా ప్రచారం చేస్తున్నారని వివరణ ఇచ్చారు. గతేడాది సిద్దిపేటలో అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి హరీశ్‌రావు పాల్గొన్నారనీ, ఇదే కార్యక్రమంలో భైరి నరేశ్ రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ గురించి మాట్లాడారని చెప్పారు. ఆ తర్వాత మాట్లాడిన మంత్రి హరీశ్‌రావు గారు భైరి నరేశ్ ప్రసంగించిన తీరును అభినందించారని తెలిపారు. అప్పటికార్యక్రమాన్ని... ఇప్పుడు జరిగినట్టుగా బీజేపీ తప్పుడు ప్రచారం చేస్తున్నదని విమర్శించారు.ఆ పార్టీ ఇలాంటి తప్పుడు ప్రచారాలను మానుకోవాలని హెచ్చరించారు. కోట్లాది మంది ప్రజలు పూజించే అయ్యప్పస్వామిపై భైరి నరేశ్ అనుచిత వ్యాఖ్యలు చేయడం ఏమాత్రం సమర్థనీయం కాదన్నారు. ఎవరు ఏ మతాన్ని కించపరిచినా ఆమోదనీయం కాదనీ, తెలంగాణ ప్రభుత్వం అన్ని మతాలను సమదృష్టితో చూస్తుందన్నారు. హిందూమతంలో అయినా.. ఇతర మతాల మధ్య అయినా చిచ్చుపెట్టేలా ప్రవర్తిస్తే చట్టప్రకారం చర్యలుంటాయని హెచ్చరించారు.

సివిల్ అసిస్టెంట్ సర్జన్లకు నియామక పత్రాలు...

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వైద్యారోగ్య శాఖలో కొత్తగా నియమితులైన 929 మంది సివిల్ అసిస్టెంట్ సర్జన్లకు ఆ శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు శనివారం నియామక పత్రాలను అందజేశారు. శాఖ పరిధిలో ఒకేసారి ఇంతమందికి నియామక పత్రాలు ఇదే మొదటిసారని ఆయన తెలిపారు.

ప్రభుత్వ వైద్యులుగా నూతన సంవత్సరంలో కొత్త జీవితాన్ని ప్రారంభిస్తున్న వైద్యులందరికీ అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.

పత్తి రైతులకు అండగా నిలబడండి

సీఎం కేసీఆర్‌కు రేవంత్ లేఖ

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఎండనక, వాననక కష్టపడి పండించిన పంటకు మద్దతు ధర దక్కడం లేదనీ, వారికి అండగా నిలబడాలని టీపీసీసీ అధ్యక్షులు, ఎంపీ ఎనుముల రేవంత్‌రెడ్డి చెప్పారు. దళారులు రైతును దగా చేస్తుంటే వారికి అండగా నిలవాల్సిన ప్రభుత్వం చోద్యం చూస్తున్నదని పేర్కొన్నారు. ఈమేరకు శనివారం సీఎం కేసీఆర్‌కు రేవంత్‌రెడ్డి లేఖ రాశారు. పంట ఏదైనా వ్యాపారులు, దళారులు చెప్పిందే రేటు అన్నట్టుగా పరిస్థితి తయారైందని తెలిపారు. ఇంతటి విపత్కార పరిస్థితుల మధ్య ఉన్న రైతుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోకుంటే..రైతులు తమ సమస్యలను ఎవరికి చెప్పుకోవాలని ప్రశ్నించారు. వానలు, చీడపీడల బెడదను తట్టుకుని పండిన పత్తిని చూసి రైతన్న ఆనందం మార్కెట్లో ధర చూడగానే ఆవిరైపోతున్నదని పేర్కొన్నారు. దళారుల రాజ్యంలో గిట్టుబాటు ధర రాకపోవడంతో రోడ్డెక్కి ఆందోళ చేయాల్సిన స్థితి దాపురించిందని తెలిపారు. పెట్టిన పెట్టుబడిని పరిగణనలో తీసుకుంటే కనీసం రూ.15 వేలు రాకుంటే గిట్టుబాటు కాని పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. రాష్ట్రంలో 16 లక్షల మంది కౌలు రైతులున్నారనీ, ఆత్మహత్యకు పాల్పడుతున్న రైతుల్లో 80 శాతం మంది కౌలు రైతులే ఉన్నారని గుర్తు చేశారు. తక్షణమే ప్రభుత్వం రైతుల ఆత్మహత్యల సంక్షోభంపై దృష్టి సారించాల్సిన అవసరముందని కోరారు. 'పత్తికి క్వింటాలుకు రూ. 15 వేలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలి. తక్షణం రూ.లక్ష రుణమాఫీ అమలు చేయాలి. ఆత్మహత్యలు చేసుకున్న రైతు కుటుంబాల ప్రయివేటు అప్పులను వన్ టైం సెటిల్‌మెంటు కింద పరిష్కరించేలా ప్రభుత్వ వ్యవస్థలు చొరవ తీసుకోవాలి. కౌలు రైతులను కూడా రైతులుగా గుర్తించి, రైతులకు వర్తించే అన్నీ పథకాలను వారికి కూడా వర్తింపజేయాలి. పంటల బీమా పథకాల అమలుకు తక్షణం చర్యలు తీసుకోవాలి' అని పేర్కొన్నారు.

రైతు కష్టాలను పరిష్కరించాలి : కోదండరెడ్డి

రైతు కష్టాలను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోలేదని ఏఐసీసీ కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు కోదండరెడ్డి చెప్పారు. ప్రభుత్వం వద్దు కొనక రైతులు వడ్ల కుప్పలపైనే ప్రాణాలు వదిలారని ఆవేదన వ్యక్తం చేశారు. భూ రికార్డుల ప్రక్షాళనలో ప్రభుత్వం విఫలమైందని చెప్పారు. పంట నష్ట పరిహారం అందక రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారని గుర్తు చేశారు.

టీచర్ రిట్ డిస్మిస్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

పోక్సో యాక్ట్ సెక్షన్ 11 కింద నమోదైన కేసుల్లో మూడేండ్ల వరకు జైలు శిక్ష పడే కేసులు బెయిలబుల్ కాదని, కాగ్నిజబుల్ కేసులని హైకోర్టు తీర్పు చెప్పింది. ఐపీసీ కింద నమోదు చేస్తున్న ఆ తరహా కేసుల్లో మూడేండ్ల వరకు శిక్షపడే కేసులు నాన్ కాగ్నిజబుల్, బెయిలబుల్‌గా పరిగణిస్తున్నారని చెప్పి, పోక్సో యాక్ట్ కేసుల్లో కూడా ఆ విధంగా పరిగణించేందుకు లేదని స్పష్టం చేసింది. పాత మహబూబనగర్ జిల్లా, ప్రస్తుతం గద్వాల జిల్లాలో భాస్కర్ అనే ప్రభుత్వ టీచర్ తనపై పోక్సో యాక్ట్ కింద పెట్టిన కేసును కొట్టేయాలని హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై తుది ఉత్తర్వులు జారీ చేశారు.

బ్యాక్‌లాగ్ పరీక్షలకు

నామినల్ ఫీజులు నిర్ణయించాలి



ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్.మూర్తి

నవతెలంగాణ-ఓయూ

డిగ్రీ విద్యార్థులు బ్యాక్ లాగ్ పరీక్షలు రాయడానికి నామినల్ ఫీజులు నిర్ణయించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్.మూర్తి డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ ఓయూ కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఓయూ రిజిస్ట్రార్ ప్రొ.పి.లక్ష్మీనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మూర్తి మాట్లాడుతూ.. డిగ్రీ 2016-17, 18 బ్యాచ్ విద్యార్థులు బ్యాక్ లాగ్ పరీక్షలు రాసుకోవడానికి యూనివర్సిటీ అధికారులు చివరి అవకాశం ఇచ్చారని తెలిపారు. అయితే, ఒక్క పేపర్‌కు రూ.10,000 నిర్ణయించడం సరైంది కాదన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని బ్యాక్‌లాగ్ పరీక్షలు రాయడానికి నామినల్(తక్కువ) ఫీజులు చెల్లించే రకంగా నిర్ణయాలు ఉండాలని తెలిపారు. ఈ బ్యాచ్ విద్యార్థులకు కరోనా సమయంలో సంవత్సరం సమయం వృథా అయిందని, చివరి క్షణాల్లో పరీక్ష పెట్టారని చెప్పారు. సరైన సమయానికి పరీక్షలు నిర్వహించి ఉంటే ఈ సమస్య వచ్చేది కాదన్నారు. ఇన్ని వేల ఫీజులు చెల్లించలేమని విద్యార్థులు మానసికంగా బాధపడుతున్నారని, విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ ఓయూ అధ్యక్ష, కార్యదర్శులు ఆంజనేయులు, రవి నాయక్, విద్యార్థులు అరవింద్, శ్రీవాణి, కళ్యాణ్, దివ్య నాని, యాధులు పాల్గొన్నారు.

ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థుల పట్ల ప్రభుత్వం మొండి వైఖరి వీడాలి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు
- ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన చలో డీజీపీ కార్యాలయం ఉద్రిక్తత

నవతెలంగాణ- హిమాయత్‌నగర్

నెల రోజులుగా ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులు తమకు న్యాయం చేయాలని నిరసన తెలుపుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివ రావు అన్నారు. ఎస్ఐ, కానిస్టే బుల్ అభ్యర్థుల పట్ల ప్రభుత్వ మొండి వైఖరి విడనా డాలన్నారు. ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్ నారాయణగూడ చౌరస్తా నుంచి చేపట్టిన చలో డీజీపీ కార్యాలయం ముట్టడి కార్యక్రమం ఉద్రిక్తతకు దారి తీసింది. పలువురు నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లా డుతూ.. ప్రశ్నాపత్రాల్లో తప్పులను గమనించిన హైకోర్టు ఏడు మార్కులు కలపాలని తీర్పు ఇచ్చినా అమలు చేయకపోవడం అధికారుల నిర్లక్ష్య ధోరణికి నిదర్శనం అన్నారు. దేహదారుఢ్య పరీక్షలకు సంబంధించి నిర్దేశించిన ఈవెంట్ పూర్తిగా అశాస్త్రీయంగా ఉందన్నారు. మూడు ఈవెంట్స్‌లో ఏ రెండు ఈవెంట్స్‌కు అర్హత సాధించినా ఉద్యోగ అర్హత ఇవ్వాల్సి ఉండగా.. అందుకు నిరాకరిస్తుండటంతో లక్షలాది మంది అభ్యర్థులు, తల్లిదండ్రులు ఒత్తిడికి గురవుతున్నారన్నారు.

గతేడాదిలో అనేక పోరాటాలు

కొత్త ఏడాదిలోనూ కొనసాగిస్తాం

- ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు : మహేష్‌కుమార్‌గౌడ్ వెల్లడి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కాంగ్రెస్ పక్షాన గత సంవత్సరంలో ప్రజా సమస్యలపై అనేక పోరాటాలు చేశామనీ, కొత్త సంవత్సరంలోనూ కొనసాగిస్తామని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ చెప్పారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. శనివారం గాంధీభవన్‌లో మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి అనిల్‌కుమార్‌తో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. టీఆర్ఎస్ పాలనలో పబ్లిక్ 2022లో సంతోషంగా లేరని చెప్పారు. విద్యార్థులు, కార్మికులు, రైతులు, మహిళలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మన ఊరు మనపోరు అనేక పోరాటంతో ప్రజల్లోకి వెళ్లామని చెప్పారు. రాహుల్ భారత్ జోడో యాత్ర, వరంగల్ రైతు డిక్లరేషన్, వరి దీక్ష వంటి అనేక ఉద్యమాలు చేశామని తెలిపారు. 42 లక్షల డిజిటల్ మెంబర్‌షిప్ చేశామనీ, కాంగ్రెస్ మెంబర్ షిప్ వున్న వారికి రెండు లక్షల చొప్పున ప్రమాదబీమా ఇస్తున్నామని తెలిపారు. అనిల్ మాట్లాడుతూ అయ్యప్ప స్వామిని కించపరిచేలా మాట్లాడటం సరికాదన్నారు. మత సామరస్యాన్ని కాపాడుకుంటూ వస్తున్నామని చెప్పారు. అయ్యప్ప స్వామిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

పంచాయతీ రోడ్లు అద్దంలా ఉండాలి

- సకాలంలో పనులు పూర్తి చేయాలి
- కేంద్రం కావాలని నిధులు ఆపడం వల్ల ఇబ్బందులు : వీడియో కాన్ఫరెన్సులో మంత్రి ఎర్రబెల్లి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పంచాయతీ రోడ్లు అద్దంలా ఉండా లనీ, వర్షాకాలంలో మొదటి వర్షం పడేటప్పటికీ ఏ ఒక్క రోడ్డు మీద గుంత కనిపించొద్దని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అధికారులను ఆదేశించారు. రోడ్లపై గుంతలు ఉండకుండా, రోడ్లన్ని బాగుండేలా చర్యలు చేపట్టాలని సూచించాఆరు. శనివారం రంగారెడ్డి జిల్లా పరిషత్ కార్యాలయంలోని మంత్రి ఛాంబర్లో జిల్లాల సూపరింటెండెంట్ ఇంజనీర్లతో మంత్రి సమావేశమయ్యారు. కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, పంచాయతీ ఆఫీసర్లు, మండల పంచాయతీ ఆఫీసర్లు, డీఆర్‌వో అధికారులతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మొదటగా అధికారులు, సిబ్బందికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. సిబ్బంది కృషి వల్ల జాతీయ స్థాయిలో అనేక అవార్డులు వచ్చాయని గుర్తు చేశారు. ఈ స్ఫూర్తిని ఇదేవిధంగా కొనసాగించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి నిధులు విడుదల చేయకపోవడం వల్ల ఆర్థికంగా ఇబ్బంది ఏర్పడిందన్నారు. కేంద్రం నుంచి రూ.1100 కోట్లు రావల్సి ఉండగా వాటిని విడుదల చేయటం లేదని చెప్పారు. రైతు కల్లాల కోసం రూ.151 కోట్లు ఖర్చు చేయడం తప్పుగా భావించి రాష్ట్రానికి రావాల్సిన రూ.1100 కోట్లను కేంద్రం ఆపడాన్ని తప్పుబట్టారు. కేంద్రం ఇస్తున్న గ్రాంట్ కు సమానంగా గ్రాంట్ ఇస్తున్న ఏకైక ప్రభుత్వం తెలంగాణనే అన్నారు. సర్పంచులకు అన్ని విధాల అధికారాలు ఇచ్చామన్నారు. కొంతమంది సర్పంచులు ప్రభుత్వం చేస్తున్న పనులను గుర్తించకుండా అనవసరంగా బీజెపి ట్రాప్‌లో పడి ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారని చెప్పారు.ఎనిమిదేండ్లలో వచ్చిన నిధులు అంతకుముందు 50 ఏండ్లలో రాలేదన్నారు. ఈ కాన్ఫరెన్సులో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి కార్యదర్శి సందీప్ సుల్తానియా, ఇంజనీర్ ఇన్ చీఫ్ సంజీవ రావు, కమిషనర్ హనుమంతరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సంపాదకీయం

కొత్త ఆచరణలోకి...

మనకే ఈ కొత్తవన్నీ, నూతన ఆలోచనలకు వేసుకునే ప్రణాళికలన్నీ, ఒక గీతను, ఒక వత్సరాన్ని దాటి మరో అడుగు కొత్తగా వేయాలని, మళ్లీ మళ్లీ మనల్ని మనం పునర్విమర్శించుకుని, వివేచించుకుని పునర్లిఖించుకుంటాం కొత్త భావాల తోరణాలు కట్టుకుని. ఇది మనుషులుగా మనకే దక్కిన అవకాశం. ఆశల్నీ కలల్నీ పండించుకునే కృషి

> మనం కొత్త సంవత్సరంలోకి అడుగుపెడుతున్నాము. ఇది కేవలం రాజకీయ సమస్యనే కాదు, మనందరి బతుకు సమస్య భవిష్యత్తు సమస్య. అయితే ఈ సవాళ్లపై ప్రతిఘన కూడా మొదలవుతున్నది. రైతులు, కార్మికులు, పేద ప్రజలు, ఉద్యోగులు, సామాన్యులూ పోరాటంలోకి వస్తున్నారు. ఈ సమాజ దుష్టత్వంపై సమరం సాగించే సంవత్సరంగా నూతన సంవత్సరానికి ఆహ్వానం పలుకుదాం. మన భవిష్యత్తు మన చేతుల్లోనేవుంది. పదండి ముందుకు!

వలులం మనమే. ఆకాంక్షల నెరవేర్చుకోనేందుకు అడుగులు వేసే ఆచరణా మనదే. కాలం కదలుతూ ఉంది. ప్రకృతీ కదులుతోంది. వీటితో పాటుగానే సమాజమూ చలనంలోనే ఉంది. ఈ చలనంలోని మార్పులను అవగాహన చేసుకునే మేధస్సును కలిగున్నదీ మనమే. అందుకే ఈ మూల్యాంకనాలు, మళ్లీ కొత్తగా మొదలవ్వడాలు. పరిణామాల పరిశీలనలో పాఠం, జ్ఞాన రూపమై మేల్కొంటుంది. కొత్త అడుగును కంటుంది. అంతిమంగా ఆచరణే మనిషి మనుగడను నిలబెడుతుంది.

ట్వంటీ ట్వంటీత్రీలోకి అడుగుపెడుతున్న సందర్భాన మళ్లీ ఒకసారి మన స్థితిని మననం చేసుకోవాలి. అప్పుడు మాత్రమే భవిష్యత్తును ఎలా తీర్చుకోవాలో ఎరుకపడుతుంది. కాలం సహజమైనది. ప్రకృతీ సహజమైనదే. కానీ సమాజం మనం నిర్మించుకున్నది. మనకు మనమే మార్చుకొంటున్నది. అది బాగున్నా బాగాలేకపోయినా అది మన చైతన్య ఫలితం. ఇప్పుడు మనకెదురయ్యే సవాళ్లను ఎలా ఎదుర్కోవాలో తెలియాలి. ఒక ఉన్నత మానవ జీవనం సాగించడానికి సమాజాన్ని ఎలా నిర్మించుకోవాలో తెలియాలి. అందుకోసం ఆలోచన చేసే సందర్భమే కొత్త ఏడాది ఆరంభ దినం. అందరం మంచి జరగాలనే కోరుకుంటాం. ఆశలు నెరవేరాలని, చదువులో ఉత్తీర్ణులవ్వాలని, ఉద్యోగం దొరకాలని, ఆరోగ్యం



బాగుండాలని, దారిద్ర్యాలు పోవాలని, హింసా విధ్వంసాలులేని ప్రశాంత జీవనం గడపాలని, యుద్ధం ముగిసి శాంతి వెల్లివిరియాలని, మమతానురాగాలు, మానవీయ పరిమళాలు ప్రసరించాలని, ప్రేమ గెలవాలని, సత్యం విజయం పొందాలని... ఇలా అన్నీ జరగాలనే మనం కోరుకుంటాము. కానీ ఇవన్నీ యేండ్లుగా ఎందుకు సాధించలేకపోయామనే ఆలోచనా చేయాలి. కొందరికి కొన్ని సమకూరి ఉండవచ్చు. ఇంకొందరికి అనుకున్న దానికంటే ఎక్కువా దక్కవచ్చు. కానీ దక్కనివాళ్లే అధికం. దుఃఖమే అధికం, బాధలే అధికం, కన్నీళ్లే అధికం. మనకు దక్కాల్సిన సంతోషాలను, ఆనందాలను ఎవరో తన్నుకుపోతున్నారే విషయాన్ని తెలుసుకోవాలి. గత సంవత్సరాలలో - దేశంలో కరోనా, ఆర్థిక సంక్షోభాల కారణంగా జీవితాలు అతలాకుతలమైపోయాయి. నిరుద్యోగం పెరిగింది. పనికోల్పోయాము.. అసమానతలు పెరిగాయి. దవ్యోల్బనం పెరిగి రూపాయి విలువ దారుణంగా పడిపోయింది. దేశానికి అన్నం పెట్టే రైతన్న గొంతుకు ఉరితాళ్ళు ముసురుకున్నాయి. దారిద్ర్యం పెరిగింది. ఆకలి పెరిగింది. అనారోగ్యమూ పెరిగింది. నేరం పెరిగింది. అణచివేత, ప్రకృతి విధ్వంసమూ పెరిగింది. మరో ప్రక్కన సంపదంతా ఒకవైపునకు పోగుపడుతున్నది. ఒక్కశాతంగా ఉన్న జనాభా దగ్గర నలభైశాతం సంపద పోగుపడింది. గౌతమ్ ఆదానీ ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద సంపన్నుడుగా ఎదిగాడు. బడా కార్పొరేటు సంస్థలకు పదిలక్షల కోట్ల రూపాయల రుణాలను ప్రభుత్వం రద్దు చేసి, వారిని కాపాడుకున్నారు. కానీ రైతులు అప్పులతో తిప్పలు పడుతున్నారు. ప్రజలు నిర్మించుకున్న ప్రభుత్వ సంస్థలను ప్రయివేటుకు అప్పనంగా అప్పజెపుతున్నది. ధనవంతులకు దోచిపెడుతూ పేదల, అశేష ప్రజలపై భారాలను ప్రభుత్వాలు మోపుతున్నాయి.

ఈ చర్యలే సమాజంలో అశాంతికి, అలజడికి కారణమవుతున్నది. వీటిపై మాట్లాడటమో, పరిష్కరించడమో చేయకుండా పాలకులు కబుర్లు చెబుతున్నారు. ఉద్వేగాలను రెచ్చగొట్టి ప్రజల మధ్య విభజనను సృష్టిస్తున్నారు. సాంస్కృతిక జీవనంపైన దాడులను నిర్వహిస్తున్నారు. మనదేశ రాజ్యాంగ సూత్రాలను, విలువలను తుంగలో తొక్కుతున్నారు. 'నూతన భారతం' అనే అందమైన నినాదంతో మెజారిటీ వాదాన్ని ముందుకు తెచ్చి భిన్నత్వంలో ఏకత్వమనే భారతీయ జీవన సారాన్ని ధ్వంసమొనరుస్తున్నారు. ఇక న్యాయదేవత కండ్ల మూతతోపాటు నోటినీ కట్టేస్తున్నారు. ఎన్నికలు, ప్రజాస్వామ్యం ఒక ఈవెంట్ మేనేజ్‌మెంట్‌గా మార్చేసారు. ఓటు, నాయకుడు, ప్రభుత్వము అన్నీ ఇప్పుడు సరుకుగా మారిపోయి, అమ్మకాలు, కొనుగోళ్లుగా మారిపోయాయి. ఇప్పుడు నిలిచి వెలుగుతున్నది జ్ఞానం కాదు, ధనమూ, మత ద్వేషమూ.

ఈ పరిస్థితుల నుండి మనం కొత్త సంవత్సరంలోకి అడుగుపెడుతున్నాము. ఇది కేవలం రాజకీయ సమస్యనే కాదు, మనందరి బతుకు సమస్య భవిష్యత్తు సమస్య. అయితే ఈ సవాళ్లపై ప్రతిఘన కూడా మొదలవుతున్నది. రైతులు, కార్మికులు, పేద ప్రజలు, ఉద్యోగులు, సామాన్యులూ పోరాటంలోకి వస్తున్నారు. ఈ సమాజ దుష్టత్వంపై సమరం సాగించే సంవత్సరంగా నూతన సంవత్సరానికి ఆహ్వానం పలుకుదాం. మన భవిష్యత్తు మన చేతుల్లోనేవుంది. పదండి ముందుకు!

2023 స్వాగతగీతం... చైతన్య ప్రభాతం

కరిగిపోయిన కాలానికి వీడ్కోలు... అరుదెంచే రోజులకు ఆహ్వానం... ఇదో నిరంతర ప్రక్రియ. ప్రవాహం. కాలం విసిరే సవాళ్లకు జవాబు కూడా కాలమే. కాలమంటే కార్యాచరణే. మన కార్యక్రమాలే. ఎవరు కదలినా లేకున్నా కాలం కదలిపోతుంటుంది. గతవారం ముగిసిన 2022ను సమీక్షించుకుంటే ఈ వారం రాబోయే 2023ను స్వాగతించాలి. ఎలావుంటుందో అంచనా వేసి ఎలావుండాలో నిర్వచించుకోవాలి. నిర్ణయించుకోవాలి. "మంచి గతమున కొంచెమేనేయ్ మందగించక ముందుకడుగెయ్" అన్న గురజాడ మాటలైనా "పదండిముందుకు" అని చెప్పే శ్రీశ్రీ కవిత్వమైనా సందేశమదే. మనుషులు ఎప్పుడూ గతం కన్నా భవిష్యత్తు బాగుండాలని ఆశిస్తారు. అందుకోసం యథాశక్తి అడుగులు వేస్తారు. ఆశ ఆత్మవిశ్వాసం ఆశయబద్ధమైన ఆచరణ ఇవే మానవాళిని ముందుకు నడుపుతాయి. అందుకే ప్రపంచమంతా 2023 ఆగమన వేడుకలు చూస్తాం. అయితే ఈ వేళలో మనదేశంలో మాత్రం మతచాందస సంస్థలు ఇది మనకు సంబంధంలేని వ్యవహారమని ప్రకటిస్తున్నారు. నూతన సంవత్సర వేడుకలపై నిఘా వేస్తామంటున్నారు. 2022 ఏళ్లుగా సాగుతున్న వాటిని కాదని అంతకన్నా వెనక్కు వెళ్లాలనుకోవడం దేనికి సంకేతం? ఏవో సూక్తులు... సుభాషితాలు... వల్లించి మారేకాలంతో మనకు సంబంధంలేదని చెప్పడం, రాతియుగంలో పాతేయాల్సిన పాతకాలపు సరీసృపాలను నెత్తిన పెట్టుకోవడం దేశాన్ని ముందుకు నడిపించదు. ఇంకా ఇంకా ఇంకా వెనక్కు నెడుతుంది. ఇక్కడే మన కొత్త



తెలకపల్లి రవి

> అభ్యుదయం, ప్రజాస్వామ్యం లౌకిక తత్వం, సామ్యవాదం, శ్రామిక చైతన్యం వంటి మహత్తర ఆశయాలను అవహేళన చేస్తూ ఆలోచనా పరులను నిరుత్సాహ పరిచేందుకూ ప్రజలను తమ చుట్టూనే తిప్పుకోవడానికి పాలకవర్గాలు పొంచికూచుని ఉంటాయని గుర్తిస్తే ఇందులో ప్రతి అంశం ఎంత ముఖ్యమైందో బోధపడుతుంది. సరైన ప్రారంభమే సగం విజయం. "దేశమంటే మట్టి కాదోయ్... దేశమంటే మనుషులోయ్..." అన్నట్టే ఏడాది మొదట్లోనే సరైన దిశా నిర్దేశం చేసుకోగలిగితే దేశాన్ని సమాజాన్ని సంరక్షించుకోగల సత్తా సంతరించుకోగలం.

సంవత్సర కర్తవ్యాలు మొదలైపోయినట్టు చెప్పాలి. వాస్తవికతతో పొంతనలేని చాందసాలనూ వొంటెత్తు పోకడలను వదిలించుకోవడం మొదటి కర్తవ్యం.

విశాల భారత వికాసం

మతచాందసం అన్నాక ఒకటేవుండదు. భారతదేశం భిన్నమతాలకు విశ్వాసాలను నిలయం. పల్లె పట్టుల నుంచి పాలనా వ్యవస్థ వరకూ కూడా మతసామరస్యం మన దేశానికి దిక్సూచిగా నిలిచింది. హిందూ ముస్లిం తేడా లేకుండా ఉమ్మడి వేడుకలు ఇక్కడ సామరస్యాన్ని సహజీవనాన్ని చాటిచెప్పాయి. బ్రిటిష్‌వారి పాలనకుముందే ఇక్కడకు క్రైస్తవమూ ప్రవేశించింది. బౌద్ధం, జైనం, సిక్కు వంటివి అంతకుముందే ఉన్నాయి. ఈ భిన్న మతాల నిలయంగా ఈ దేశ సంస్కృతిని చరిత్రను అర్థం చేసుకోకపోతే ఈ దేశానికి భవిష్యత్తు ఉండదు. మతాలు అనేకం ఉన్నాయి గనకనే రాజ్యాంగ నిర్మాతలు మతాతీతమైన లౌకికతత్వం ఎంచుకున్నారు. కులం, మతం, ప్రాంతం, స్త్రీ, పురుష తేడాలు వంటివి పాటించని లౌకికతత్వం ఎంచుకున్నారు. రాజ్యాంగం 14వ అధికరణం నుంచి 25వరకూ ఈ సమానతాభావన మనకు గోచరిస్తుంది. ఏది ఎక్కువ ఏది తక్కువ అని గాక రాజ్యాంగం ప్రకారం నడుచుకోవడమే దేశానికీ మనుషులకూ శ్రేయస్కరం. స్వార్థరాజకీయాల కోసం ఇందుకు భిన్నమైన వాదనలు తెచ్చి అత్యధికంగా ఉన్న మతమే ఆధిక్యత వహించాలని అసహనానికి గురి కావడం అర్థరహితం. రాజకీయంగా ఇలాంటి సిద్ధాంతాలు ఎవరు చెప్పినా తోసిపుచ్చడం ప్రజాస్వామ్య స్పృహగల ప్రతివారి బాధ్యత. తాత్కాలిక అవకాశవాదాలకు ఆవేశకావేశాలకు గురై తమ మతాన్ని ఇతరులమీద రుద్దాలని చూడటం ప్రజల మధ్య చిచ్చు పెడుతుంది. తెలియకుండానే నిన్నటి మిత్రుడు లేదా ఇరుగు పొరుగు కూడా విడిపోయే విషమ పరిస్థితి దాపురిస్తుంది. దానివల్ల ఎవరికీ శాంతి సౌఖ్యాలు లేకుండా పోతాయి. కాబట్టి ప్రజల మధ్య ఐక్యతను సామరస్యాన్ని కాపాడుకోవడం కీలకం. ఇటీవలి అనుభవాలు ముఖ్యంగా గత ఏడాది చేసిన కొన్ని ఘటనలు చెబుతున్నదే. చాపకింద నీరులా చొరబడిన మతతత్వ రాజకీయాలను తోసిపుచ్చాల్సి ఉంటుంది. ఏ ఆధారంలేని కట్టుకథలు, విద్వేష వివాదాలకు మనం లోబడిపోకూండా జాగ్రత్త వహించాలి.

వాళ్లచుట్టే తిరగొద్దు

రాజకీయ రంగంలో ఏవో కొన్ని పాలక పార్టీలు (బీజేపీ, కాంగ్రెస్, వైసీపీ, తెలుగుదేశం, బిఆర్ఎస్... వంటివి) మాత్రమే శరణ్యమన్న భావన పోవాలి. పౌరులెవరైనా తమకూ దేశాన్ని మలచే హక్కు ఉంటుందని గుర్తించాలి. రాష్ట్రాలలోగాని, కేంద్రంలో గాని ఒకరిద్దరు నాయకులు, ఒకటి రెండు పార్టీలు, కొన్ని కులాల చుట్టూనే తిప్పుతూ అసలు సమస్యలు పక్కదోవ పట్టించే కుట్రలను అర్థం చేసుకోవాలి. బడా పార్టీల ఆధ్వర్యంలోని మీడియా సోషల్ మీడియా సంస్థలు పథకం ప్రకారం గుడుగుడు గుంచంలా అవే కథనాల చుట్టూ పరిభ్రమణం చేయిస్తున్నారనేది ప్రజలకు తెలియజెప్పాలి. రైతాంగం కార్మికులు ఉద్యోగులు మహిళలు సామాజికంగా దళితులు వెనకబడినవారిని తమ వలయంలో బందీలను చేయడం తప్ప సమగ్రంగా ఆలోచించే అవకాశం లేకుండా చేయడాన్ని ఛేదించాలి. వృథా వివాదాలు, బూతు పురాణాలు, కులాల కుంపట్లు రగలేసే రాజకీయాలను నిరసించాలి. సామాజిక న్యాయం సాధికారతో పాటు మౌలిక సమస్యలపై సమిష్టిగా పోరాడకుండా ఒరిగేది ఉండబోదని తెలియజెప్పాలి.

సంక్షేమ పథకాలు స్వాగతించినా సమూలమైన పరిష్కారం భూమి, ఉపాధి, జీవిత భద్రత, హక్కుల రక్షణతోనే ముడిపడి ఉంటుందని గుర్తించాలి. కుల, మత విభేదాలు ఏ పరిష్కారం సూచించలేవని స్పష్టంగా తెలుసుకోవాలి. గొప్పలెన్ని చెప్పుకున్నా పాలకపార్టీలు, నాయకులు అంతిమంగా అధికారం కోసం అర్రులు చాచేవారే. మౌలిక సమస్యలపై వారు ఎలాంటి నిర్దిష్ట ప్రతిపాదనలు చేయడం లేదనే వాస్తవాన్ని తెలుసుకోవాలి. సంక్షేమ పథకాలను అవహేళన చేయడం సరికానట్టే వాటిని ఏ ఒక్కరి దయాభిక్షగానో, వ్యక్తిగత ఉదారతగానో చిత్రించే ప్రయత్నాలనూ తోసిపుచ్చాలి. కేంద్ర రాష్ట్రాల పథకాలేవైనా అన్నీ ప్రజాధనంతో జరిగేవి ఈ పథకాలను ఇష్టానుసారం కుదించడం, కోతలకూ వడపోతలకూ గురిచేయడం నిలదీయాలి. పాలక పార్టీలన్నీ బీజేపీ, వైసీపీ, బిఆర్ఎస్, టీడీపీ, కాంగ్రెస్ వంటిపార్టీలతో సహా అధికారంలో ఉన్నప్పుడు లేనప్పుడు రెండు రకాలుగా మాట్లాడే ద్వంద్వనీతిని దుయ్యబట్టాలి. ఇటీవల ఏపీ ప్రజాస్వామ్య పునరుద్ధరణ సభలో సీపీఐ(ఎం) కార్యదర్శి శ్రీనివాసరావు చెప్పినట్టు హక్కుల హరింపు విషయంలో టీడీపీ పాలనా కాలం దృష్టిలో పెట్టుకుంటే భవిష్యత్తులో తాము ఏ విధంగా



వాటిని కాపాడేందుకు కట్టుబడివుంటామో స్పష్టం చేయాలి. తెలంగాణలోనూ బీజేపీపై పోరాటంలో బిఆర్ఎస్‌తో కలసి వ్యవహరించినా ప్రజల సమస్యలపై రాజీ ఉండబోదని సీపీఐ(ఎం) కార్యదర్శి తమ్మినేని వీరభద్రం చెప్పిందీ అదే. దేశమంతటా ప్రజా ఉద్యమాలపై, రాష్ట్రాల హక్కులపై దాడి చేసే బీజేపీని పల్లెత్తుమాట అనకపోతే అది ఏ విధంగానూ పరిష్కారం కాదన్నది సత్యం. నిరంతర ప్రయివేటీకరణ, బడా సంపన్నులకు లక్షలకోట్ల రాయితీలు బ్యాంకు సొమ్ముల ధారదత్తం, ఆర్థిక అంతరాల తగ్గింపు లక్ష్యాన్ని వమ్ము చేస్తున్నాయి. ఆర్థిక సామాజిక సాంస్కృతిక అణచివేతలు దోపిడీ పీడనలపై జమిలిగా పోరాడాలి తప్ప పెద్ద పార్టీల ప్రచారాలు నేతల కపట వాక్కులతో మోసపోకూడదు. మేడిపండులాంటి గ్లోబల్ మార్కెట్ బుడగలు వరుసగా పగిలిపోతుంటే వాటిపై శృతిమించిన ఆశలు పెంచుకోవడం అర్థరహితమని గ్రహించాలి. అమెరికా ఉపగ్రహం కావడం కాదు, స్వావలంబన తప్ప దేశానికి మరో ప్రత్యామ్నాయం ఉండదనే మెళకువ ఉండాలి. తక్షణ సమస్యగా సవాలు

> మౌలిక సమస్యలపై వారు ఎలాంటి నిర్దిష్ట ప్రతిపాదనలు చేయడం లేదనే వాస్తవాన్ని తెలుసుకోవాలి. సంక్షేమ పథకాలను అవహేళన చేయడం సరికానట్టే వాటిని ఏ ఒక్కరి దయాభిక్షగానో, వ్యక్తిగత ఉదారతగానో చిత్రించే ప్రయత్నాలనూ తోసిపుచ్చాలి. కేంద్ర రాష్ట్రాల పథకాలేవైనా అన్నీ ప్రజాధనంతో జరిగేవి ఈ పథకాలను ఇష్టానుసారం కుదించడం, కోతలకూ వడపోతలకూ గురిచేయడం నిలదీయాలి. పాలక పార్టీలన్నీ బీజేపీ, వైసీపీ, బిఆర్ఎస్, టీడీపీ, కాంగ్రెస్ వంటిపార్టీలతో సహా అధికారంలో ఉన్నప్పుడు లేనప్పుడు రెండు రకాలుగా మాట్లాడే ద్వంద్వనీతిని దుయ్యబట్టాలి.

విసురుతున్న కోవిడ్ వేరియంట్లు, ఐటి కుదుపులను తట్టుకోగల వ్యూహం కావాలి. ఇప్పటికే వెనకబడిన ఆర్థికాభివృద్ధి ఉత్పత్తి రంగం, పెరిగిపోయిన దిగుమతులు ,కేంద్ర రాష్ట్రాల రుణ ఊబి గురించి జాగ్రత్త వహించాలి తప్ప మోడీ సర్కారు భజన కీర్తనల బుట్టలో పడకూడదు.

దేశమంటే మనుషులోయ్!

సాంకేతిక మార్పుల యాజమాన్య పద్ధతుల మార్పులు, ప్రభుత్వ ప్రయివేటు నిఘాలలో చిక్కిన వ్యక్తిగత గోప్యత, స్వేచ్ఛ, నిర్వహణా స్వేచ్ఛ వంటివి కాపాడుకోవడం ఇక ప్రతివారికి పెద్ద అగ్నిపరీక్ష కాబోతున్నది. భావ ప్రకటనా స్వేచ్ఛ అనేది రాజకీయ సామాజిక కార్యకర్తలకో మీడియా వారికో మాత్రమే గాక గొప్ప రచయితలు కళాకారులకు కూడా మృగ్యమైపోతున్నది. ఇంకా విడుదల కాని పఠాన్ సినిమాలో నాయిక బికినీ ఏ రంగులో ఉన్నదనేదాన్ని బట్టి ముందస్తుగా నిషేధించడం గడచిన ఏడాడి చివరపాదంలో చూసిన విపరీతం. ఇందుకు తలవంచడం మొదలెడితే ఇంకా ఇంకా అణచివేత తప్పదు. కనుకనే అన్ని తరగతుల ప్రజలూ అన్ని స్రవంతుల సంఘాలూ సృజనకారులూ కూడా తమ హక్కులను తామే రక్షించుకోవడానికి సిద్ధం కావలసిందే. విద్యార్థులు విద్యా హక్కుకోసం అధ్యాపకులు బోధనా హక్కు కోసం కూడా ఉద్యమించవలిందే. ఉద్యోగ భద్రతకు ఘోరంగా కోతవేసి చాకిరీ పెంచే కొత్తకోడ్‌లపై కార్మికులు వేతన జీవులు కార్మికులు ఎలుగెత్తవలసిందే. వీటికి సమర్థనగా తెలివైన వాదనల తెచ్చే పరాన్న భుక్కు మేధావుల ప్రచారాలనూ తిప్పికొట్టవలసిందే. అభ్యుదయం, ప్రజాస్వామ్యం లౌకిక తత్వం, సామ్యవాదం, శ్రామిక చైతన్యం వంటి మహత్తర ఆశయాలను అవహేళన చేస్తూ ఆలోచనా పరులను నిరుత్సాహ పరిచేందుకూ ప్రజలను తమ చుట్టూనే తిప్పుకోవడానికి పాలకవర్గాలు పొంచికూచుని ఉంటాయని గుర్తిస్తే ఇందులో ప్రతి అంశం ఎంత ముఖ్యమైందో బోధపడుతుంది. సరైన ప్రారంభమే సగం విజయం. "దేశమంటే మట్టి కాదోయ్... దేశమంటే మనుషులోయ్..." అన్నట్టే ఏడాది మొదట్లోనే సరైన దిశా నిర్దేశం చేసుకోగలిగితే దేశాన్ని సమాజాన్ని సంరక్షించుకోగల సత్తా సంతరించుకోగలం.

నవ వసంతం...

రోజులు సాధారణంగా గడిచాయి.. నెలలు అలా అలా దొర్లాయి.. షరా మామూలుగా మరో ఏడాది కాలగర్భంలో కలిసి పోయింది. నేటి నుంచి కొత్త సంవత్సరం గమనంలోకి వచ్చి చేరింది. కొన్ని దేశాల మధ్య యుద్ధాలు.. రాజకీయ సంక్షోభాలు... ఆకలి... దరిద్రాలు... నిరుద్యోగుల ఎదురు చూపులు... రైతన్నల ఆత్మహత్యలు... హక్కుల కోసం కార్మికుల రణ నినాదాలు గతేడాది మార్మోగాయి. మతోన్మాదుల విద్వేషాగ్నులు... మహిళలపై విషనాగుల అరాచకాలు విలయతాండవం చేశాయి. పాలకుల విధానాలతో ధరలు ఆకాశాన్నంటి... సామాన్యుడికి చుక్కలు చూపించాయి. ఇలాంటి ఆశనిపాతాలు, ఆశ నిరాశల మధ్య 2022కి వీడ్కోలు పలికాం. 'ఉదయం కానే కాదనుకోవటం నిరాశ... ఉదయించి అట్లానే ఉందనుకోవటం దురాశ.. ఈ చీకటి ఉండదు... సూర్యుడు తప్పక ఉదయిస్తాడు...' అని ఓ కవి రాసుకున్నట్టు వ్యక్తిగత జీవితంతోపాటు వ్యవస్థీకృతంగానూ ప్రతీయేటా అనేక ఎత్తుపల్లాలు... ఒడిదుడుకులు సహజం. వాటన్నింటినీ తట్టుకుని మనిషి, సమాజం నిలబడాలి. అలా నిలబడి ముందుకు... మున్ముందుకు సాగాలి. దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన గాంధీ తాత బోసి నవ్వుల నుంచి ఇప్పుడిప్పుడే భూమ్మీదకొచ్చిన నవజాత శిశువుల అమాయకపు చిరునవ్వుల దాకా అందరి మోముల్లో సంతోషం వెల్లివిరియాలి. అందుకనుగుణంగా ప్రజల మధ్య చీలికల తెచ్చే పాలకుల కుయుక్తులను తిప్పికొట్టాలి. జై జవాన్... జై కిసాన్.. అనే నినాద స్ఫూర్తితో దేశ రక్షణ, రైతు పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరమూ కంకణబద్ధులం కావాలి. భగత్‌సింగ్ ఇచ్చిన 'ఇంక్విలాబ్ జిందాబాద్' అనే రణ నినాదాన్ని మోగిస్తూ హక్కుల సాధన కోసం అకుంఠిత దీక్ష బూనాలి. తద్వారా మనుషుల మధ్య ప్రేమాభిమానాలు, ప్రజల మధ్య ఐక్యత, దేశాల మధ్య సుహృద్భావాన్ని పాదుకొల్పాయి. అప్పుడే నూతన సంవత్సరం శోభాయమానం అవుతుంది. నవ వసంతం వెల్లి విరుస్తుంది. ఆ వసంత శోభ రావాలని మనస్ఫూర్తిగా ఆశిద్దాం... ఆకాంక్షిద్దాం...

-బి.వి.యన్.పద్మరాజు

ఏడాది యుద్ధం

అందరూ సాధారణంగా అనుకునే ముచ్చట ఏమిటీ అంటే యుద్ధం ప్రస్తుతం రష్యా, ఉక్రెయిన్‌కు మధ్య అని. కానీ, అసలు యుద్ధం జరిగేది రష్యా, అమెరికా పెత్తనం చేసే నాటో దేశాలకు మధ్య అని చాలా తక్కువ మందికి తెలుసు. చిన్న దేశమైన ఉక్రెయిన్‌తో రష్యా సంవత్సరం మొత్తం యుద్ధం చేయడం ఏంటా? అని వ్యంగ్యోక్తులు విసురుతున్న వారు సైతం లేకపోలేదు. అమెరికా జీడీపీలో దాదాపు 40శాతం ఆదాయం ఆయుధాల వ్యాపారం మీదే నడుస్తున్నది. ఆయుధాలు అమ్మకుండా బతికే పరిస్థితి ఆ దేశానికి లేదనేది అందరికి తెలిసిన సంగతేనాయే. ఆసంస్కృతే ఆదేశంలోనూ ఓపెన్ ఫైరింగ్ ఘటనలకూ కారణం. విచ్చలవిడిగా ఆయుధాలు కూరగాయల్లా అమ్మే పరిస్థితి చూస్తూనే ఉన్నాం. అమెరికా స్కూళ్లో చిన్న పిల్లలు, ఉపాధ్యాయులపై గత రెండు, మూడేండ్లుగా మూకుమ్మడి కాల్పులు జరిపిన సంఘటనలు కొకొల్లలు. కాకపోతే, దొంగచాటు వ్యాపారాలు చేయడం, ప్రపంచ దేశాలను ఏమార్చడం అమెరికాకు వెన్నతోపెట్టిన విద్యేనాయే. ఇప్పుడు అదే ఆయుధాలను యుద్ధం పేర ఉక్రెయిన్‌కు అమ్ముకుంటున్నది అమెరికా. గతంలో గల్ఫ్‌పై పెత్తనం చేసింది కూడా ఎందుకో తెలుసా ? చమురు కోసమే సుమా !!

- బి.బసవపున్నయ్య

అంటిరి... ఆగమైతిరి...

కాంగ్రెస్ పార్టీ నూతన పదవులపై సీనియర్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. అసంతృప్తి చెందారు. విమర్శల వర్షాన్ని కురిపించారు. తుదకు చతికిలపడ్డారు. ఇవతలి నుంచి సంపూర్ణ మద్దతు లభించకపోవడంతో వారి కథ కంచికి చేరింది. రివర్సయింది. అధిష్టానం చీవాట్లు పెట్టింది. హెచ్చరికలు చేసింది. అంతేకాకుండా వారు పార్టీ నుంచి పోతేపోనిలే అనే సంకేతాలిచ్చింది. మరోవైపు ఎన్నికలు రాబోతున్నాయి. ఒకవైపు రేవంత్‌రెడ్డి పాదయాత్ర సమయం దగ్గరపడుతుంది. కచ్చితంగా క్యాడర్ పాదయాత్రలో నడవాల్సిందే. ఎవరు రాకపోయినా రేపటి పరిస్థితి ఏంటి? అనే మీమాంసంలో సీనియర్లు మదనపడుతున్నారు. చివరికి గాంధీభవన్ మెట్లు ఎక్కేందుకు వారికి ఇగో అడ్డుపడుతున్నది. వివిధ కార్యక్రమాలకు దూరంగా ఉంటూ... చివరికి ఎటుపోతారనే చర్చ మొదలైంది. మాటల్లేవ్, మాట్లాడుకోవడాల్లేవ్ అన్నట్టు రేవంత్‌తో సీనియర్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పుడు రెంటికి చెడ్డ రేవడిలా తయారైంది సీనియర్ల పరిస్థితి. పార్టీ మారుతారనే ప్రచారం ఊపందుకుంది. సోషల్ మీడియా పార్టీమార్పుపై హోరెత్తిస్తున్నది. ఇదే పరిస్థితి ఎక్కువ కాలం కొనసాగితే రానున్న ఎన్నికల్లో వారి టికెట్‌పై ప్రభావం పడే అవకాశం ఉందనే గుబులు రేగుతున్నది. సందట్లో సడేమియా అన్నట్టుగా వారి నియోజకవర్గాల్లో ద్వితీయ శ్రేణి నేతలు దూసుకొస్తున్నారు. మేము సైతం ఎన్నికల్లో పోటీకి సిద్ధమంటూ సైరన్ మోగిస్తున్నారు. ఆ ప్రవాహాన్ని తట్టుకోలేక, అధిష్టానాన్ని ప్రసన్నం చేసుకోలేక 'పెద్ద తలకాయలు' గిలగిల కొట్టుకుంటున్నారు. పార్టీకి దూరమైన నేపథ్యంలో ఎవరైనా రాయబారం చేసి... తమకు ఆపన్న హస్తం అందిస్తే మళ్లీ కార్యక్రమాల్లో చేరాలని వారు తహతహలాడుతున్నారు. లేకపోతే మనసు మార్చుకుని కమలం పువ్వు చెవిలో పెట్టుకునేందుగానీ, కారెక్కేందుకుగానీ వారు వెనుకాడబోరంటూ గాంధీభవన్ కోడై కూస్తున్నది.

- గుడిగ రఘు



పుస్తకం

పుస్తకం అమ్మ వంటిది
చదివితె కమ్మగుంటది
ప్రతి మాట ప్రతి పుట
నోటికి కూడౌతది-
మెదడుకు పదునుపెడతది ॥పుస్తకం॥
నేటి మనుషులంత
నాటి కోతి సంతతని
తరాలు చెమటోడ్చి
అవతారం మార్చిరంటది-
శాస్త్రాలు నేర్చిరంటది ॥పుస్తకం॥
రాత్రి దెయ్యం రాదు
రాయి దైవం కాదు
మూఢముచ్చు ఆచారాలు
విడవమంటది-
వివరం చూపెడతది ॥పుస్తకం॥
తిత్తుల కొలిమితీసి
విద్యుత్తును వెలిగించి
విమానాలు ఎగరేస్తే
విశ్వమంత తిరుగునంటది
తంత్రి వార్త మోయునంటది ॥పుస్తకం॥
పల్లె తొలిదని పట్నం మలిదని
నిజమన్నదె నిలుచునని
నీతికె జయమగునని
మనిషి కథలు చెపుతది
-మహాత్ములను చేస్తది
॥పుస్తకం॥

డా బెల్లి యాదయ్య
9848392690

గుండెలో చోటుంది

"మాకెప్పుడూ ప్రజల గురించే ధ్యాస. వాళ్ళను లివర్‌లో పెట్టుకొని చూసుకుంటాం" నాయకుడు చెప్పుకుంటూ పోతున్నాడు. కొత్త సంవత్సరం కాబట్టి కొత్తగా చెప్పుకొస్తున్నాడేమో అని అందరూ వింటున్నారు.

"సార్...!!??" అసిస్టెంటు అరిచాడు వెనుకనుండి.

"ఏం జరిగిందిర భై" మైకును మూసేసి అడిగాడు.

"సార్, గుండెల్లో... గుండెల్లో పెట్టుకుని చూసుకుంటాం..." అన్నాడు ఆ అసిస్టెంటు.

ఇదంతా ప్రజలు వింటున్నారన్న విషయం కనిపెట్టిన నాయకుడు మళ్ళీ మొదలుపెట్టాడు

"నా అసిస్టెంటే లివర్‌లో కాదు, గుండెలో పెట్టుకుంటాను అని అనమంటున్నాడు. నేను సరిగ్గానే అన్నాను. అందరూ గుండెలో పెట్టుకుంటే కొత్తేముంటుంది. అందుకే నేను లివర్ అన్నాను. తప్పా?" కొత్తదనం కోసం తాను ఆరాటపడతానని ప్లేటు ఫిరాయించాడు చాకచక్యంగా.

"లేదు లేదు" తన ప్రతి మీటింగులోనూ ఉండే అనుచరులు గట్టిగా అరిచారు.

"లివరంటే కాలేయం, కాలేయమంటే లివర్, ఇసుమంటి విషయాలు అందరూ తెలుసుకోవాలి మరి..."

సభ మొత్తం చప్పట్లు.

"గడ్డదీ లివర్ పవర్. ఎక్కువరిస్తే మా పార్టీ గుర్తు ఇప్పుడున్నది తీసేసి లివర్ గుర్తు పెట్టుకుంటాను. ఎవరికైనా అభ్యంతరమా?"

"లేదు లేదు" అనుచరులు, తిరిగి చప్పట్ల మోత.

"ఇంతకీ గుండెనా లివరా అని అనుమానం రావచ్చు. నేను మజాకుకైనా మజాకు చేయను. ఈ మధ్యనే లివర్ గురించి చదివాను. ఎవరో ఒకాయన కూతురు తనకు లివర్ దానం చేసిందని ఆయనే చెప్పాడు. మొత్తం లివర్ ఇస్తే ఆ బిడ్డ పరిస్థితి ఏందని, తన జిందగీ అంతా పరేషాన్ కాదా అనీ అడిగా. లివర్ మొత్తం గట్ల తీసేసి గిట్ల పెట్టరంట. కొంచెం కోసి పెడతారంట. గది పెట్టుకున్న నాయనకు మొత్తం లివర్ తయారవుతుందంట. ఈ బిడ్డకీ తను ఇచ్చిన లివర్ తనకొచ్చేస్తుందంట. ఇచిత్రమే కదా..."



జంధ్యాల రఘుబాబు
9849753298

చప్పట్ల మోత. అనుచరులు ఆనందపడిపోయారు. మా సారు శంకర్ దాదాకు మించిన తెలివితేటలున్నోడు అని మనసులో అనుకున్నారు. ఈమధ్య పాదయాత్రలు చేస్తూ మా బాసుకు బుద్ధి పెరిగిపోయిందనుకున్నారు కూడా. వాళ్ళలో ఒకడు మెల్లిగా నిజం చెప్పాడు. "ఈ మధ్య తాగి తాగి సారు కాలేయం బాగా చెడిపోయిందని డాక్టరమ్మ చెప్పిందంట. అందుకే గుండె ఎందుకు లివర్ ఇస్తామంటున్నాడు."

"మొన్న ఎన్నో వైద్య కళాశాలలు కట్టిస్తామన్నారు. నేనొక్కటే చెబుతున్నా... ఆ కాలేజీలన్నింటిలో లివర్ మార్చే ఏర్పాటు మా పైనోళ్ళకి చెప్పి నేను పెట్టిస్తా..." అని అనుచరుల వైపు చూశాడు. ఇప్పుడు వారితో పాటు స్టేజి మీద ఉన్నోళ్ళు ఒకటే చప్పట్లు. పరుగులు పెట్టే బండి ఎలా ఆగదో మన నాయకుడి ఉపన్యాసం కూడా ఆగకుండా పోతోంది. అందుకే ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజన కింద రోడ్లేసినారేమో అనుకునేలాగ ఉంది ఆయన జోరు. ఇంతలో ఒక అనుచరుడొచ్చి సార్ మీరు వాళ్ళు కట్టిచ్చే మెడికల్ కాలేజిల గురించి చెబుతున్నారని వెనక కూచున్న సారు చెబుతున్నాడు అనే సరికి స్పీడుతో పోతున్న ఉపన్యాస బండి కొద్దిగా నెమ్మదించింది.


ఎన్నికలనగానే ప్రజలు గుర్తొస్తారు. వాళ్ళను తమ గుండెలో పెట్టుకుంటామన్న డైలాగులూ గుర్తొస్తాయి. నిజంగానే ప్రజలకు సేవ చేస్తున్నోళ్ళను ఎవరైనా ఒప్పుకోవాల్సిందే, సందేహం లేదు. వారికి చేతనైనంత సహాయమూ చేయాలి. అంతే కాని పొద్దస్తమానమూ ప్రజల్ని ఎలా మింగాలి అనుకునేవాళ్ళ గురించి ప్రజలకు చెప్పాలి. ఎవరేమనుకున్నా సరే. ఇదంతా కూడా ప్రజల కోసమే. ఒక గుండె డాక్టరు మీటింగులో తమాషాగా చెప్పిన విషయం. అదేమంటే... ఎవరినైనా మీది విశాల హృదయం అని పొగడొద్దు అని చెప్పాడాయన. ఎందుకంటే విశాల హృదయమంటే హార్ట్ ఎన్లార్జ్ అని అర్థమట. అంటే ఒక రకమైన గుండె జబ్బులో గుండె తన సైంజును మించి కొద్దిగా పెరుగుతుందన్నమాట. అలా ఎన్నికల రోగాలు వచ్చినప్పుడు ఆటోమ్యాటిక్కుగా



నాయకుల గుండెలు పుష్పాల్లాగా విచ్చుకుంటాయి, విశాలమైపోతాయి. ఎన్నికలు అయిపోయిన వెంటనే మళ్ళీ ముడుచుకుంటాయవి. అలా కొన్ని పూవ్వులు విచ్చుకోవడం, ముడుచుకోవడం మనం చూడొచ్చు. ఎన్నికలున్నా, లేకున్నా కొన్ని హృదయాలు ఎప్పుడూ విశాలంగానే ఉంటాయి. వారిని గమనించాలి.

అందుకే ఎవరి గుండెలో ప్రజలకు చోటుందో,

> ఎన్నికలనగానే ప్రజలు గుర్తొస్తారు. వాళ్ళను తమ గుండెలో పెట్టుకుంటామన్న డైలాగులూ గుర్తొస్తాయి. నిజంగానే ప్రజలకు సేవ చేస్తున్నోళ్ళను ఎవరైనా ఒప్పుకోవాల్సిందే, సందేహం లేదు. వారికి చేతనైనంత సహాయమూ చేయాలి. అంతే కాని పొద్దస్తమానమూ ప్రజల్ని ఎలా మింగాలి అనుకునేవాళ్ళ గురించి ప్రజలకు చెప్పాలి. ఎవరేమనుకున్నా సరే. ఇదంతా కూడా ప్రజల కోసమే.



ఆ ప్రజల గుండెల్లో కూడా నాయకులకు చోటుంటుంది. నాది పుష్పక విమానం లాంటి గుండె, ఎందరికైనా చోటుంటుంది. ఏ రాష్ట్రంలోనైనా ఆ గుండె తెరుచుకుంటుంది అనే రకం నాయకులూ మన చుట్టే ఉంటారు. వాళ్ళ గుండె చప్పుడు లబ్ డబ్ అని కొట్టుకుంటుందా లేక లబ్బు డబ్బు అని కొట్టుకొని తరువాత డబ్బు డబ్బు అని కొట్టుకుంటుందా! ఆ డబ్బున్నోళ్ళకే అన్నీ కట్టబెట్టి కుబేరుల్ని చేస్తున్నారా! అన్న విషయం కూడా చూడాలి. నీ భక్తుని గుండెలో ఖైదీగా ఉండాలని, అని పాడుకున్నట్టు ఆ పరమ భక్తుల గుండెల్లో అలా కనిపించి ఇలా మాయమయ్యే ప్రజలను చూడొచ్చు. తరువాత కొలువై ఉండే బడా బాబులనూ చూడొచ్చు నిరంతరం. సీట్లివ్వడానికి ఆ బడాబాబుల లిస్టులు తయారు చేయడమూ చూడొచ్చు. మా లిస్టులోనూ బడాబాబులున్నారు. మా గుండెల్లో కూడా ఉన్నారు అని వారికంటే కొద్దిగా తేడాగా ఉన్నోళ్ళూ అనొచ్చు.

ప్రజలు ఈ గుండెలను చూస్తూనే ఉంటారు. ఆ గుండెలకు ఎప్పుడు పరీక్షలు చేయాలో, ఎప్పుడు స్టెంట్లు వేయాలో వారికి బాగా తెలుసు. కొత్త సంవత్సరంలో కొత్తగా ఎవరెవరు ఏ ఎత్తులు వేస్తారో, ఎన్ని జిమ్మిక్కులు చేస్తారో ఇంకా బాగా గమనించి ఆ గుండెల్ని కొత్తగా చేసుకునే పవరూ ఉంది ప్రజలకు. అందుకే వారందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు...

ఉద్యమాలంటే అబ్బాయిలకే సాధ్యం... అమ్మాయిలు అంతగా బయటకు రాలేరు. పైగా బాధ్యతలు తీసుకోవడానికి వెనకాడతారు. ప్రతి దానికీ భయపడతారు... మహిళల పట్ల ఇలాంటి ఆలోచనలు ఇంకా మన సమాజంలో కొనసాగుతూనే ఉన్నాయి. కానీ ఇకపై వీటికి కాలం చెల్లిపోయింది అంటూ ఎంతో మంది మహిళా నాయకులు ముందుకు వస్తున్నారు. ఉద్యమాల హారులో ఆణిముత్యాల్లా వెలిగిపోతున్నారు. వారిలో సంగీత ఒకరు. ప్రస్తుతం ఎస్.ఎఫ్.ఐ అస్సాం రాష్ట్ర కార్యదర్శిగా బాధ్యతలు చూస్తున్నారు. ఇటీవల తమ సంఘ అఖిల భారత మహాసభల్లో పాల్గొనేందుకు హైదరాబాద్ వచ్చిన ఆమెతో మానవి సంభాషణ...

అమ్మాయిలకు నమ్మకం కల్పించాలి



విద్యార్థి ఉద్యమంలోకి ఎలా వచ్చారు?

చిన్నప్పుడు మా అమ్మానాన్నతో కలిసి అనేక కార్యక్రమాల్లో పాల్గొనేదాన్ని. నాన్న డాక్టర్ అపూర్వ కుమార్ దాస్. అమ్మ గులాప్పీ దాస్, టీచర్‌గా చేసేవారు. వీళ్ళు కూడా ఎస్.ఎఫ్.ఐలో పని చేశారు. హైస్కూల్లో చదివేటపుడే ఎస్.ఎఫ్.ఐలో సభ్యత్వం తీసుకున్నాను. అప్పట్లో స్కూల్ కెప్టెన్‌గా ఉండేదాన్ని. సభ్యత్వం తీసుకున్నప్పుడు వాళ్ళు ఇచ్చిన రిసిట్ వెనుక వైపు సంఘం లక్ష్యాలు ఉండేవి. అవి నాకు బాగా నచ్చాయి. అందరికీ ఉచిత విద్య అందించాలనే డిమాండ్ నన్ను బాగా ఆకర్షించింది. ఇంటర్‌కి వచ్చే వరకు కమిటీల్లో లేకపోయినా సీనియర్ అక్క వాళ్ళతో కలిసి కార్యక్రమాలకు మాత్రం వెళ్ళేదాన్ని. డిగ్రీకి వచ్చిన తర్వాత కూడా కేవలం కార్యక్రమాలకు మాత్రమే తీసుకెళ్ళేవారు. ఎలాంటి సమావేశాలకు నన్ను తీసుకుపోయేవారు కాదు. దాంతో కోపం వచ్చి నన్ను కార్యక్రమాలకు తప్ప సమావేశాలకు తీసుకుపోవడం లేదని, కమిటీలో పెట్టుకోవడం లేదని మా అమ్మ వాళ్ళకు కంప్లెయింట్ ఇచ్చాను. అప్పుడు "నీకు కమిటీలో ఉండడం ఇష్టమేనే" అని అడిగారు. వుంటానని చెప్పాను. అప్పుడు డిగ్రీ మొదటి సంవత్సరంలో ఉన్నాను. నా సబ్జెక్ట్ సైన్స్. అందరితో కలిసి మహాసభలకు వెళ్ళాను. సైన్స్ కోర్సులో ఉన్న వాళ్ళు అక్కడకు చాలా మంది వచ్చారు. అంతకు ముందు వరకు సంఘాలంటే కేవలం ఆర్ట్స్ వాళ్ళే ఉంటారు అనే ఒక పొరపాటు ధోరణి ఉండేది. అక్కడకు వెళ్ళాక నా ఆలోచన మారిపోయింది. అప్పటి నుండి యాక్టివ్‌గా పని చేయడం మొదలుపెట్టాను. పోటీ పడి మరీ మా కాలేజీలో సభ్యత్వం చేసేదాన్ని.

మీ కాలేజీలో ఎస్.ఎఫ్.ఐకి అనుకూలమైన వాతావరణం ఉండేదా?

లేదు. సభ్యత్వ చేస్తుంటే మా ప్రిన్సిపల్ నన్ను కోప్పడేవారు. కాలేజీలోకి రాజకీయాలు ఎందుకు తీసుకొస్తున్నావు అనేవారు. సైన్స్ వాళ్ల మీరు చదువుకోవాలి ఇవన్నీ మీకు అవసరమా అనేవారు. కానీ నేను మాత్రం ఇవి రాజకీయాలు కాదు. విద్యార్థుల సమస్యలపై పని చేసే సంఘం అనేదాన్ని. పైగా స్టూడెంట్స్‌ను మేమేమీ సభ్యత్వం కోసం బలవంతం చేయడంలేదు. వాళ్ళ ఇష్ట ప్రకారమే తీసుకుంటున్నారు. ఇందులో ఇబ్బంది పడాల్సిన అవసరం ఏముందని వాదించేదాన్ని. దాంతో ఏమీ అనేవారు కాదు.

మీరు చదివిన యూనివర్సిటీలో అనుభవాలు?

2010లో పీజీ కోసం గౌహతి యూనివర్సిటీలో చేరాను. నా ఉద్యమ జీవితంలో ఇది ఒక టర్నింగ్ పాయింట్‌గా చెప్పుకోవచ్చు. అక్కడ పని చేయడం చాలా కష్టంగా ఉండేది. అల్ అస్సాం స్టూడెంట్స్ యూనియన్(ఏఏఎస్‌యు) అని ఉండేది. వాళ్ళు బాగా డామినేట్ చేసేవారు. అంతా వాళ్ళ హవానే నడిచేది. ఎస్.ఎఫ్.ఐ మీటింగ్ జరుగుతుంటే వచ్చి వార్నింగ్ ఇచ్చేవారు. హాస్టల్‌కి వెళ్ళి బెదిరించేవారు. దాంతో కొంత మంది భయపడి వెళ్ళిపోయేవారు. అలాంటి పరిస్థితుల్లో పని చేశాం. అయితే మా క్లాస్ వాళ్ళు నాకు చాలా సపోర్ట్ చేసేవారు. సైన్స్ కోర్సు కాబట్టి నేను కార్యక్రమాల కోసం వెళ్ళినపుడు టెండెన్స్ విషయంలో కూడా హెల్ప్ చేసేవారు.

మిమ్మల్ని ప్రభావితం చేసిన అంశాలు?

2012లో మధురైలో జరిగిన ఎస్.ఎఫ్.ఐ ఆలిండియా మహాసభలకు ఆహ్వానితురాలిగా వెళ్ళాను. అది నా జీవితంలో చాలా మార్పు తీసుకొచ్చింది. అంతకు ముందే పీహెచ్‌డీ చేయాలని నిర్ణయించుకున్నాను. మధురై నుండి అటు నుండి అటే ఇంటర్వ్యూకి వెళ్ళాను. అక్కడ అంతా బాగా జరిగింది. కానీ తర్వాత తెలిసింది. ఎవరికి సీటు ఇవ్వాలో ముందే నిర్ణయించుకున్నారు. నేను ఇంటర్వ్యూకి వెళ్ళినా ఉపయోగం లేకుండా పోయింది. ఆ తర్వాత కొద్ది రోజులకు మా నాన్న ప్రమాదవశాత్తు చనిపోయారు. చాలా కుంగిపోయాను. ఆ సమయంలోనే పూర్తికాలం కార్యకర్తగా పని చేయాలని నిర్ణయించుకున్నాను. ముందు మా అమ్మ ఒప్పుకోలేదు. బాగా వ్యతిరేకించింది. ఉద్యోగం లేకపోతే ఎలా బతుకుతావు, తర్వాత నీ జీవితం ఏంటి అంటూ బాధపడింది. చావనైతే చావను కచ్చితంగా బతికే



ఉంటాను" అని సమాధానం చెప్పాను. దాంతో ఇక ఏమీ అనలేపోయింది. ఎస్.ఎఫ్.ఐలో పని చేస్తూనే కొంత కాలం ట్యూషన్లు చెప్పుకునేదాన్ని. డబ్బు కోసం ఇంట్లో అడగటం ఇష్టం లేదు. వాటితోనే నా అవసరాలు తీర్చుకునేదాన్ని. మిగిలిన డబ్బు ఎస్.ఎఫ్.ఐ కార్యక్రమాలకు వాడేదాన్ని. ఒక కోచింగ్ సెంటర్ కూడా ప్రారంభించాను. ఇందులో ఎక్కువ మంది ఎస్.ఎఫ్.ఐ వాళ్ళే ఉండేవారు. కానీ ఇటు ఉద్యమాలు, అటు కోచింగ్ సెంటర్ సమయం సరిపోయేది కాదు. దాంతో దాన్ని వేరే వాళ్ళకు ఇచ్చేసి పూర్తిగా ఎస్.ఎఫ్.ఐకే సమయం కేటాయించేదాన్ని. అస్సాంలో జరిగిన గత అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేశాను. మూడో స్థానంలో వచ్చాము. ఈ సమయంలో ప్రజల్లో తిరుగుతూ చాలా నేర్చుకునే అవకాశం వచ్చింది.

ప్రస్తుతం మీ రాష్ట్రంలో విద్యార్థుల పరిస్థితి ఏంటి?

2016లో రాష్ట్రంలో చాలా మార్పు వచ్చింది. కాంగ్రెస్ వాళ్ళందరూ బీజేపీలోకి వెళ్లిపోయారు. విద్యా రంగంలో కూడా చాలా మార్పు వచ్చింది. స్కాలర్ షిప్‌లు తగ్గిపోయాయి. మహిళలపై వివక్ష, దాడులు పెరిగిపోయాయి. జోర్‌హత్ జిల్లాలో సుబ్బలక్ష్మి అనే అమ్మాయి ఉండేది. హాస్టల్‌కి వెళుతుంటే అబ్బాయిలు ఆమెతో అసభ్యంగా ప్రవర్తించారు. ఆ రాత్రి అమ్మాయి తనకు జరిగిన అన్యాయాన్ని ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేసింది. ఆమె ఒక రచయిత. దాంతో చాలా మంది ఆ పోస్ట్‌ను షేర్ చేశారు. సోషల్ మీడియాలో బాగా ప్రచారం అయ్యింది. అప్పుడు ఎస్.ఎఫ్.ఐగా దీనిపై పెద్ద పోరాటం చేశాము. స్టాండ్ విత్ సుబ్బలక్ష్మి అనే నినాదంతో ఉద్యమం మొదలుపెట్టాము. అన్ని విద్యా సంస్థలు, యూనివర్సిటీలకు వెళ్ళి విద్యార్థులను సమీకరించాము. అనేక కమిటీలు ఏర్పాటు చేసి వారిని ఈ ఉద్యమంలోకి తీసుకొచ్చాము. ఫలితంగా వీధి లైట్లు వచ్చాయి. నగర శివార్లలో, హాస్టల్స్ దగ్గర, కాలేజీల దగ్గర సెక్యూరిటీ పెట్టారు. యూనివర్సిటీలో ఈ ఉద్యమం బాగా జరిగింది. అమ్మాయిల్లో కాస్త ధైర్యం వచ్చింది. వారి సమస్యలను బయటకు వచ్చి చెప్పుకోవాలనే ఆలోచన వచ్చింది. తమకు ఏదైనా సమస్య వస్తే ఎస్.ఎఫ్.ఐ అండగా ఉంటుంది అనే నమ్మకం వారికి వచ్చింది. తర్వాత కూడా అనేక ఉద్యమాలు చేశాం. నాపైన మూడు కేసులు కూడా పెట్టారు.

అమ్మాయిలు ఉద్యమాల్లో రావడానికి సిద్ధంగా ఉన్నారా?

ఉన్నారు. అయితే అనేక సమస్యల ఉన్నాయి. ముందు వాళ్ళకు నమ్మకం కల్పించాలి. అందుకే మేము అమ్మాయిలకు ప్రత్యేకంగా సబ్ కమిటీ ఏర్పాటు చేసుకున్నాము. ఈ కమిటీ ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు చేయాలి. వాళ్ళల్లో నాయకులు తయారు చేయాలి. మాకు అక్కడికి వెళితే రక్షణ ఉంటుంది, ధైర్యం వస్తుంది అనే నమ్మకం కల్పించాలి. ఆ నమ్మకాన్ని ఎస్.ఎఫ్.ఐ వాళ్ళకు ఇవ్వాలి. ప్రస్తుతం జిల్లా అధ్యక్షకార్యదర్శులుగా, రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులుగా అమ్మాయిలు వస్తున్నారు. బాధ్యతలు తీసుకుంటున్నారు. ఎంతో చురుగ్గా పని చేస్తున్నారు. కాబట్టి అవకాశాలు ఇస్తే కచ్చితంగా తామేంటో నిరూపించుకునే శక్తి అమ్మాయిలకు ఉంది. అయితే సమాజ ప్రభావం అందరిపైనా ఉంటుంది. అలాగే పురుషాధిక్య భావజాలం మాలోపల కూడా ఉంటుంది. వాటి నుండి బయటపడేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. మరో విషయం అమ్మాయిలను అమ్మాయిలే తీసుకురావాలి అనే ఆలోచన వుంది. ఇది సరైనది కాదు. కమిటీ మొత్తం దానిపై కృషి చేయాలి. బాధ్యత తీసుకోవాలి.

మీకు నచ్చిన నాయకులు?

నచ్చిన నాయకులంటే ఇద్దరు ఉన్నారు. ఫిడేల్ కాస్ట్రో, భగత్‌సింగ్. వీరు నా స్ఫూర్తిదాయక నాయకులు. అలాగే ఇక్కడకు వచ్చిన తర్వాత మల్లు స్వరాజ్యం గారి జీవితం గురించి తెలుసుకున్నాను. చాలా స్ఫూర్తిదాయకమైన వ్యక్తిత్వం ఆమెది. ఆమె గురించి వింటుంటే చాలా గర్వంగా అనిపించింది.

ఎస్.ఎఫ్.ఐ రాష్ట్ర కార్యదర్శిగా ప్రస్తుతం విద్యార్థుల ఆలోచనా ధోరణి ఎలా ఉందంటారు?

నేటి విద్యార్థులు చాలా కొత్తగా ఆలోచిస్తున్నారు. క్రియేటివిటీగా ఉంటున్నారు. కొత్త కొత్త నినాదాలు సృష్టిస్తున్నారు. చక్కటి ఆలోచనలతో ముందుకు వస్తున్నారు. ఎస్.ఎఫ్.ఐలోకి కూడా అలాంటి క్వాలిటీ నాయకులు వస్తున్నారు. వీళ్ళందరినీ చూస్తే ఎంతో ఉత్సాహంగా అనిపిస్తుంది.

మీ జీవిత భాగస్వామి గురించి చెప్పండి?



నా సహచరుడు నిరంకుశ్. ప్రస్తుతం డివైఎఫ్‌ఐలో ఉన్నారు. అంతకు ముందు ఎస్.ఎఫ్.ఐలో పని చేశాడు. అతను లా చేశాడు. మాది ప్రేమ వివాహం.

మీ పెండ్లికి పెద్దలు ఒప్పుకున్నారా?

ఒప్పుకున్నారు. అయితే ఓ సంఘటన జరిగింది. పెండ్లి రోజు భర్త కాళ్ళు భార్య పట్టుకోవాలి. నేను పట్టుకోనని చెప్పాను. దాంతో వాళ్ళ బంధువులు కాస్త ఫీలయ్యారు. దీని గురించి చర్చ కూడా జరిగింది. కాని నేను మాత్రం ఆ పని చెయ్యలేదు. తర్వాత వాళ్ళే అర్థం చేసుకున్నారు. ఇప్పుడు నాతో చాలా అభిమానంగా, ప్రేమగా ఉంటారు. అతని తల్లిదండ్రులు మాత్రం ప్రోగ్రెసివ్‌గా ఉంటారు.

మీ భవిష్యత్ లక్ష్యాలు?

పూర్తికాలం కార్యకర్తగా ఉద్యమాల్లో కొనసాగాలి. లింగ వివక్షపై పని చేయాలి. సమానత్వం సాధించడం కోసం నా వంతు ప్రయత్నం చేయాలి. విద్య, వైద్యం అందరికీ అందేలా చూడాలి. మా కలలను నిజం చేసుకోవాలి. అయితే ఈ దారి అంత సులభమేమీ కాదు. మేము జీవించి ఉన్నప్పుడు మా కల నిజం కాకపోవచ్చు. మా తర్వాత తరాల వారైనా సుఖమైన జీవితం గడిపేందుకు అవసరమైన మార్గం వేయాలి. అయితే ఇవన్నీ ఒంటరిగా చేయలేం. అందరినీ కలుపుకొని ఉద్యమాలు చేయాలి. ఐకమత్యంతో సమానత్వం సాధించాలి.

– సలీమ
ఫొటోలు :హరి

'పది'ప్రశ్నాపత్రంలో అన్ని సెక్షన్లకూ ఛాయిస్ ఇవ్వాలి

- రోజువిడిచి రోజు పరీక్షలు నిర్వహించాలి
- విద్యాశాఖ కార్యదర్శికి టీఎస్‌యూటీఎఫ్ వినతి

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

పదో తరగతి ప్రశ్నాపత్రంలో అన్ని సెక్షన్లలోని ప్రశ్నలకూ ఛాయిస్ ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఏప్రిల్ మూడో తేదీ నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి పరీక్షలను రోజువిడిచి రోజు నిర్వహించాలని కోరింది. ఈ మేరకు విద్యాశాఖ కార్యదర్శి, పాఠశాల విద్యా డైరెక్టర్, ఎస్సీఈఆర్టీ డైరెక్టర్‌ను టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కె జంగయ్య, ప్రధాన కార్యదర్శి చావ రవి శనివారం వేర్వేరుగా కలిసి వినతిపత్రాలు సమర్పించారు. ఒక ప్రకటన విడుదల చేశారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షలను 11 పేపర్లకు బదులుగా ఆరు పేపర్లతోనే నిర్వహించాలని నిర్ణయించటం అభినందనీయమని తెలిపారు. ప్రస్తుతం విడుదలైన మోడల్ పేపర్లు సగటు, అంతకంటే తక్కువ స్థాయి గల విద్యార్థులకు చాలా క్లిష్టంగా ఉన్నాయని పేర్కొన్నారు. తొలిసారిగా పబ్లిక్ పరీక్షలు రాసే విద్యార్థుల స్థాయికి తగిన విధంగా ప్రశ్నాపత్రం రూపొందించటం అవసరమని సూచించారు. రెండేండ్ల కోవిడ్ మహమ్మారి కారణంగా భౌతికంగా తరగతులు జరగలేదని గుర్తు చేశారు. విద్యార్థులు ఆన్‌లైన్ తరగతులు సరిగా వినలేక పోయారని వివరించారు. అందువల్ల అభ్యసనా సామర్థ్యాలు తగ్గిపోయాయని తెలిపారు. ప్రాథమిక అంశాలపై అవగాహన తగ్గిందని పేర్కొన్నారు. ఈ ఏడాది పూర్తి సిలబస్‌తో ప్రశ్నాపత్రం ఉన్నందున దానిపై పట్టు సాధించటం సగటు విద్యార్థికి కష్ట సాధ్యమని వివరించారు. ఉన్నత విద్య పరీక్షల పేపర్లలో కూడా అన్ని విభాగాల్లో ఛాయిస్ ఇస్తున్నారని గుర్తు చేశారు. సీబీఎస్ఈలో పరీక్షకు, పరీక్షకు మధ్య సెలవులిస్తారనీ, ఆ విధానాన్ని పదో తరగతి పరీక్షల్లోనూ అమలు చేయాలని కోరారు.

- రెండు పేపర్లకు బదులుగా ఒక పేపర్ ఇస్తుండడం వల్ల విద్యార్థులకు ఇబ్బంది లేకుండా ఉండటానికి ఒకటి, రెండు సెక్షన్లలో కూడా ఛాయిస్ ఇవ్వాలి. రెండు మార్కులు, మూడు మార్కుల ప్రశ్నలకు కనీసం 30 శాతం ఛాయిస్ ఇవ్వాలి.
- మూడో సెక్షన్‌లో వ్యాస రూప ప్రశ్నల సంఖ్యను ఆరు నుంచి నాలుగుకు తగ్గించాలి.
- ఫిజికల్ సైన్స్, బయలాజికల్ సైన్స్ పరీక్షలు ఒకేరోజు కాకుండా వేర్వేరు రోజుల్లో నిర్వహించాలి.
- పరీక్షలు ప్రతిరోజూ కాకుండా రోజు విడిచి రోజు చొప్పున నిర్వహించాలి. తద్వారా ప్రిపరేషన్ సులభమౌతుంది.
- సగటు విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని పదోతరగతి పరీక్షల ప్రశ్నాపత్రాన్ని రూపొందించి పరీక్షలను నిర్వహించాలి.

కురవిలో ఘోర రోడ్డు ప్రమాదం

- గ్రానైట్ రాళ్లు ఆటో మీద పడటంతో ఇద్దరు మృతి

నవతెలంగాణ-మహబూబాబాద్

మహబూబాబాద్ జిల్లా కురవి మండలం శివారు అయ్యవారిపెల్లి గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై శనివారం రాత్రి ఘోర ప్రమాదం జరిగింది. ఆటోను గ్రానైట్ లారీ ఢీకొట్టడంతో బండరాళ్లు మీద పడి ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందారు. మరో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం రాత్రి 7:30 గంటల సమయంలో మహబూబాదాద్ వైపు నుంచి భారీ బండరాళ్లతో గ్రానైట్ లారీ మరిపెడ వైపు వెళ్తోంది. ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొట్టింది. దీంతో గ్రానైట్ రాళ్ల తాళ్లు తెగి రాళ్లు ఆటోపై పడ్డాయి. ఆ సమయంలో ఆటోలో డ్రైవర్‌తోపాటు ఎనిమిది మంది ఉన్నారు. రాళ్లు మీద పడటంతో బానోత్ సుమన్(35), యెక్కలపు మృతిచెందారు. తీవ్రంగా గాయపడిన డెన్యాల నవీన్‌ను వెంటనే వరంగల్ ఎంజీఎంకు తరలించారు. లింగంపల్లి రాంబాబు, బానోతు రాము, ఆటో డ్రైవర్ బానోత్ రమేష్, నావత్ వీరన్న, బొడ్డు శేఖర్‌ను మానుకోట ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. చిన్నగూడూరు మండలం మంగోరిగూడెం నుంచి వారంతా మహబూబాబాద్ వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. బండరాళ్ల కింద ఇంకెవరన్న ఉండొచ్చన్న అనుమానాలున్నాయి.

రైతుల ఆదాయం రెట్టింపేది..?

(మొదటిపేజీ తరువాయి)

ఏడాదిలోనే కేవలం కొన్ని నెలల వ్యవధిలోనే దాదాపు రెండు కోట్ల మంది రైతులను తొలగించారు. 2022-2023లో 11వ విడుత (ఏప్రిల్-జూలై)లో 10,45,59,905 మంది రైతులకు పీఎంకిసాన్ పథకం వర్తిస్తే, 12వ విడుత (ఆగస్టు-నవంబర్)లో 8,42,14,408 మంది రైతులకు మాత్రమే పీఎం కిసాన్ వర్తించింది. 2,03,45,497 మంది రైతులు పిఎం కిసాన్ పథకం నుంచి తొలగించబడ్డారు. రెండు కోట్ల మంది రైతులను తొలగించడంద్వారా కేంద్ర ప్రభుత్వం రూ.5,108 కోట్లను మిగుల్చుకున్నది. 11వ విడుతలో రూ.22,551 కోట్లు విడుదల చేస్తే, 12 విడుతలో 17,443 కోట్లు కేటాయించింది.ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రకటన తరువాత కేంద్ర ప్రభుత్వం 2016 ఏప్రిల్ 13న రైతుల ఆదాయం రెట్టింపు (డీఎఫ్‌ఐ)పై అశోక్ దల్వాయ్ నేతృత్వంలోని 16 మంది నిపుణుల కమిటీ ఏర్పాటు చేసింది. ఈ కమిటీ 14 సంపుటాలలో నివేదికను సమర్పించింది. 2017 ఆగస్టులో మొదటి సంపుటా నివేదిక ఇచ్చింది. 2018 సెప్టెంబర్‌లో మరో నివేదిక ఇచ్చింది. ఈ కమిటీ 16 సిఫార్సులను చేసింది. అందులో రైతు పండించే పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) ఉత్పత్తి వ్యయం కంటే 1.5 రెట్లు ఉండాలని తెలిపింది. అగ్రి మార్కెట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ రూ. 2,000 కోట్లతో 22,000 గ్రామాల్లో (గ్రామీణ స్థాయి మార్కెట్‌లు, అగ్రిగేషన్ హబ్‌లు) ఏర్పాటు చేయాలనీ, 585 వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ కమిటీ (ఏపీఎంసీ)లను అప్‌గ్రేడ్ చేయాలని సూచించింది. ధర, డిమాండ్ అంచనాలు, ఫ్యూచర్స్, ఎంపికలు, వ్యవసాయం కోసం ఎగ్జిమ్ విధానాలపై విధానాలను అభివృద్ధి చేయడానికి సంస్థాగత యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని వంటి కొన్ని సిఫార్సులను చేసింది.

ప్రకటన వెలువడిన వెంటనే.. నిటి ఆయోగ్ విధాన పత్రాన్ని తెచ్చింది. రైతుల ఆదాయాల బెంచ్‌మార్క్ అంచనాలు, వీటిని రెట్టింపు చేయడంపై వివరాలను అందిస్తూ నిటి ఆయోగ్ వ్యవసాయ ఇన్‌ఛార్జ్ సభ్యుడు రమేష్ చంద్ రచించారు. ఇది రైతుల ఆదాయానికి సంబంధించిన సూటి గణన, ఇంతకు ముందు వివిధ అధ్యయనాలలో ఉపయోగించిన వివరాలే ఉన్నాయి. పాలసీ పేపర్‌లో 2015-16 వరకు సాగుదారుల ఆదాయాల అంచనాలు ఉన్నాయి. దానిని ఆధార సంవత్సరంగా పరిగణిస్తారు. దాని డేటా ప్రకారం 2004-05, 2011-12 మధ్య 7.5 శాతం పెరుగుదల నుండి 2011-12, 2015-16 మధ్య ఒక్కో సాగుదారునికి నిజమైన రైతు ఆదాయం ఏడాదికి 0.44 శాతం పెరిగింది. ఇది 1999-2000, 2004-05 మధ్య మొదటి నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ (ఎన్‌డీఏ-1) ప్రభుత్వ కాలంలో ఏడాదికి 0.55 శాతం తగ్గింది.

రైతు ఆదాయంలో క్షీణత

నేషనల్ స్టాటిస్టికల్ ఆఫీస్ (ఎన్ఎస్ఓ) సిట్యుయేషన్ అసెస్‌మెంట్ సర్వే (ఎస్ఏఎస్) ఆధారంగా పంటల వ్యవసాయం వల్ల రైతు కుటుంబాల ఆదాయం 2012-13, 2018-19 మధ్య ఏడాది 1.5 శాతం క్షీణించింది. దురదృష్టవశాత్తూ, 2018-19 తరువాత ఎటువంటి సర్వేలు జరగనందున, 2022లో రైతుల ఆదాయాన్ని అంచనా వేయడానికి మార్గం లేదు. 2015-16 తరువాత రైతు ఆదాయంలో క్షీణత ఉంది. నాబార్డ్ ఆల్ ఇండియా ఫైనాన్షియల్ ఇన్‌క్లూజన్ సర్వే (ఎన్ఏఎఫ్ఐఎస్)లో భాగంగా గ్రామీణ కుటుంబాల సర్వే వ్యవసాయ కుటుంబాల ఆదాయానికి సంబంధించిన ఇతర డేటా ఎస్ఏఎస్‌కి భిన్నంగా ఉంది. అయితే ఆదాయాల వృద్ధి క్షీణతను స్పష్టం చేసింది. వ్యవసాయ కుటుంబాల ఆదాయం 2015-16, 2018-19 మధ్య ఏడాది 1.7 శాతం పెరిగిందని, ఇది మునుపటి కాలంలోని 3.8 శాతం వృద్ధి రేటు కంటే సగం కంటే తక్కువగా ఉందని స్పష్టం చేసింది.

జనంలో ఉండాల్సిందే..పోరాడాల్సిందే...

(మొదటిపేజీ తరువాయి)

నిలబడి భూపోరాటాలు చేయాల్సిన గురుతర బాధ్యత వ్యవసాయ కార్మిక సంఘంపై ఉందని నొక్కి చెప్పారు. తెలంగాణ గడ్డకు పోరాటాల వారసత్వం ఉందనీ, దాన్ని ముందుకు తీసుకుపోవాలని పిలుపునిచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో వర్గపోరాటాలను ఉధృతం చేయాలన్నారు. అప్పుడే ఏ పార్టీ పేదల పక్షమో, ఏ పార్టీ భూస్వాములు, కార్పొరేట్ల పక్షమో అర్థం అవుతుందని చెప్పారు. రాష్ట్రంలో వరుసగా జరుగుతున్న పోరాటాలతో ఎర్రజెండా వైపు ప్రజలు చూసే పరిస్థితి వచ్చిందన్నారు. రానున్న రోజుల్లో వర్గపోరాటాలను ఉధృతం చేస్తే కమ్యూనిస్టులకు మంచి రోజులు వస్తాయన్నారు. కూలీలకు వ్యవసాయ పనిదినాలు రోజురోజుకీ తగ్గిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పనుల్లేక కూలీలు ఇబ్బందిపడుతున్న సమయంలో ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే పనిలో మోడీ సర్కారు ఉందని విమర్శించారు. వ్యవసాయ కార్మికుల్లో ఎక్కువగా దళితులు, వెనుకబడిన సామాజిక తరగతుల వారే ఉన్నారనీ, కంపెనీ వ్యవసాయం వస్తే ఉన్న కాస్త ఉపాధిని వారు కోల్పోతారని వాపోయారు. దీంతో పట్టణాలకు, గ్రామాలకు వలసలు పెరుగుతున్నాయనీ, అక్కడా సరైన పని లేక ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. వ్యవసాయ కార్మిక సంఘం ఆర్థిక పోరాటాలకే పరిమితం కాకుండా రాజకీయ, సాంస్కృతిక చైతన్యం కల్పించే ఉద్యమాలు నిర్మించాలని పిలుపునిచ్చారు.

సాంకేతిక పరిజ్ఞానంతోటే పోలీసులు ప్రజలకు చేరువయ్యారు

- వీడ్కోలు పరేడ్‌లో మహేందర్‌రెడ్డి వ్యాఖ్య
- మహేందర్‌రెడ్డి అడుగుజాడల్లో నడుస్తా: కొత్త డీజీపీ

నవ తెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్రంలో పోలీసు శాఖ సేవలు ప్రజలకు మరింతగా అందుబాటులోకి తీసుకురావడానికి కృషి చేశాననీ, ఇందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఎంతగానో తోడ్పడిందని రిటైరవుతున్న డీజీపీ ఎం.మహేందర్‌రెడ్డి అన్నారు. హిమాయత్‌సాగర్‌లోని అప్పాలో రిటైర్ అవుతున్న డీజీపీ మహేందర్‌రెడ్డి వీడ్కోలు పరేడ్ జరిగింది. సాయుధ పోలీసు బలగాలు పరేడ్ చేస్తూ మహేందర్‌రెడ్డికి గౌరవ వందనాన్ని సమర్పించాయి. మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ కొత్తగా రాష్ట్రం ఏర్పడిన సమయంలో మతకలహాలు జరుగుతాయనీ, ఉగ్రవాద దాడులు జరుగుతాయనీ, నక్సలైట్లు చెలరేగుతారని అంటు అనేక సందేహాలు, భయాలను నెలకొల్పే ప్రయత్నాలు జరిగాయనీ, కానీ, ముఖ్యమంత్రి కేసీఆర్ దూర దృష్టితో పోలీసు శాఖను బలోపేతం చేయడానికి తీసుకున్న పలు చర్యలు, పోలీసుల కృషి వెరసి రాష్ట్రం అలాంటి సందేహాలను పటాపంచలు చేసిందని ఆయన సగర్వంగా తెలిపారు. ముఖ్యంగా, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడం ద్వారా పోలీసు సేవలు ప్రజల వద్దకు చేరడానికి దోదపడిందని తెలిపారు. తన 36 ఏండ్ల పోలీసు సర్వీసులో అనేక పరిణామాలు ఎదురైనప్పటికీ ప్రజల సహకారం, ప్రభుత్వాల తోడ్పాటు, సన్నిహితుల సూచలనతో వాటన్నింటిని సులువుగా గెట్టక్కానని ఆయన తెలిపారు.

డీజీపీగా తాను తీసుకున్న పలు నిర్ణయాల వెనుక రాష్ట్ర ప్రభుత్వ సహకారం ఎంతగానో ఉందని అన్నారు. ముఖ్యంగా రాష్ట్రం శాంతి భద్రతల పరంగా సవ్యంగా ఉంచడం ద్వారా కోట్లాది రూపాయల పెట్టుబడులను రాష్ట్రానికి వచ్చేలా చూడగలిగామని తెలిపారు. ఇందుకు పోలీసు శాఖకు అవసరమైన మౌళిక సదుపాయాలు, వాహనాలు, దాదాపు ముప్పై వేలకు పైగా సిబ్బంది, అధికారులను సమకూర్చడం ద్వారా సీఎం కేసీఆర్ ఎంతగానో తోడ్పడ్డారని ఆయన కృతజ్ఞతలు చెప్పారు. కొత్తగా డీజీపీగా నియమించబడ్డ అంజనీకుమార్ సైతం సమర్థుడైన ఐపీఎస్ అధికారి అనీ, ఆయన హయాంలో సైతం రాష్ట్ర పోలీసు శాఖ మరింత పేరును సంపాదించగలదని అన్నారు.

నూతన డీజీపీ అంజనీకుమార్ మాట్లాడుతూ మహేందర్‌రెడ్డి హయాంలో రాష్ట్ర పోలీసు శాఖ మునుపెన్నడు లేని విధంగా ప్రతిష్టను పెంచుకుందన్నారు. ముఖ్యంగా గతంలో ఎన్నడు లేని విధంగా దూర దృష్టితో ఆయన ప్రవేశ పెట్టిన సాంకేతిక పరిజ్ఞానంతో పోలీసులు అనేక అద్భుతాలు సాధించారని కొనియాడారు. తాను సైతం ఆయన అడుగు జాడల్లో నడుస్తు పోలీసు శాఖకు మరింత పేరును తీసుకురావడానికి కృషి చేస్తానని అన్నారు. మహేందర్‌రెడ్డితో పాటు పని చేసే అవకాశం రావడం తన అదృష్టంగా ఆయన చెప్పారు.

తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా జి.నాగయ్య, ఆర్.వెంకట్రాములు

- 87 మందితో నూతన రాష్ట్ర కమిటీ ఎన్నిక
- ఆఫీస్‌బేరర్లుగా 22 మంది

ఖమ్మం నుంచి నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా జి.నాగయ్య, ఆర్.వెంకట్రాములు ఎన్నికయ్యారు. ఖమ్మంలోని వేదగిరి శ్రీనివాసరావు(భక్తరామదాసు కళాక్షేత్రం)లోని అమరవీరుల ప్రాంగణంలో జరుగుతున్న రాష్ట్ర మూడో మహాసభలో శనివారం నాడు నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కొత్త కమిటీలో 87 మంది ఉన్నారు. అందులో 22 మంది ఆఫీస్ బేరర్లుగా ఉండనున్నారు. ఉపాధ్యక్షులుగా తమ్మినేని వీరభద్రం, పొన్నం వెంకటేశ్వరరావు, ములకలపల్లి రాములు, ఎం.ఆంజనేయులు, పెద్ది వెంకట్రాములు, అల్వాల వీరయ్య, లంక రాములు, నర్సింహులు, సమ్మయ్య, కార్యదర్శులుగా పద్మ, నారి అయిలయ్య, మచ్చా వెంకటేశ్వర్లు, కొండమడుగు నర్సింహ్మా ఎం. వెంకటయ్య యు.గోపాల్, వెంకటరాజు, కె.జగన్, ఆర్.శశిధర్, సాంబశివ, కో-ఆప్షన్(మహిళ) ఎన్నికయ్యారు. పశ్చిమబెంగాల్‌లోని హౌరాలో ఫిబ్రవరి 15 నుంచి 18వ తేదీ వరకు జరగబోయే అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం మహాసభలకు కూడా ప్రతినిధులను మహాసభలో ఎన్నుకున్నారు.

ఎన్ఐఏ కేసుల పెరుగుదలలో ఆల్‌టైమ్ రికార్డు

న్యూఢిల్లీ : నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్ఐఏ) ఎన్నడూ లేనంతగా ఏడాదిలోనే పెరిగాయి. ఏడాదిలో 19.67 శాతం ఎన్ఐఏ కేసులు పెరిగాయి. 2021లో 61 కేసులను ఎన్ఐఏ నమోదు చేయగా, 2022లో ఎన్ఐఏ కేసుల నమోదు 73కు పెరిగింది. ఇది 19.67 శాతం పెరుగుదలతో ఎన్ఐఏకి ఇది ఆల్ టైట్ రికార్డుగా ఉంది. ఈ కేసుల్లో జమ్మూకాశ్మీర్, అసోం, బీహార్, ఢిల్లీ, కర్నాటక, కేరళ, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్, తమిళనాడు, తెలంగాణ, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాల్లో 35 జిహాదీ టెర్రర్ కేసులు ఉన్నాయి. జమ్మూ కాశ్మీర్‌లో 11 కేసులు, నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో 10 కేసులు, ఈశాన్య రాష్ట్రాల్లో ఐదు కేసులు, పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా (పిఎఫ్ఐ) సంబంధిత కేసులు ఏడు, పంజాబ్‌లో ఐదు కేసులు, గ్యాంగ్‌స్టర్, టెర్రర్, డ్రగ్ స్మగ్లర్ సంబంధిత మూడు కేసులు, తీవ్రవాద నిధుల కేసు ఒకటి, నకిలీ భారతీయ కరెన్సీ నోటు (ఎఫ్ఐసిఎన్) సంబంధిత కేసులు రెండు నమోదు అయ్యాయి.

ఎన్ఐఎ 2022లో 368 మందిపై 59 చార్జిషీట్లు దాఖలు చేసింది. పరారీలో ఉన్న19 మందితో పాటు 456 మంది నిందితులను ఎన్ఐఏ అరెస్టు చేసింది. బహిష్కరణపై ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. అప్పగించిన తరువాత ఒక నిందితుడిని అరెస్టు చేశారు. 2022లో 38 ఎన్ఐఎ కేసుల్లో తీర్పులు వెలువడ్డాయి. అవన్నీ నేరారోపణతో ముగిశాయి. 109 మందిని దోషులుగా నిర్ధారించిన కోర్టు కఠిన కారాగార శిక్ష, జరిమానా విధించింది. 2022లో ఆరు జీవిత ఖైదులు కూడా విధించబడ్డాయి. మొత్తం నేరారోపణ రేటు 94.39 శాతంగా ఉంది. ఇది కాకుండా, 2022లో యుఎపిఎ కింద ఎనిమిది మంది వ్యక్తులను వ్యక్తిగత ఉగ్రవాదులుగా గుర్తించారు.

ముఖ్యమంత్రిని కలిసిన నూతన డీజీపీ

నవ తెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్ర నూతన డీజీపీగా బాధ్యతలు చేపట్టిన అనంతరం అంజనీకుమార్ నేరుగా ప్రగతి భవన్‌కు వెళ్లి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిశారు. తనకు రాష్ట్ర డీజీపీగా అవకాశాన్ని ఇచ్చినందుకు ఆయన ముఖ్యమంత్రికి ఈ సందర్భంగా కృతజ్ఞతలను తెలిపారు. ముఖ్యమంత్రి సైతం అంజనీకుమార్‌ను అభినందిస్తు పోలీసు శాఖ ప్రతిష్టను మరింతగా పెంచాలనీ, శాంతి భద్రతలు, నేరాల అదుపునకు కృషి చేయాలని కోరుతూ శుభాకాంక్షలు చెప్పారు. అక్కడి నుంచి అంజనీకుమార్ రాష్ట్ర హోంమంత్రి మహమూద్ అలీ, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్‌లను గౌరవ సూచకంగా కలిశారు.

806 పోస్టుల భర్తీకి మరో నాలుగు నోటిఫికేషన్లు

- డిగ్రీ కాలేజీల్లో అధ్యాపక పోస్టులు 544
- 31 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- టీఎస్‌పీఎస్సీ వెల్లడి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో కొలువుల భర్తీ ప్రక్రియ కొనసాగుతూనే ఉన్నది. 2022, డిసెంబర్ 31న ఏడాది చివరి రోజు 806 పోస్టుల భర్తీకి తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) మరో నాలుగు నోటిఫికేషన్లను జారీ చేసింది. కళాశాల విద్యాశాఖ పరిధిలోనే 544 అధ్యాపక, ఫిజికల్ డైరెక్టర్, లైబ్రేరియన్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. ఈ మేరకు టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి అనితా రామచంద్రన్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇందులో అధ్యాపక పోస్టులు 491, ఫిజికల్ డైరెక్టర్ పోస్టులు 29, లైబ్రేరియన్ పోస్టులు 24 ఉన్నాయని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ఈనెల 31 నుంచి ప్రారంభమవుతుందని తెలిపారు. వాటి సమర్పణకు వచ్చేనెల 20వ తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు గడువుందని వివరించారు. మల్టీజోన్-1 పరిధిలో 246, మల్టీజోన్-2 పరిధిలో 298 కలిపి మొత్తం 544 పోస్టులను భర్తీ చేస్తున్నామని పేర్కొన్నారు. మే లేదా జూన్‌లో నియామక పరీక్ష ఉంటుందని ప్రకటించారు. ఇతర వివరాలకు www.tspsc.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

సబ్జెక్టుల వారీగా పోస్టుల వివరాలు

ఇంగ్లీష్-23, తెలుగు-27, ఉర్దూ-2, సంస్కృతం-5, స్టాటిస్టిక్స్-23, మైక్రో బయాలజీ-5, బయో టెక్నాలజీ-9, అప్లయిడ్ న్యూట్రిషన్-5, కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్స్-311, బిజినెస్ అడ్మినిస్ట్రేషన్-39, కామర్స్-బిజినెస్ అనలిటిక్స్ (స్పెషలైజేషన్)- 8, డెయిరీ సైన్స్-8, క్రాప్ ప్రొడక్షన్-4, డేటా సైన్స్-12, ఫిషరీస్-3, కామర్స్ ఫారిన్ ట్రేడ్ (స్పెషలైజేషన్)-1, కామర్స్ టాక్సేషన్ (స్పెషలైజేషన్)-6, ఫిజికల్ డైరెక్టర్-29, లైబ్రేరియన్-24.

పురపాలక శాఖలో 78 పోస్టులు

పురపాలక శాఖలో 78 పోస్టుల భర్తీకి టీఎస్‌పీఎస్సీ నోటిఫికేషన్‌ను జారీ చేసింది. ఇందులో 64 సీనియర్ అకౌంటెంట్, 13 జూనియర్ అకౌంటెంట్, ఒక అకౌంట్స్ ఆఫీసర్ పోస్టులున్నాయని టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి అనితా రామచంద్రన్ తెలిపారు. ఈనెల 20 నుంచి వచ్చేనెల 11 వరకు దరఖాస్తులను స్వీకరిస్తామని తెలిపారు. ఇతర వివరాలకు www.tspsc.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

విద్యాశాఖలో 71 లైబ్రేరియన్ పోస్టులు

విద్యాశాఖ పరిధిలో 71 లైబ్రేరియన్ పోస్టుల భర్తీకి మరో నోటిఫికేషన్‌ను విడుదల చేసినట్టు కార్యదర్శి అనితా రామచంద్రన్ తెలిపారు. ఇంటర్ కమిషనరేట్ పరి ధిలో 40 లైబ్రేరియన్ పోస్టులు, సాంకేతిక విద్యాశాఖ పరిధి లో 31 లైబ్రేరియన్ పోస్టులను భర్తీ చేయనున్నట్టు పేర్కొన్నారు. ఈనెల 21 నుంచి వచ్చేనెల పదో తేదీ వరకు దర ఖాస్తులను స్వీకరిస్తామని పేర్కొన్నారు. ఇతర వివరాలకు ఞఞఞ.ంజూంఛ.స్త్రశీఙ.ఱఅ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

113 ఏఎంవీఐ పోస్టులు

113 అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ (ఏఎంవీఐ) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్‌ను జారీ చేశామని టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి అనితా రామచంద్రన్ తెలిపారు. ఫిబ్రవరి ఒకటి నుంచి ఏప్రిల్ 23 వరకు దరఖాస్తులను స్వీకరిస్తామని వివరించారు. మే లేదా జూన్‌లో నియామక పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. ఇతర వివరాలకు www.tspsc.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

డాటా ప్రొటక్షన్ బిల్లుతో పౌరులపై నిరంతర నిఘా

ప్రభుత్వానికి అపరిమిత అధికారాలు : హక్కుల కార్యకర్తలు

- చిన్న పిల్లల సమాచారమూ సేకరించొచ్చు..
- నిఘా కార్యకలాపాలపై ప్రభుత్వ శక్తిని పెంచే బిల్లు ఇది : హ్యూమన్ రైట్స్ వాచ్

న్యూఢిల్లీ : పాత చట్టాల్ని మారుస్తూ, కొత్త చట్టాలు చేస్తూ..పౌరుల ప్రాథమిక హక్కులకు మోడీ సర్కార్ తూట్లు పొడుస్తోంది. మొన్న సాగు చట్టాలు, నిన్న లేబర్ కోడ్స్, ఇప్పుడు 'పౌరుల వ్యక్తిగత సమాచార రక్షణ బిల్లు'. దేశ పౌరుల వ్యక్తిగత సమాచారానికి రక్షణ కల్పించే ఉద్దేశమని పైకి చెబుతున్నా, బిల్లు అసలు లక్ష్యం..ప్రభుత్వ నిఘా శక్తిని అపరిమితం చేయటమే. కేంద్రం తాజాగా తెరపైకి తీసుకొచ్చిన ముసాయిదా బిల్లు 'డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ బిల్లు-2022'పై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా హక్కుల కార్యకర్తలు ఈ బిల్లుపై ఆందోళన వ్యక్తం చేస్తు న్నారు. ఈ చట్టం ద్వారా ప్రభుత్వానికి దఖలుపడుతున్న నియంత్రణలు, ప్రత్యేక మినహాయిం పులపై ఆగ్రహం వ్యక్తమవుతోంది. ప్రభుత్వానికి కల్పించిన ప్రత్యేక వెసులుబాట్లతో పౌరుల వ్యక్తిగత సమాచారానికి ముప్పు వాటిల్లడమేగాక, పౌరులపై నిరంతరం నిఘాకు ఆస్కారం ఏర్పడుతుందని హ్యూమన్ రైట్స్ వాచ్, గ్లోబల్ రైట్స్ బాడీ ఆరోపించాయి. ప్రతిపాదిత బిల్లు ఎట్టి పరిస్థితుల్లో చట్టరూపం దాల్చరాదని హక్కుల కార్యకర్తలు చెబుతున్నారు. "ఇది పౌరుల వ్యక్తిగత డేటాకు భద్రత కల్పించటం కాకుండా, ప్రభుత్వానికి అపరిమిత అధికారాల్ని కట్టబెట్టింది. ప్రభుత్వ నిఘాను ప్రశ్నించడానికి వీల్లేకుండా బిల్లును రూపొందించారు" అని తన వెబ్‌సైట్‌లో హ్యూమన్ రైట్స్ వాచ్ పేర్కొంది. 'గ్లోబల్ రైట్స్ బాడీ' కూడా బిల్లులోని అంశాలపై ఆందోళన వ్యక్తం చేసింది. పౌర హక్కుల సంఘాలను లక్ష్యంగా చేసుకొని బిల్లును తీసుకొస్తున్నారని ఆరోపిం చింది. డాటా ప్రొటెక్షన్ నిపుణులు, పౌర సంఘాల కార్య కర్తలు బిల్లుపై పెదవి విరుస్తున్నారు. "పౌరులపై నిఘా చేపట్టడానికి ప్రభుత్వ శక్తిని పెంచేదిగా ఉంది. పౌరుల గోప్యత, భద్రత, ప్రాథమిక హక్కులను బలహీన పరుస్తోంది. డిజిటల్ వేదికల్లోనూ పౌరుల గోప్యత, భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి" అని హ్యూమన్ రైట్స్ వాచ్ దక్షిణాసియా డైరెక్టర్ మీనాక్షి గంగూలీ అన్నారు.

ప్రభుత్వానికి అనేక మినహాయింపులు

ఈ ఏడాది ఆగస్టులో రద్దు చేసిన డేటా భద్రత బిల్లు స్థానంలో కొత్త బిల్లును కేంద్రం తీసుకొచ్చింది. దీనిపై సలహాలు, సూచనలను పంపేందుకు 2023 జనవరి 2 వరకు అవకాశం కల్పించింది. కొన్ని ప్రత్యేక సందర్భాల్లో ఈ బిల్లులోని నిబంధనల నుంచి ప్రభుత్వానికి మినహాయింపులున్నాయి. చట్టపరమైన కార్యకలాపాల కోసం ఈ మినహాయింపుల్ని ఉపయోగించుకునే వెసులుబాట్లు కల్పించారు. బిల్లు ప్రకారం, ప్రత్యేక సందర్భాల్లో సమాచారాన్ని సేకరించడానికి గల కారణాన్ని ప్రభుత్వం వ్యక్తులకు తెలియజేయాల్సిన అవసరం లేదు. అలాగే పిల్లలకు సంబంధించిన సమాచారాన్ని కూడా అవసరాన్ని బట్టి సేకరించొచ్చు. శాంతిభద్రతల అంచనా కోసం సమాచారాన్ని ఉప యోగించుకోవచ్చు. డేటా ఆడిటర్‌ను నియమించడం లోనూ ప్రభుత్వానికి ప్రత్యేక మినహాయింపులు ఉన్నాయి. ఒకవేళ ఏవరైనా సమాచార హక్కు చట్టం కింద ప్రభుత్వాన్ని కోరినా..ఆ సమాచారం ఇవ్వాల్సిన అవసరం లేదని బిల్లులో ప్రతిపాదించారు.

స్వతంత్ర లేని ప్రొటక్షన్ బోర్డు

బిల్లులో ప్రతిపాదించినట్టుగా, డేటా ప్రొటక్షన్ బోర్డును ఏర్పాటుచేస్తామని కేంద్రం చెబుతోంది. అయితే ఈ బోర్డులోని సభ్యులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం నియ మితు లవుతారు. అలాగే తీసేస్తారు. బోర్డు పనితీరు స్వతంత్రంగా ఉండాలని లేదు. పర్యవేక్షణకు పాలకులు అనుమతించరు. దీనివల్ల ప్రభుత్వ నిఘా మరింత సులభతరం అవుతుం దని హ్యూమన్ రైట్స్ వాచ్ ఆరోపించింది. జర్నలిస్టులు, హక్కుల కార్యకర్తలు, ప్రతిపక్ష నాయ కులను లక్ష్యంగా చేసుకొని ప్రభుత్వ నిఘాకు అడ్డుఅదుపు ఉండదన్నది బిల్లు ద్వారా అర్థమవుతోంది. పౌరుల వ్యక్తిగత డాటాను సేకరించే ప్రభుత్వసంస్థలను బిల్లు రక్షిస్తోందని హక్కుల కార్య కర్తలు విమర్శిస్తున్నారు.

విధాన నిర్ణయాలపై సంఘాలతో చర్చించండి

- ప్రయివేటు స్కూళ్లతో పోటీపడేలా షెడ్యూల్
- మంత్రి సబితకు టీఎస్‌జీహెచ్‌ఎంఏ వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

విధాన నిర్ణయాలు తీసుకునే సందర్భంలో క్షేత్రస్థాయిలో పనిచేసే ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయు లతోపాటు, ఉపా ధ్యాయ సంఘాలతో చర్చించాలని తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ హెడ్మాస్టర్ల సంఘం (టీఎస్‌జీహెచ్‌ఎంఏ) రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు విద్యాశాఖ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డిని శనివారం హైదరాబాద్‌లో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పి రాజభాను చంద్రప్రకాశ్, ప్రధాన కార్యదర్శి ఆర్ రాజగంగారెడ్డి, కోశాధికారి బి తుకారాం కలిసి వినతి వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వమే ఆశిస్తున్న జాయ్ ఫుల్ లెర్నింగ్ విధానానికి విరుద్ధంగా షెడ్యూల్ ఉందని తెలిపారు. ప్రయివేటు పాఠశాలలు అనుసరిస్తున్న నిర్బంధ విద్యా బోధనా విధానాన్ని నియంత్రించాల్సిన అధికారులు వాటితో ప్రభుత్వ పాఠశాలలు పోటీ పడడానికి తయారుచేసిన షెడ్యూల్‌లా ఉందని పేర్కొన్నారు. విద్యాహక్కు చట్టం ప్రకారం నిబంధనలను అతిక్రమించి తయారు చేసిన షెడ్యూల్ అని తెలిపారు. పాఠశాలల పని వేళలు, సెలవు రోజుల్లో పాఠశాలల నిర్వహణ తదితర అంశాలను నిబంధనల ప్రకారం రీ షెడ్యూల్ చేయాలని కోరారు. ప్రయివేటు పాఠశాలలకు పంపే విద్యార్థుల తల్లిదండ్రులు వారి పిల్లలకి రెండు/మూడు రకాల టిఫిన్ బాక్సులు పెట్టి పంపిస్తారని తెలిపారు. కానీ ప్రభుత్వ పాఠశాలకు వచ్చే విద్యార్థులకు ప్రభుత్వమే మధ్యాహ్న భోజనాన్ని అందిస్తున్నదని గుర్తు చేశారు. ఒకవేళ ఇదే షెడ్యూల్ పాటించాలనుకుంటే ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ఉదయం అల్పాహారం, సాయంత్రం స్నాక్స్ అందించాల్సి ఉంటుందని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులకు ముఖ్యంగా విద్యార్థినులకు రవాణా సౌకర్యం, భద్రత కల్పించాలని తెలిపారు. పరీక్షల మధ్య విరామం లేకుండా ఒకదానివెంట మరొకటి నిర్వహించడం పూర్తిగా ఆశాస్త్రీ యమని విమర్శించారు. ప్రశ్నల ఛాయిస్ విధానం కూడా ఎక్కువ కఠినతరంగా ఉందనీ, తరగతి స్థాయికి తగినట్టుగా దానిని మార్చాలని కోరారు. ప్రశ్నల సంఖ్యను కూడా పరీక్ష సమయానికి అనుగుణంగా సరి చేయాలని పేర్కొన్నారు.

లెఫ్ట్‌ఫ్రంట్ అధికారంలోకి రాగానే రిట్రెంచ్ టీచర్లందరికీ నియామకాలు

- మాణిక్ సర్కార్ హామీ

అగర్తలా : బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత త్రిపురలో మొత్తంగా 10,323 మంది ఉపాధ్యాయులను తొలగించారని, వామపక్ష సంఘటన (లెఫ్ట్‌ఫ్రంట్) తిరిగి అధికారంలోకి వస్తే ఆ ఉపాధ్యాయులందరినీ వారి ఉద్యోగాల్లో నియమిస్తామని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు, త్రిపుర అసెంబ్లీలో ప్రతిపక్ష నేత మాణిక్ సర్కార్ హామీ ఇచ్చారు. ఉద్యోగాలు కోల్పోయిన టీచర్లకు బాసటగా నిలవాలని తమ పార్టీ భావించిందని చెప్పారు. కుమార్‌ఘాట్‌లో జరిగిన పార్టీ కార్యక్రమానికి శుక్రవారం హాజరైన ఆయన ఒక పత్రికా సమావేశంలో మాట్లాడారు. గతంలో ప్రజల సమస్యలను పరిష్కరించింది వామపక్ష ప్రభుత్వమేనని, భవిష్యత్తులో కూడా అదే జరుగుతుందని చెప్పారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రజలు ఆలోచిస్తున్న తీరుతో ముఖ్యమంత్రి, ఆయన పార్టీ ఆందోళన చెందుతున్నారని అన్నారు. రిట్రెంచ్ అయిన ఉపాధ్యాయుల్లో మరో టీచర్ దీపికా దాస్ చౌదరి (53) తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం తెల్లవారు జామున మరణించారు. బిజెపి దీపికా దాస్ లాంటి ఉపాధ్యాయులందరినీ తొలగించిన నాటి నుంచి వారంతా తీవ్రమైన మనోవేదనకు గురై అస్వస్థతకు గురౌతున్న సంగతి తెలిసిందే. దీపికా మరణంతో ఇప్పటి వరకు మరణించిన లేదా ఆత్మహత్య చేసుకున్న రిట్రెంచ్ ఉపాధ్యాయుల సంఖ్య 148కి చేరింది.

మోసపూరిత బిజెపిని సాగనంపుదాం..

త్రిపురలో వామపక్ష సంఘటన అధికారంలో వుండగా, ఏ ఒక్కరూ కూడా ప్రతిపక్ష నేతలపై దాడికి దిగలేదని, అటువంటిది ఇప్పుడు సిపిఎం, ఇతరులపై బిజెపి ఎందుకు దాడి చేస్తోందో చెప్పాలని సిపిఎం త్రిపుర రాష్ట్ర కార్యదర్శి జితేంద్ర చౌదరి ప్రశ్నించారు. కొత్త ఏడాదిలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఈ మోసపూరిత ప్రభుత్వాన్ని సాగనంపాలని ఆయన ప్రజలను కోరారు. వైష్ణవ్‌పూర్, మనుఘాట్‌ల్లో జరిగిన రెండు బహిరంగ సభల్లో ఆయన ప్రసంగించారు. లోక్‌సభ, అసెంబ్లీ, పంచాయితీ ఎన్నికలేవైనా బిజెపి అభ్యర్థులు బల ప్రయోగంతో గెలుస్తున్నారని విమర్శించారు.

ప్రజల హక్కులు, ప్రజాస్వామ్యం పునరుద్ధరణ కోసం పోరాడే సంవత్సరం 2023 అని అన్నారు.

దేశానికే ఆదర్శంగా సంక్షేమ కార్యక్రమాలు..

- విలేకర్ల సమావేశంలో మంత్రి సత్యవతి రాథోడ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

గిరిజన సంక్షేమంతోపాటు, మహిళ, శిశు సంక్షేమానికి చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని రాష్ట్ర గిరిజన స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ తెలిపారు. శనివారం హైదరాబాద్‌లోని దామోదర సంజీవయ్య సంక్షేమ భవన్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మంత్రి మాట్లాడారు. గత ఏడాది కాలంగా చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తున్నదని చెప్పారు. రాష్ట్రం ఎర్పడిన అనతికాలంలోనే విద్య, వైద్యం, ఉపాధి, సాగునీరు, తాగునీరు, విద్యుత్, వ్యవసాయం, రవాణా, పరిపాలన వికేంద్రికరణ వంటి అనేక రంగాల్లో విప్లవాత్మకమైన మార్పులు చేసి అభివృద్ధి పథంలో రాష్ట్రం వేగంగా దూసుకు పోతున్నదన్నారు. రాష్ట్రంలో ఎస్టీ రిజర్వేషన్లు 6శాతం నుంచి 10శాతానికి పెంచడంతో, గిరిజనులకు విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో అవకాశాలు పెరిగాయని తెలిపారు. అర్హులైన పోడు రైతులకు త్వరలో పట్టాలు అందించబోతున్నామన్నారు. విద్యకు అధిక ప్రాధాన్యతనిస్తూ, రాష్ట్ర వ్యాప్తంగా వేయ్యికి పైగా గురుకులాలను ఏర్పాటు చేశామన్నారు. 183 గిరిజన గురుకులాలకు తోడు.. నూతనంగా మరో మూడు గురుకులాలను ప్రారంభించబోతున్నామని తెలిపారు. గిరిజన విద్యార్థులకు ఐఐటీ, నీట్ వంటి జాతీయ స్థాయి పోటీపరిక్షలకు ఉచితంగా నాణ్యమైన శిక్షణ అందిస్తున్నామన్నారు. ఇప్పటి వరకు సుమారు 1200 మంది గిరిజన విద్యార్థులు దేశ వ్యాప్తంగా పలు ప్రతిష్టాత్మక కళాశాలల్లో ఎంబీబీఎస్, ఇంజనీరింగ్ విద్యలో ప్రవేశాలు పొందారని తెలిపారు. విదేశాల్లో ఉన్నత విద్య అభ్యసించడానికి పేద విద్యార్థులకు 20 లక్షల రూపాయల ఆర్థిక సహాయాన్ని అంబేద్కర్ ఓవర్సిస్ స్కాలర్ షిప్ పేరిట అందజేస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలోని 3,146 గిరిజన తాండాలను గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేయడంతో పాటు పంచాయతీ భవనాల నిర్మాణల కొసం ఒక్కో భవనానికి రూ.20లక్షల చొప్పున నిధులు కేటాయించామన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లోని గిరిజనులకు కూడా మెరుగైన వైద్యం అందుబాటులోకి తేవాలనే సదుద్దేశంతో 33 జిల్లాల్లో మెడికల్ కాలేజీలను నెలకొల్పాలనీ, ఆ దిశగా ఇప్పటికే 12 మేడికల్ కాలేజిలను ప్రారంభించుకు న్నామని తెలిపారు. షెడ్యూల్ తెగల యువతీ, యువకులను పారిశ్రామిక వెత్తలుగా తీర్చిదిద్దాడానికీ, వారిని ప్రోత్సహించడానికి భారీ మొత్తంలో సబ్సిడీ ఇస్తూ " సీఎం ఎస్టీ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఇన్నోవేషన్ స్కీమ్" అమలు చేస్తున్నామన్నారు. ఈ పథకం వల్ల ప్రతి ఏడాది వందల మంది పారిశ్రామిక వేత్తలుగా ఎదుగుతున్నారని చెప్పారు. ప్రతి గిరిజన ఆవాసానికి బీటీ రోడ్డు సౌకర్యం ఉండాలనే లక్ష్యానికి అనుగుణంగా మారుమూల తండాలకు బీటీ రోడ్లు మంజూరు చేశామన్నారు. ఈ ఏడాది 12,475 గిరిజన ఆవాసాలకు బిటీ రోడ్ల సౌకర్యం కల్పించడానికి ప్రభుత్వం రూ.1000 కోట్లను మంజూరు చేసిందని చెప్పారు. గిరిజన సంక్షేమంతో పాటు మహిళ, శిశు సంక్షేమానికి పెద్ద పీట వేసామన్నారు. అనంతరం డీఎస్ఎస్ భవన్‌లో ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరాన్ని ప్రారంభించారు. అధికారులతో కలిసి కేక్ కట్ చేసి రాష్ట్ర ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. విలేకర్ల సమావేశంలో గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి క్రిస్టినా జెడ్ చొంగ్తు, ప్రత్యేక కార్యదర్శి శ్రీధర్, గిరిజన సంక్షేమశాఖ అదనపు సంచాలకులు సర్వేశ్వర్‌రెడ్డి, సి.ఈ శంకర్, జేడీ. కళ్యాణ్ రెడ్డి, జీ సి సీజీఎం సీతారాంనాయక్ , ట్రైకార్ జీఎం శంకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

బిజినెస్

విమానయాన రంగానికి కరోనా బెంబేలు

- విస్తరణ ప్రణాళికలు రద్దు



న్యూఢిల్లీ : కరోనా కొత్త వేరియంట్ల భయాలు విమానయాన రంగ కంపెనీలను బెంబేతెత్తిస్తున్నాయి. కొత్త ఏడాది ఎలా ఉంటుందోననే ఆందోళనలు నెలకొన్నాయి. దీంతో ఆ రంగంలోని కంపెనీలు కొత్త పెట్టుబడులు, విస్తరణపై ఆచీతూచి వ్యవహరిస్తున్నాయి. అంతర్జాతీయ ప్రయాణికులపై ఆంక్షలు మొదలవుతున్న నేపథ్యంలో ఆయా కంపెనీలు వ్యయాలపై ఆలోచనలో పడ్డాయని విమానయాన రంగ నిపుణులు పేర్కొంటున్నారు. కరోనా కాలంలో భారీ నష్టాలను ఎదుర్కొన్న కంపెనీలు గత ఎడెనిమిది నెలల నుంచి రాణిస్తున్నాయి. కాగా.. 2023 ఈ కంపెనీలాకు లాభదాయకంగా ఉండొచ్చనే విశ్వాసం ఉన్నప్పటికీ.. మరోవైపు భయాలు నెలకొన్నాయని ఏవియేషన్ నిపుణులు అమెయా జోషి పేర్కొన్నారు. 2021 చివరి మాసంలో అంతర్జాతీయ విమానాల రాకపోకలపై తీవ్ర ఆంక్షలు ఉన్న విషయం తెలిసిందే. ప్రస్తుత ప్రతికూల పరిస్థితులను కూడా డిజిసిఎ అధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు.

ద్రవ్యలోటు లక్ష్యంలో 59 శాతానికి చేరిక



న్యూఢిల్లీ : దేశ ద్రవ్య లోటు పెరుగుతుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వం పెట్టుకున్న లక్ష్యంలో నవంబర్ ముగింపు నాటికి 59 శాతానికి చేరింది. 2023 మార్చి ముగింపు నాటికి రూ.16.61 లక్షల కోట్లు ఉండాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. జిడిపిలో ఇది 6.4 శాతం. నవంబర్ ముగిసే నాటికి ఇది 9.78 లక్షల కోట్లకు చేరింది.

కెఎస్ఆర్‌టిసికి ఓలెక్ట్రా తొలి ఇవి బస్ డెలివరీ



- 50 వాహనాలను అందించనున్న కంపెనీ

హైదరాబాద్ : దక్షిణాదిలోనే తొలి ఇంటర్ సిటీ ఎలక్ట్రిక్ బస్సు శనివారం బెంగళూరులో ప్రారంభమైంది. 12 మీటర్ల ఓలెక్ట్రా ప్రీమియం లగ్జరీ ఎలక్ట్రిక్ బస్సు సర్వీసును కర్ణాటక రవాణా శాఖ మంత్రి బి శ్రీరాములు లాంచనంగా ప్రారంభించారు. ఎయిర్ కండిషన్డ్, ఒలెక్ట్రా ఇ-బస్ ప్రీమియం లగ్జరీ ఎలక్ట్రిక్ బస్సు ఆవిష్కరణ కార్యక్రమంలో కెఎస్ఆర్‌టిసి చైర్మన్ ఎం చంద్రప్ప, ఎండి వి అన్బు కుమార్, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్బంగా ఓలెక్ట్రా సిఎండి కెవి ప్రదీప్ మాట్లాడుతూ.. "దేశంలో 2021లో ఇంటర్‌సిటీ ఎలక్ట్రిక్ లగ్జరీ కోచ్ బస్సులను ప్రవేశపెట్టిన మొదటి కంపెనీ తమదేనని అన్నారు. "మేక్ ఇన్ ఇండియా" ద్వారా, ఓలెక్ట్రా ఫేమ్ 2 పథకం కింద 50 ఎలక్ట్రిక్ బస్సులను సరఫరా చేస్తుందని అన్నారు. ఈ ఇ-బస్సులు రాష్ట్రవ్యాప్తంగా ప్రతిరోజూ 7 డిపోల నుండి బయలుదేరుతాయి. ఇది ప్రజా రవాణాలో ఒలెక్ట్రా ప్రస్థానాన్ని మరింత బలోపేతం చేస్తుందని అన్నారు. ట్రాఫిక్, ప్రయాణీకుల సంఖ్యా ఆధారంగా ఇ-బస్సులు ఒకే ఛార్జ్‌పై 300 కిలోమీటర్ల వరకు ప్రయాణిస్తాయన్నారు.

రూ.2వేల కోట్ల టర్నోవర్ లక్ష్యం

- మూవర్స్.కమ్ సిఇఒ వెల్లడి



హైదరాబాద్ : వచ్చే నాలుగేళ్లలో రూ.2వేల కోట్ల టర్నోవర్ సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని మూవర్స్.కమ్ వ్యవస్థాపకులు, సిఇఒ విద్యాధర్ గారపాటి అన్నారు. రీలొకెటెడ్ (పునరావాస) పోర్టల్ మూవర్స్.కమ్‌ను నిర్వహిస్తున్న ఈ సంస్థ హైదరాబాద్‌లో 20వ వార్షికోత్సవాన్ని నిర్వహించుకుంది. ఈ సందర్బంగా విద్యాధర్ మాట్లాడుతూ.. మూవర్స్.కమ్ లీడ్ అగ్రిగేటర్ నుంచి రీలొకేషన్ మేనేజ్‌మెంట్ కంపెనీగా మారడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. గత రెండు దశాబ్దాల్లో 35 లక్షల మంది వినియోగదారులకు సేవలందించామన్నారు. అపార్ట్‌మెంట్‌లోని ఒక గదిలో ప్రారంభమై తమ సంస్థ ఇప్పుడు 75 సిబ్బంది గల కంపెనీగా ఎదిగిందన్నారు. ఏడాదికి రూ.165 కోట్ల టర్నోవర్‌ను నమోదు చేస్తుందన్నారు. దేశంలోని ఇతర ప్రాంతాలకు తన కార్యకలాపాలను విస్తరించాలని కూడా యోచిస్తోందన్నారు. వద్దికి చాలా అవకాశాలు ఉన్నాయన్నారు. అదే విధంగా బీమా, గహ మెరుగుదల, గృహ భద్రత మొదలైన క్రాస్ సెల్లింగ్ సేవలలోకి ప్రవేశించడంపై దృష్టి కేంద్రీకరిస్తున్నామన్నారు.

కోవిడ్ కట్టడిలో కొత్త దశలోకి చైనా

- సమైక్యంగా వుండాలని జిన్‌పింగ్ పిలుపు

బీజింగ్ : కరోనా వేళ ప్రజల ప్రాణాలను కాపాడడానికే అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నది చైనా విధానమని అధ్యక్షులు జీ జిన్‌పింగ్ చెప్పారు. కొత్త సంవత్సరం 2023 లోకి ప్రవేశిస్తున్న సందర్భంగా శనివారం ఆయన టివిలో జాతినుద్దేశించి ప్రసంగించారు. కరోనా మహమ్మారి పట్ల దృక్పథంలో 'కొత్త దశ' లోకి ప్రవేశిస్తున్నందున మరింత ఐక్యత, కృషి అవసరమని పిలుపిచ్చారు. కోవిడ్‌కు వ్యతిరేకంగా సాగిన పోరులో అనూహ్యంగా ఎదురైన కష్టాలను, సవాళ్ళను చైనా విజయవంతంగా అధిగమించిందని పేర్కొన్నారు. అవసరమైన పరిస్థితులు తలెత్తినపుడు ఆ సమయం ఆసన్నమైనవుడు కరోనా విధానాలు గరిష్ఠ స్థాయిలో తీసుకున్నట్లు తెలిపారు. జీరో కోవిడ్ విధానాన్ని రద్దు చేసిన తర్వాత కోవిడ్ కట్టడి కొత్త విధానాలకు సంబంధించి జిన్‌పింగ్ బహిరంగంగా వ్యాఖ్యలు చేయడం ఇదే ప్రథమం. దాదాపు మూడేళ్ళుగా అనుసరిస్తూ వచ్చిన మూకుమ్మడి పరీక్షలు, కేంద్రీకృత క్వారంటైన్, లాక్‌డౌన్ వంటి చర్యల ప్రాతిపదికన కఠినంగా జీరో కోవిడ్ విధానాన్ని అమలు చేసిన చైనా ఆ తర్వాత ఆ విధానాన్ని రద్దు చేసింది.

ఫిజికల్ సైన్స్, బయలాజికల్ సైన్స్‌ను వేర్వేరుగా నిర్వహించండి : ట్రస్మ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పదో తరగతి పరీక్షలను 11 నుంచి 6 పేపర్లకు కుదించడం పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి ట్రస్మ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు యాదగిరి శేఖర్‌రావు, ప్రధాన కార్యదర్శి ఎస్ మధుసూదన్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పూర్తి భిన్నమైన సబ్జెక్టులైన ఫిజికల్ సైన్స్, బయలాజికల్ సైన్స్ పరీక్షలను వేర్వేరు తేదీల్లో నిర్వహించాలని కోరారు. ప్రశ్నాపత్రాలలో రెండు, మూడు మార్కుల సెక్షన్లలో అదనపు ప్రశ్నలను జోడించి వాటికి కూడా ఛాయిస్ ఇచ్చేలా చూడాలని తెలిపారు. సమయాభావ పరిస్థితులను అర్థం చేసుకుని నాలుగు మార్కుల ప్రశ్నల సంఖ్య తగ్గించాలని పేర్కొన్నారు.

'పది' ప్రశ్నాపత్రాల కూర్పుతో విద్యార్థులకు ఇబ్బందులు

- 2,3 మార్కుల ప్రశ్నలకు 30 శాతం ఛాయిస్ ఇవ్వాలి
- మంత్రి సబితకు పీఆర్టీయూటీఎస్ వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పదో తరగతి ప్రశ్నాపత్రాల కూర్పుతో విద్యార్థులు పలు ఇబ్బందులకు గురయ్యే అవకాశముందని పీఆర్టీయూటీఎస్ తెలిపింది. ఈ మేరకు విద్యాశాఖ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డిని శనివారం హైదరాబాద్‌లో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పింగిలి శ్రీపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్‌రావు, ఎమ్మెల్సీ అభ్యర్థి గుర్రం చెన్నకేశవరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్ కలిసి వినతిపత్రం సమర్పించారు. గతంలో రెండు పేపర్లు ఉన్న సబ్జెక్టులను ఒకే పేపర్‌గా మార్చారని తెలిపారు. రెండు, మూడు మార్కులకు చెందిన ప్రశ్నలకు ఛాయిస్ లేకుండా చేయడం ఇబ్బందికరమని పేర్కొన్నారు. వాటికి కూడా 30 శాతం ఛాయిస్ ఇవ్వాలని కోరారు. వ్యాసరూప ప్రశ్నల సంఖ్య ఎక్కువగా ఉన్నందువల్ల సమయాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ సంఖ్యను నాలుగుకు తగ్గించాలని సూచించారు. భౌతిక, రసాయన శాస్త్రాలు, జీవశాస్త్రం పేపర్లను ఒకేరోజు కాకుండా వేర్వేరు రోజుల్లో నిర్వహించాలని తెలిపారు. సగటు, అంతకన్నా తక్కువ స్థాయి విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని మార్పులు చేయాలని కోరారు.

సమాచార శాఖ డైరెక్టర్ రాజమౌళికి 'నవతెలంగాణ' శుభాకాంక్షలు



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల శాఖ డైరెక్టర్ బి. రాజమౌళికి నవతెలంగాణ దినపత్రిక చీఫ్ జనరల్ మేనేజర్ పి. ప్రభాకర్, సంపాదకులు ఆర్.సుధాభాస్కర్ నూతన సంవత్సరం 2023 శుభాకాంక్షలను తెలియజేశారు. ఈసందర్భంగా సమకాలీన అంశాలు చర్చించారు. అలాగే నవతెలంగాణ 2023 సంవత్సరం ప్లానర్, క్యాలెండర్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ పత్రిక జనరల్ మేనేజర్లు ఎం. వెంకటేశ్, పి.నరేందర్‌రెడ్డి, స్పెషల్ కరస్పాండెంట్ బి.బసవపున్నయ్య పాల్గొన్నారు.

కొత్త సవాళ్లను ఎదుర్కొనేందుకు సిద్ధంకావాలి

- కొత్త సంవత్సర వేడుకల్లో
- నవతెలంగాణ సీజీఎం ప్రభాకర్, ఎడిటర్ సుధాభాస్కర్



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

నవతెలంగాణ పత్రిక ఎన్నో సవాళ్లు, కష్టాలు, నష్టాలను ఎదుర్కొని నిలబడిందనీ, భవిష్యత్‌లో మరిన్ని రావచ్చునీ, ఎదుర్కొనేందుకు సిద్ధం కావాలని నవతెలంగాణ చీఫ్ జనరల్ మేనేజర్ పి. ప్రభాకర్, ఎడిటర్ ఆర్. సుధాభాస్కర్ అన్నారు. శనివారం హైదరాబాద్‌లోని ఎంహెచ్ భవన్‌లో నూతన సంవత్సరం 2023 వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా సీజీఎం, ఎడిటర్ కేక్ కట్ చేశారు. అనంతరం ఇరువురు మాట్లాడుతూ మన పత్రికకు కష్టాలు కొత్తకాదనీ, అన్నింటినీ తట్టుకుని పత్రికను నిలబెట్టుకున్నామని చెప్పారు. ఇందులో ఉద్యోగులు, సిబ్బంది పాత్ర గొప్పదని అభినందించారు. కొత్త సంవత్సరంలో ఉద్యోగులు, సిబ్బంది బాధ్యతలను మరింత పకడ్బంధిగా నిర్వర్తించడం ద్వారా పత్రికను మరింత అభివృద్ధి చేసుకుందామని అన్నారు. దేశంలో మతోన్మాద ప్రభావం పెరుగుతున్నదనీ ఆందోళన వ్యక్తం చేశారు. ఆమేరకు పాఠకులు, ప్రజలను చైతన్యం చేసేలా కృషిచేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో నవతెలంగాణ బుక్‌హౌజ్ ఎడిటర్ పి.ఆనందాచారి, జనరల్ మేనేజర్ పి.లింగారెడ్డి, చీఫ్ ఫోటోగ్రాఫర్ కె.ఎన్.హరి, స్పెషల్ కరస్పాండెంట్ బి.బసవపున్నయ్య, బ్యూరో చీఫ్ బీవీఎన్ పద్మరాజు, జనరల్ డెస్క్ షిఫ్ట్ ఇన్‌ఛార్జి కె.లలిత తదితరులు పాల్గొన్నారు.

సంఘర్ష యాత్రను జయప్రదం చేయండి

- ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.అజయ్‌బాబు
- జీపు జాతా పోస్టర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఈ నెల 7న హైదరాబాద్‌లో ప్రారంభం కానున్న రవాణా కార్మికుల సంఘర్ష యాత్రను జయప్రదం చేయాలని ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.అజయ్‌బాబు పిలుపునిచ్చారు. శనివారం ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ హైదరాబాద్ నగర కమిటీ ఆధ్వర్యంలో సీఐటీయూ కార్యాలయంలో జీపు జాతా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అజయ్‌బాబు మాట్లాడుతూ.. రవాణారంగం కార్మికులు ఎదుర్కొనే సమస్యల పరిష్కారం కోసం ఈ యాత్ర చేపడుతున్నట్టు చెప్పారు. రవాణా కార్మికుల సంక్షేమ బోర్డు సాధన, మోటార్ వెహికల్ సవరణ చట్టం-2019 రద్దుతోపాటు ఆర్టీసీ పరిరక్షణ కోసం ఏఆర్‌టీడబ్ల్యూఎఫ్ రాష్ట్రస్థాయి జీపు జాతా నిర్వహిస్తుందని తెలిపారు. రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, మోటార్ వాహన చట్టం-2019ను సవరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో డ్రైవర్లపై వేస్తున్న పెనాల్టీలు భరించలేని స్థాయిలో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఓవర్ లోడు పెనాల్టీ విపరీతంగా కార్మికుల ఆదాయాన్ని దోపిడీ చేస్తుందన్నారు. కేరళలో సవారీ యాప్ తరహా తెలంగాణలోనూ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. నగరంలో అనేక చోట్ల వెహికల్ పార్కింగ్ పెద్ద సమస్య అవుతుందని, జీహెచ్‌ఎంసీ, ట్రాఫిక్ అధికారులు కార్మికులు అడిగినచోట పార్కింగ్ స్టాండ్‌కు స్థలం ఇవ్వాలని డిమాండ్ చేశారు. జనవరి 3వ తేదీన ఖమ్మంలో ప్రారంభమయ్యే సంఘర్ష యాత్ర(జీపు జాత) జనవరి ఏడో తేదీన హైదరాబాద్‌లోకి అడుగుపెడుతుందని, 7న నగరంలో కార్మికుల బైక్ ర్యాలీ ఉంటుందని, ఈ ర్యాలీలో అత్యధిక సంఖ్యలో డ్రైవర్‌లు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అల్లాబక్షు, ఉమేష్ రెడ్డి, కలీము సాబేరా, గౌస్, అహ్మద్ ఖాన్, కుమార్ స్వామి, కృష్ణ, మొయిన్, నబి నజీర్ తదితరులు పాల్గొన్నారు.



వ్యవసాయ కార్మికుల్లో ప్రశ్నించే ధైర్యాన్ని నింపాలి

రాజకీయ చైతన్యం కల్పించాలి

- ప్రభుత్వ పథకాలపై పాలకులను నిలదీయాలి
- క్షేత్రస్థాయి నుంచి వ్యవసాయ కార్మిక పోరాటాలు ఉధృతం కావాలి
- వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎంపీ తమ్మినేని వీరభద్రం

ఖమ్మం నుంచి నవ తెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

వ్యవసాయ కార్మికుల్లో ప్రశ్నించే ధైర్యాన్ని నింపాలనీ, వారికి ఏ సమస్య వచ్చినా వ్యవసాయ కార్మిక సంఘం ముందుండి పోరాడాలని రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎంపీ తమ్మినేని వీరభద్రం పిలుపునిచ్చారు. ఖమ్మంలోని వేదగిరి శ్రీనివాసరావు నగర్(భక్తరామదాసు కళాక్షేత్రం)లోని అమరవీరుల ప్రాంగణంలో జరుగుతున్న వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలో ఆయన శనివారం ప్రసంగించారు. గ్రామాల్లో వారు ఆత్మగౌరవంతో బతికేలాగా రాజకీయ చైతన్యం కల్పించాలని సూచించారు. ఆర్థిక పోరాటాలపై పరిమితం చేయకుండా సామాజిక, సాంస్కృతిక పోరాటాల్లో కలిసి వచ్చేలాగా కషి చేయాలన్నారు. కూలీల్లో కుల,మత, ఎక్కువ, తక్కువ అనే భావనను పోగొట్టాలన్నారు. వారంతా ఒక్కతాటిపైకి వచ్చి పోరాడేలా చైతన్యపరచాలన్నారు. ప్రతి పోరాటం వర్గ పోరాటం కాదన్నారు. గ్రామాల్లో భూస్వాములు చేతుల్లో ఉన్న మిగులు భూములను వెలికి తీసి పేదలకు పంచేలాగా పోరాటం చేయాలన్నారు. వర్గ పోరాటాల ద్వారానే ఉద్యమాలు బలపడతాయన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ఒక వర్గ పోరాటం అన్నారు. ఆనాడు భూస్వాములకు వ్యతిరేకంగా పోరాడి లక్షలాది ఎకరాల భూమిని పేదలకు పంచడం వల్లనే నేటికీ ఆ పోరాటం స్ఫూర్తిదాయకంగా ఉందన్నారు. అలాంటి పోరాటాలు నేడు చేయాల్సిన అవసరం ఉందని ఆకాంక్షించారు. బిజెపి అనుబంధ సంఘాలు స్వతంత్రంగా తమ భావజాలాన్ని ప్రజల్లోకి ఎక్కిస్తున్నాయన్నారు. దీన్ని వ్యవసాయ కార్మిక సంఘం తిప్పి కొట్టేలాగా కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. పోడు భూముల సమస్య పరిష్కారం కోసం పోరాటాలను ఉధృతం చేయాలన్నారు. ఇతర ప్రజా, వ్యవసాయ కార్మిక సంఘాలను కలుపుకొని ఐక్య పోరాటాలను నిర్మించాల్సిన ఆవశ్యకత ఉందని నొక్కిచెప్పారు.

మహిళల అణచివేత తీవ్రం : మల్లు లక్ష్మి

కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలపై దాడులు, లైంగిక దాడులు తీవ్రం అయ్యాయని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలో ఆమె సౌహార్ద్ర సందేశాన్ని ఇచ్చారు. మనుస్మృతిని తీసుకొచ్చి మళ్లీ మహిళలను వంటింటికి పరిమితం చేసే తిరోగమన విధానాల వైపు బీజేపీ నాలన ఉందని విమర్శించారు. వ్యవసాయ కూలీల్లో మహిళలే ఎక్కువ అన్నారు. ఖమ్మంలో జరిగిన బహిరంగ సభ విజయవంతం అయిందనీ, పేదలు కమ్యూనిస్టుల వైపు ఉంటారని నిరూపితం అయిందని తెలిపారు. వ్యవసాయ కార్మిక సంఘం చేసే పోరాటాల్లో తమ వంతు సహకారం ఉంటుందని హామీనిచ్చారు.

రిజర్వేషన్లను ఎత్తివేసే కుట్ర : స్కైలాబ్‌బాబు

దేశంలో రిజర్వేషన్లను ఎత్తివేసే కుట్రకు మోడీ సర్కారు పూనుకున్నదని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్‌బాబు విమర్శించారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలనుద్దేశించి ఆయన శనివారం సౌహార్ద్ర సందేశాన్ని ఇచ్చారు. రిజర్వేషన్లను ఎత్తివేస్తే ఎక్కువగా నష్టపోయేది వ్యవసాయ కార్మికులేనన్నారు. రాష్ట్రంలో 76 కులదురంహకారం హత్యలు జరిగాయన్నారు. మరోవైపు ఉత్తర తెలంగాణలోని నిజామాబాద్, నిర్మల్, కామారెడ్డి, తదితర జిల్లాల్లో వీడీసీల పేరుతో దళితులను అణచివేస్తున్న, గ్రామ బహిష్కరణ చేస్తున్న తీరును వివరించారు. వ్యవసాయ కార్మిక సంఘం చేసే పోరాటాల్లో కేవీపీఎస్ కూడా కలిసి వస్తుందని హామీనిచ్చారు.

వలస పక్షుల్లా వ్యవసాయ కార్మికులు..

- కోనేరు రంగారావు కమిటీ సిఫార్సులను అమలు చేయాలి
- ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు దడాల సుబ్బారావు

ఖమ్మం నుంచి నవ తెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

తెలంగాణలో చేస్తున్నట్టు ఏపీలోనూ 245 కేంద్రాల్లో 40 వేలకు పైగా ఎకరాల్లో భూ పోరాటం చేస్తున్నామని ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు చెప్పారు. ఏపీలో పాలకులు అనుసరిస్తున్న విధానాలు, యాంత్రీకరణతో వ్యవసాయ కార్మికులు వలస పక్షుల్లా మారిపోయారని వాపోయారు. ఖమ్మంలోని వేదగిరి శ్రీనివాసరావు నగర్(భక్తరామదాసు కళాక్షేత్రం)లోని అమరవీరుల ప్రాంగణంలో జరుగుతున్న వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలో ఆయన శనివారం ప్రసంగించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో కోటి 20 లక్షల ఎకరాల మిగులు భూమి ఉందని దాన్ని పేదలకు పెంచాలని కోనేరు రంగారావు కమిటీ సూచించిందని తెలిపారు. ఆ కమిషన్ సిఫారసులను వెంటనే అమలుపరచాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులు కూలిపోరాటాలకు ఆటంకంగా మారుతున్నాయని చెప్పారు.

వ్యవసాయ కూలీలకు కనీస వేతన చట్టం అమలు చేయాలి

పలు కమిషన్ల రిపోర్టులను సమర్పించిన కమిటీలు

ఖమ్మం నుంచి నవతెలంగాణ ప్రతినిధి

వ్యవసాయ కూలీలకు కనీస వేతనాల చట్టాన్ని అమలు చేయాలనీ, వాటి కోసం పోరాటాలను ఉధృతం చేయాలని రాష్ట్ర మహాసభ నిర్ణయించింది. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మూడో మహాసభలో పలు కమిషన్‌లను మహాసభ ముందు పెట్టారు. వేతన కమిషన్‌ను ఆ సంఘం రాష్ట్ర నాయకులు సాంబశివ మహాసభలో ప్రవేశపెట్టారు. వ్యవసాయ రంగంలో వచ్చిన మార్పులు, వలస కార్మికులు, తదితర కారణాల వల్ల వ్యవసాయ కూలీల పనిదినాలు తగ్గిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. నాట్లు, కోతల సమయంలో తప్ప కూలీల కొరత అనేదే ఉండట్లేదన్నారు. సగటున ఒక్కో వ్యవసాయ కార్మికునికి 100 నుంచి 120 రోజుల పనిదినాలే దక్కుతున్నాయని చెప్పారు. భూ సమస్యల కమిషన్ రిపోర్టును మచ్చా వెంకటేశ్వర్లు సమర్పించారు. పోడు భూముల హక్కు పత్రాల కోసం పోరాటాలను ఉధృతం చేయాలన్నారు. ధరణి పోర్టల్ సమస్య తీవ్రంగా ఉందని చెప్పారు. భూపోరాటాలను తీవ్రం చేయాలని సూచించారు. ఉపాధి హామీ చట్టంపై బత్తుల వెంకటేశ్వర్లు కమిషన్‌ను ప్రవేశపెట్టారు. ఆ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్రం నిధులను తగ్గిస్తూ పోతున్నదనీ, అమలు విషయంలో అనేక కొర్రీలు పెడుతూ తెలంగాణ అన్యాయం చేస్తున్నదని చెప్పారు. ఆ చట్టాన్ని రక్షించుకునేందుకు పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. పెండింగ్ వేతనాల విడుదల కోసం పోరాటాలు చేయనున్నట్టు తెలిపారు. సేవా, సాంస్కృతిక రంగాల్లో వ్యవసాయ కార్మిక సంఘం మునుముందు చేయాల్సిన కార్యక్రమాల గురించి చెబుతూ కమిషన్‌ను గడ్డం స్వామి ప్రవేశపెట్టారు. మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా ప్రచారం చేయాలన్నారు. గ్రామాల్లో చాపకింద నీరులా విస్తరిస్తున్న మనువాద భావజాలాన్ని ఎక్కడికక్కడ అడ్డుకట్ట వేయడంలో వ్యవసాయ కార్మిక సంఘం తన వంతు పాత్ర పోషించాలన్నారు. సాంస్కృతిక రంగంలోనూ వర్గపోరాటం చేయాలన్నారు. సామాన్య సమస్యలపై కమిషన్‌ను సమర్పిస్తూ జగన్ మాట్లాడారు. మోడీ సర్కారు హయాంలో పెరుగుతున్న నిత్యావసర ధరలు, తగ్గుతున్న నిజవేతనాలతో వ్యవసాయ కార్మికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారు. నిర్మాణరంగ కమిషన్‌ను కొండమడుగు నర్సింహ్మ, సోషల్‌మీడియా కమిషన్‌ను శ్రీనివాసరావు సమర్పించారు. మహిళల సమస్యలపై వినోద కమిషన్‌ను ప్రవేశపెడుతూ మాట్లాడారు. సమాన పనికి సమాన వేతనం ఎక్కడా అమలు కావడం లేదన్నారు. కూలిరేట్ల విషయంలో మహిళలకు తీవ్ర అన్యాయం జరుగుతున్నదని చెప్పారు. పనిప్రదేశాల్లో మహిళలపై దాడులు జరుగుతున్న తీరుపై ఆందోళన వ్యక్తం చేశారు. ఈ అంశాలపై సుదీర్ఘ పోరాటాలు చేయాలని మహాసభ నిర్ణయించింది.

నూతన విద్యావిధానంతో అందరికీ విద్య అందదు

ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

ఖమ్మం నుంచి నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి



కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యావిధానంతో అందరికీ విద్య అందదని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. ఖమ్మంలోని వేదగిరి శ్రీనివాసరావు నగర్ లోని అమరవీరుల ప్రాంగణం లో జరుగుతున్న తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మూడో మహాసభలో ఆయన మాట్లాడారు. ఒకటెండ్రు రూముల్లో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రాల్లో నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ, బాలింతలకు, గర్భిణీలకు ఆహారం అందించడం, వంట చేయడం ఎలా సాధ్యం అవుతుందని ప్రశ్నించారు. సీఎం కేసీఆర్ తర్వాత అత్యధిక జాబ్‌చార్టు ఉన్నదని బహుశా అంగన్‌వాడీకేనని చెప్పారు. ఇప్పటివరకు నిబంధనలకు విరుద్ధంగా ప్రయివేటు రంగంలో కొనసాగుతున్న పూర్వప్రాథమిక విద్య చట్టబద్ధం చేసి కార్పొరేట్లకు అప్పగించే యత్నంలో భాగంగానే నూతన విద్యావిధానం వచ్చిందన్నారు. పాఠ్యపుస్తకాల్లో చరిత్రను వక్రీకరించి రాయడం దుర్మార్గమన్నారు. అందరికీ ఒకే గౌరవం అనేది దేశంలో ఎక్కడ అమలవుతున్నదని ప్రశ్నించారు. మనకు తెలియకుండానే నూటికి 90 శాతం ప్రయివేటు పాఠశాలల్లో మనువాద భావజాలాన్ని విద్యార్థులకు జొప్పిస్తున్న పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.ప్రభుత్వ పాఠశాలల్లో టీచర్ పోస్టులను భర్తీ చేయకుండా, మౌలిక సదుపాయాలు కల్పించకుండా మెరుగైన విద్య అందించడం ఎలా సాధ్యం అవుతుందని పాలకులను నిలదీశారు. ప్రభుత్వ విద్య, వైద్య వ్యవస్థలను కాపాడుకునేం దుకు జరుగుతున్న పోరాటాల్లో వ్యవసాయ కార్మిక సంఘం కూడా కలిసి రావాలని పిలుపునిచ్చారు. బస్తీదవాఖానాల పేరుతో హడావిడి చేయడం మానేసి ప్రతి పీహెచ్‌సీలోనూ ముగ్గురు డాక్టర్లను పెట్టి 24 గంటలు పనిచేసేలా చేయాలని పాలకులను డిమాండ్ చేశారు. దేశంలో కొత్తవాటి పేరుతో ఉన్న హక్కులను కాలరాస్తున్న పరిస్థితి ఉందని చెప్పారు.

2023లో ప్రజల జీవితాల్లో గుణాత్మక మార్పు రావాలి...

- సీఎం కేసీఆర్ శుభాకాంక్షలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గతాన్ని సమీక్షించుకుంటూ.. వర్తమానాన్ని విశ్లేషించుకుంటూ.. భవిష్యత్తును అన్వయించుకుంటూ మన జీవితాలను మరింతగా తీర్చిదిద్దుకోవాలని ముఖ్యమంత్రి కేసీఆర్ సూచించారు. నూతన సంవత్సరం సందర్భంగా తెలంగాణతోపాటు దేశ ప్రజలందరికీ ఆయన శుభాకాంక్షలు తెలిపారు. 2023లో ప్రజల జీవితాల్లో గుణాత్మక మార్పు రావాలంటూ ఆకాంక్షించారు. యువత నిర్దిష్ట లక్ష్యాలను రూపొందించుకుని ముందుకు సాగాలని అభిలషించారు. జీవితం పట్ల సరైన దృక్పథం.. సంకల్ప బలం ఉంటేనే లక్ష్య సాధనలో సఫలీకృతమవుతామని సీఎం ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఆయనతోపాటు శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రులు వేముల ప్రశాంత్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర తదితరులు రాష్ట్ర ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

ఓయూ అభివృద్ధిలో పూర్వ విద్యార్థులు

- ఓయూ వీసీ ప్రొ. రవీందర్ యాదవ్
- యూనివర్సిటీలో యాంఫీ థియేటర్‌కు శంకుస్థాపన



నవతెలంగాణ-ఓయూ

ఓయూ అభివృద్ధికి పూర్వ విద్యార్థులు ముందుకు రావటం అభినందనీయమని వీసీ ప్రొఫెసర్ రవీందర్‌యాదవ్ అన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో డా.గుర్రం నాగయ్య ఓపెన్ ఎయిర్ థియేటర్ త్వరలో అందుబాటులోకి రానుంది. ఓయూ పూర్వ విద్యార్థి, సిద్ధార్థ గ్రూప్ విద్యాసంస్థల చైర్మెన్ డా.నాగయ్య తన పేరు మీద 'యాంఫీ థియేటర్' నిర్మించేందుకు ముందుకొచ్చారు. ఈ మేరకు ఠాగూర్ ఆడిటోరియం పక్కనే ఈ థియేటర్ నిర్మించేందుకు వీసీ రవీందర్ యాదవ్, రిజిస్ట్రార్ ప్రొ. పి.లక్ష్మీనారాయణ, డాక్టర్ నాగయ్యతో కలిసి శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నాగయ్య మాట్లాడుతూ.. సుమారు రూ.50 లక్షలతో ఈ నిర్మాణం చేపడుతున్నామని వెల్లడించారు. తనకు విద్యాబుద్ధులు నేర్పి తనను ఇంతటివాడిని చేసిన ఓయూకు తిరిగి ఏదైనా చేయాలనే కోరిక ఉండేదని, ఓపెన్ ఎయిర్ థియేటర్ కట్టేందుకు అవకాశం వచ్చినందుకు ఆనందంగా ఉందని అన్నారు. వీసీ రవీందర్‌యాదవ్ మాట్లాడుతూ.. పూర్వ విద్యార్థులు ఉస్మానియా అభివృద్ధికి ముందుకు రావటం సంతోషంగా ఉందన్నారు. గ్లోబల్ అలుమ్నీ మీట్‌కు ముందే ఓపెన్ ఎయిర్ థియేటర్ నిర్మాణానికి డాక్టర్ జి.నాగయ్య ముందుకు రావటం తొలి మెట్టని చెప్పారు. ఇంకా ఎంతో మంది ఉన్నత శిఖరాలు అధిరోహించారని, అవకాశం ఉన్న ప్రతి ఒక్కరూ ఉస్మానియా పునఃవైభవానికి తోడ్పాటును అందించాలని కోరారు. ఈ సందర్భంగా నాగయ్యను అభినందించారు. ఉస్మానియా సమగ్ర అభివృద్ధికి నాగయ్య లాంటి వ్యక్తులు ముందుకు వస్తున్నారని, గ్లోబల్ అలుమ్నీ మీట్ ద్వారా దశాబ్దాలుగా ఎక్కడెక్కడో స్థిరపడిన పూర్వ విద్యార్థులు కలుసుకోవాలని రిజిస్ట్రార్ ప్రొ. లక్ష్మీనారాయణ అన్నారు. విద్యార్థులకు మౌలిక వసతుల అభివృద్ధి కోసం పూర్వ విద్యార్థులు చేయూతనివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్.సి.డి.సి డైరెక్టర్ ప్రొ.స్టీవెన్‌సన్, డాక్టర్ ప్రకాశ్ రెడ్డి, సిద్ధార్థ గ్రూప్ విద్యా సంస్థల డైరెక్టర్‌లు వంశీకృష్ణ, మోహన్ రావు, కార్తీక్, ప్రిన్సిపాల్ జి.గోవర్ధిని, త్రివేణి, సిద్ధార్థ్, పలువురు సీనియర్ అధ్యాపకులు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

బైరి నరేష్‌కు 14 రోజుల రిమాండ్

- పరిగి సబ్ జైల్‌కు తరలింపు
- జైల్ వద్ద ఉద్రిక్తత, అయ్యప్ప స్వాములను అడ్డుకున్న పోలీసులు

నవతెలంగాణ-కొడంగల్, పరిగి

అయ్యప్ప స్వాములపై అనుచిత వ్యాఖ్యలు చేసిన భారత నాస్తిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు బైరి నరేష్‌కు వికారాబాద్ జిల్లా కొడంగల్ కోర్టు జడ్జి 14రోజుల రిమాండ్ విధించారు. అతన్ని పరిగి సబ్ జైలుకు తరలించారు. పరిగి సీఐ, కొడంగల్ ఎస్ఐ రవిగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. కొడంగల్ మండలం రావులపల్లి గ్రామంలో అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో అయ్యప్ప స్వాములపై బైరి నరేష్ అనుచిత వ్యాఖ్యలు చేశాడు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో బైరి నరేష్‌పై చర్యలు తీసుకోవాలని అయ్యప్ప స్వాములు రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేశారు. దీంతో శుక్రవారం బైరి నరేష్‌పై 153ఏ, 295ఏ, 298, 505 సెక్షన్ల కింద కొడంగల్ పోలీసులు కేసు నమోదు చేశారు. పరారీలో ఉన్న బైరి నరేష్‌ను అదుపులోకి తీసుకునేందుకు పోలీసులు నాలుగు టీంలను ఏర్పాటు చేశారు. వరంగల్ జిల్లా జనగామలో శనివారం ఆయనను అరెస్టు చేశారు. అక్కడి నుంచి కొడంగల్‌కు తరలించారు. బైరి నరేష్‌తోపాటు అంబేద్కర్ యువజన సంఘం రావులపల్లి గ్రామ అధ్యక్షులు హనుమంతును కోర్టులో హాజరుపరిచారు. వీరికి కోర్టు జడ్జి 14 రోజుల రిమాండ్ విధించారు. భారీ బందోబస్తు మధ్యన పోలీసులు వారిని పరిగి సబ్‌జైల్‌కు తరలించారు.

రైతు ఆత్మహత్యలపై తప్పుడు లెక్కలు.. : పల్లా రాజేశ్వరరెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో రైతుల ఆత్మహత్యలు పెరిగాయంటూ కొన్ని పత్రికలు అసత్య వార్తలను ప్రచురిస్తున్నాయని రైతు బంధు సమితి రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వరరెడ్డి విమర్శించారు. అవన్నీ తప్పుడు లెక్కలేనని కొట్టి పారేశారు. ఆ వార్తలన్నీ నిరాధారమైనవని చెప్పారు. రాష్ట్రంలో రైతులు సంతోషంగా ఉంటే కొన్ని మీడియా సంస్థలు ఓర్వలేకపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం హైదరాబాద్‌లోని బీఆర్ఎస్ ఎల్పీ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... రైతు బంధు పథకం కింద ఇప్పటికే రూ.65 వేల కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేశామని తెలిపారు.

జర్నలిస్టు ఇండ్ల స్థలాల సమస్యకు త్వరలో పరిష్కారం : మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో ఘనంగా న్యూ ఇయర్ వేడుకలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సమాజం కోసం ఎంతో కష్టపడి పని చేస్తున్న జర్నలిస్టులు.. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా నిలుస్తున్నారని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ప్రసంశించారు. జర్నలిజమనేది ఒక గొప్ప వృత్తి అనీ, అయితే కాలంతో పోటీ పడుతూ పాత్రికేయులు ఎప్పటికప్పుడు అప్‌డేట్ అవుతూ ఉండాలని ఆయన సూచించారు. హైదరాబాద్ ప్రెస్‌క్లబ్ (సోమాజీగూడ)లో శనివారం రాత్రి నిర్వహించిన నూతన సంవత్సర వేడుకల్లో మంత్రి ముఖ్య అతిథిగా మాట్లాడారు. జర్నలిస్టుల పిల్లలకు స్కాలర్‌షిప్పుల పంపిణీని ఆయన ప్రారంభించారు. పాత్రికేయుల ఇళ్లు, ఇళ్ల స్థలాలకు సంబంధించిన అంశం ముందుకెళుతున్నదనీ, ఆ సమస్య త్వరగా పరిష్కారమయ్యేందుకు వీలుగా తన వంతు కృషి చేస్తానంటూ హామీనిచ్చారు. జర్నలిస్టుల పిల్లల కోసం బాలలత రూ.ఐదు లక్షల స్కాలర్ షిప్పులను ఇస్తున్నారనీ, తాను కూడా ప్రతీయేటా రూ.ఐదు లక్షలను ఇవ్వటం ద్వారా తోడ్పాటునందిస్తానని వివరించారు.

బైరి నరేష్‌పై భౌతిక దాడులు, అరెస్టులను ఖండించండి: కేవీపీఎస్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అశాస్త్రీయ పురాణ కథను విమర్శించినందుకు భారత నాస్తిక సమాజం నాయకుడు హేతువాది బైరి నరేష్, ఆయన మద్దతుదారులపై భౌతిక దాడులు చేయడమే గాక అక్రమంగా అరెస్ట్ చేయటాన్ని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవిపిఎస్) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జాన్‌వెస్లీ, టి స్కైలాబ్‌బాబు శనివారం ఒక ప్రకటనలో ఖండించారు. భావ ప్రకటన స్వేచ్ఛను హరించే చర్యగా కేవీపిఎస్ భావిస్తున్నదని తెలిపారు. అయ్యప్ప స్వాములు ముసుగులో ఆర్ఎస్ఎస్, మత విద్వేషాలు రెచ్చగొట్టడానికి ఈ తరహా కుట్రలు చేస్తున్నదని పేర్కొన్నారు.

పౌష్టికాహారాన్ని అందించేందుకు పెద్ద ఎత్తున చర్యలు : మేడే రాజీవ్ సాగర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సీఎం కేసీఆర్ సూచనలు, సలహాలతో తెలంగాణ ఫుడ్స్ ద్వారా దేశంలో ఎక్కడా లేని విధంగా పౌష్టికాహారాన్ని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆ సంస్థ చైర్మెన్ మేడే రాజీవ్ సాగర్ తెలిపారు. తాను చైర్మెన్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఆ సంస్థ సాధించిన పురోగతిపై ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. గత నెలలో ఆసియాలోనే అతి పెద్ద ఎక్స్‌ట్రూడర్ ప్లాంటును నాచారంలోని తమ సంస్థ ప్రాంగణంలో ఏర్పాటు చేశామని తెలిపారు.

కార్పొరేట్ సేద్యం దేశానికి ప్రమాదం

అంబానికి వ్యవసాయం.. అదానీకి గోదాములు

- ప్రాంతీయ పార్టీల వైఖరీపైనా చర్చిస్తున్నాం
- వ్యకాస పార్టీ కాదు.. రాజకీయాలకు అతీతం కాదు
- జర్నలిస్టుల సమస్యలపైనా మహాసభలో తీర్మానం
- ముదిగొండలాంటి మరో భూ పోరాటానికి సమాయత్తం : వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బి.వెంకట్, పక్కన తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు నాగయ్య, నున్నా, కనకయ్య తదితరులు

నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

ఆహార భద్రతను దెబ్బతీసి.. కార్పొరేట్ల చేతుల్లో వ్యవసాయాన్ని పెట్టేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని, అది దేశానికి అత్యంత ప్రమాదకరమని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం (ఏఐఏడబ్ల్యూయూ) ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ అన్నారు. కార్పొరేట్ వ్యవసాయం అంటే ధనికుల సాగు ఒక్కటే కాదు.. ఇప్పుడు ఇది అంబానీ వ్యవసాయం అన్నారు. భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ)ని రద్దు చేస్తున్నామని అదానికి సంకేతం ఇవ్వడమే కాకుండా రూ.వేల కోట్లు గోదాముల నిర్మాణానికి సైతం రుణాలిచ్చారని ఆరోపించారు. భారత వ్యవసాయాన్ని కాపాడు కోవడంతోపాటు ఆహార భద్రతను నిలబెట్టుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మూడో మహాసభ ముగింపు సందర్భంగా శనివారం ఖమ్మం భక్త రామదాసు కళాక్షేత్రంలోని వేదగిరి శ్రీనివాసరావు నగర్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

భారత రాజ్యాంగం ఉండాలని తాము కోరుకుంటుంటే.. దాని స్థానంలో ఆర్ఎస్ఎస్ ఎజెండా ఉండాలని బీజేపీ కోరుకుంటోందన్నారు. రాష్ట్రపతి భద్రాచలం వస్తే ప్రజాసంఘాల నాయకులు ఆమెను కలవకుండా వ్యవసాయ కార్మిక సంఘం సీనియర్ వర్కింగ్ కమిటీ మెంబర్ మచ్చా వెంకటేశ్వర్లును నిర్బంధించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పోడు భూములపై రాష్ట్రపతి స్పందించి వుంటే బాగుండేద న్నారు. రాజ్యాంగ ప్రథమ పౌరురాలిగా ఉన్న రాష్ట్రపతి విధులను సైతం బీజేపీ ఆటంకపరుస్తోంద న్నారు. అంటరానితనం నిర్మూలనకు కేరళలో దళితులను పూజారులుగా నియమించారని, ఇదే స్ఫూర్తితో తమిళనాడులోనూ నియమించిన విషయాన్ని ప్రస్తావించారు. వ్యవసాయంలో సాధించిన సమృద్ధిని దెబ్బతీసేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందన్నారు. విద్యుత్ బిల్లు విషయంలో ఆంధ్రప్రదేశ్ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆ రాష్ట్రాన్ని తాకట్టుపెట్టారని విమర్శించారు.

కార్పొరేట్ వ్యవసాయానికి వ్యతిరేకంగా ఫిబ్రవరి 20 నుంచి ఏప్రిల్ 5 వరకు దేశవ్యాప్త కాంపెయిన్ తీసుకుంటున్నామని తెలిపారు. దీనిలో భాగంగా తెలంగాణలో నాలుగు దశల్లో కాంపెయిన్ ఉంటుందన్నారు. దేశవ్యాప్తంగా పది కోట్ల కుటుంబాలను కలవాలని టార్గెట్‌గా పెట్టుకున్నా మన్నారు. తెలంగాణలో కనీసం 75 లక్షల కుటుం బాలను కలవాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నామని తెలిపారు. నెలరోజులపాటు పాదయాత్రలు చేస్తూ కార్పొరేట్ వ్యవసాయాన్ని రద్దు చేయాలి, వ్యవసాయ కార్మికులను కాపాడుకోవాలి, కార్మిక కోడ్‌లు రద్దు కావాలనే డిమాండ్‌తో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు తెలిపారు. మార్చిలో దేశవ్యాప్తంగా విస్తృతంగా సభలు నిర్వహించాలని నిర్ణయించామన్నారు. ఏప్రిల్ 5న లక్షల మందితో 'మార్చ్ టూ పార్లమెంట్' చేపట్టనున్నట్టు చెప్పారు. వ్యవసాయం, భూములు, ఉపాధిహామీ చట్టాన్ని కాపాడుకోవడానికి ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్టు తెలిపారు. ప్రాంతీయ పార్టీల వైఖరీపైనా మహాసభలో చర్చిస్తున్నామన్నారు.

వ్యవసాయ కార్మిక సంఘం రాజకీయ పార్టీ కాదని, అయితే రాజకీయాలకు తాము అతీతం కాదన్నారు. తమ సంఘం ప్రధాన కర్తవ్యాల్లో కేంద్రంలో బీజేపీని ఓడించటం ఒకటన్నారు. ప్రాంతీయ పార్టీలు వ్యవసాయ కార్మికుల కొనుగోలు శక్తిని పెంచే చర్యలు చేపట్టడం లేదన్నారు. రెండెకరాల భూమి ఇవ్వండి.. రూపాయి బియ్యాన్ని వ్యవసాయ కార్మికులు వదులుకుంటారని చెప్పారు. ఇప్పటికీ తెలంగాణలో 28శాతం భూమి 2శాతంగా ఉన్న ధనికుల చేతిలో ఉందన్నారు. హైదరాబాద్‌లో ఉన్న కంపెనీకి ఖమ్మం జిల్లాలో ఐదెకరాలు ఎందుకని ప్రశ్నించారు. హైదరాబాద్ చుట్టూ ఉన్న 5 లక్షల ఎకరాలు ప్రస్తుతం రాజకీయ నాయకులు, పెట్టుబడిదారులకు చెందిన కంపెనీల చేతిలో ఉన్నాయన్నారు. కేసీఆర్, జగన్ కంపెనీలకు భూములు ఇస్తారా? పేదలకు ఇస్తారా? తేల్చాలని పాలకులను నిలదీశారు. ఏప్రిల్ 5వ తేదీ తర్వాతగానీ, ఆలోపుగానీ ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ముదిగొండ తరహా మరో భూపోరాటానికి సిద్ధం చేస్తున్నామని చెప్పారు. భూపోరాటాలు, ఇండ్లస్థలాల పోరాటాలు, కూలి పోరాటాలు నిర్వహిస్తామన్నారు. ప్రభుత్వం భూమిని పంచుతుందా? లేక తమని పంచుకోమంటారా? అని ప్రశ్నించారు. జర్నలిస్టుల సమస్యలపైనా మహాసభలో చర్చించినట్టు తెలిపారు. సీఎం కేసీఆర్ వెంటనే జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలన్నారు. సాగుదారులకే రైతుబంధు ఇవ్వాలని కోరారు. వ్యవసాయ కూలీలకూ కూలిబంధు పెట్టాలని డిమాండ్ చేశారు.

సాదాబైనామా మీద కొనుగోలు చేసిన భూములకు 58, 59 జీవో ప్రకారం పట్టాలు ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు నాగయ్య డిమాండ్ చేశారు. రాష్ట్రంలో డబుల్‌బెడ్రూం ఇండ్లకు 40 లక్షల దరఖాస్తులు వస్తే ఇప్పటి వరకు 36వేలు మాత్రమే ఇచ్చారన్నారు. రాష్ట్రంలో 30 లక్షల మందికి ఇండ్లస్థలాలు లేవన్నారు. పేదలందరికీ భూములు పంచాలి, కనీస వేతనాల చట్టాన్ని సవరించాలి, రూ.600 కూలి ఇవ్వాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం మహాసభను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో ఏఐఏడబ్ల్యూయూ కేంద్ర కమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు, నారి ఐలయ్య, రైతు సంఘం రాష్ట్ర నాయకులు నున్నా నాగేశ్వరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు అన్నవరపు కనకయ్య, సీఐటీయూ నాయకులు బుర్రి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు : చాడ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర ప్రజలకు సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెలంగాణపై కక్ష ధోరణితో వ్యవహరిస్తున్నదని శనివారం ఒక ప్రకటనలో విమర్శించారు. తెలంగాణ ప్రజలకు ద్రోహం చేస్తున్నదని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో పేర్కొన్న ఏ ఒక్క హామీని కూడా అమలు చేయలేదని పేర్కొన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో అసెంబ్లీ స్థానాలు పెంచాలంటూ పార్లమెంటు చెప్పినా కేంద్రం పెంచడం లేదని తెలిపారు. ఈ ఏడాదిలోనైనా తెలంగాణ పట్ల కేంద్రం కక్షపూరిత వైఖరి మానుకుని హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. బీజేపీ నాయకులు, కేంద్ర మంత్రులు తెలంగాణకు రావలసిన నిధుల కోసం, అభివృద్ధి పనుల కోసం కేంద్రంపై ఒత్తిడి పెంచాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా స్థానిక సంస్థలకు విధులు, నిధులు వెంటనే ఇవ్వాలని, పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

దేశ్‌ముఖ్ నుంచి సంఘీ టెంపుల్‌కు ప్రత్యేక బస్సులు

నవతెలంగాణ-హయత్‌నగర్



ఆంగ్ల సంవత్సరం సందర్భంగా దేశ్‌ముఖ్ నుంచి సంఘీ టెంపుల్ వరకు ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్టు హయత్ నగర్ 1 డిపో మేనేజర్ రఘు తెలిపారు. కొత్త సంవత్సరం రోజు సాయి బృదావనంకు వచ్చే భక్తుల రద్దీ దృష్ట్యా ఆలయ చైర్మన్ అభ్యర్థన మేరకు అదనపు ట్రిప్‌లు నడుపుతామన్నారు. ఈ ప్రత్యేక బస్సులు దిల్‌సుఖ్‌నగర్, ఉప్పల్ రింగ్ రోడ్డు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

సీఐ మహేందర్ రెడ్డికి సన్మానం

నవతెలంగాణ-మీర్‌పేట్



ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించినందుకు మీర్ పేట్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఎం.మహేందర్ రెడ్డి రాచకొండ కమిషనర్‌తో అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 10వ డివిజన్ కార్పొరేటర్ ముద్దా పవన్ కుమార్ సీఐ మహేందర్ రెడ్డిని శాలువాతో సత్కరించారు. ప్రజలకు మరిన్ని సేవలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కో-ఆప్షన్ సభ్యులు ఎండి రాజక్, విష్ణువర్ధన్ రెడ్డి, నర్సిరెడ్డి, డివిజన్, వివిధ కాలనీవాసులు పాల్గొన్నారు.

శాంతి భద్రతల విషయంలో రాజీ పడొద్దు

రాచకొండ సీపీ దేవేంద్ర సింగ్ చౌహాన్
బాధ్యతలు స్వీకరించిన సీపీ



నవతెలంగాణ-హయత్‌నగర్

ఇటీవల రాచకొండ నూతన కమిషనర్‌గా నియమితు లైన ఐపీఎస్ 1997 బ్యాచ్ ఉత్తరప్రదేశ్‌కు చెందిన దేవేంద్ర సింగ్ చౌహన్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ముందుగా ఆయన ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు. అనంతరం మల్కాజిగిరిలో ఉన్న సీపీ క్యాంప్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా రాచకొండ మాజీ సీపీ మహేశ్ భగవత్ ఆయ నను అభినందించారు. తదనంతరం చౌహన్ కమిషనరే ట్‌లో ఉన్న ఇన్స్పెక్టర్ స్థాయి అధికారి నుంచి ఆ పై స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించి మాట్లాడారు. నూతన సంవత్సర వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని ఆదేశించారు. శాంతి భద్రతల విషయంలో రాజీ పడొద్దని సూచించారు. నూతన సంవ త్సర వేడుకల్లో మద్యం బాబులు ప్రభుత్వ నిబంధనల ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. చౌహాన్ గతంలో హైదరాబాద్ అడిషనల్ సీపీగా పని చేశారు.

నిజాలను నిర్భయంగా రాస్తున్న పత్రిక 'నవతెలంగాణ'



విద్యాశాఖ మంత్రి మంత్రి సబితా ఇంద్రారెడ్డి
నవతెలంగాణ క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-సరూర్‌నగర్

నిజాలను నిర్భయంగా రాస్తున్న పత్రిక నవతెలంగాణ దిన పత్రిక అని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. శనివారం నవ తెలంగాణ క్యాలెండర్ 2023ను ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజా సమస్యలను వెలికి తీసి వాటి పరిష్కారానికి కృషి చేయడంలో నవతెలంగాణ ముందుంటుందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో తెలంగాణలో సంక్షేమ పథకాలు అమలు అవుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మహేశ్వరం నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి అరవింద్ శర్మ, ఆర్కే పురం డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్, సాజిద్, ప్రసనంజనేయ ఆలయ చైర్మెన్ జగిని రమేష్ గుప్తా, శ్రీ వాసవి అన్నపూర్ణ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ చైర్మెన్ మంచుకొండ సురేందర్ గుప్తా, ఊర్మిళ రెడ్డి, రవీందర్ రెడ్డి, వెంకట్ గౌడ్, రూపేష్, తదితరులు పాల్గొన్నారు.

విశ్లేషణ వార్తా కథనాలతో ముందుకెళ్తున్న నవతెలంగాణ

నాగోల్ : సమాజంలోని ప్రతి విషయాన్నీ విశ్లేషించి వాస్తవిక వార్తా కథనాలను ప్రచురిస్తూ నవతెలంగాణ దినపత్రిక ముందుకెళ్తుందని రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మెన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు. శనివారం నాగోల్‌లోని తన క్యాంపు కార్యాలయంలో నవతెలంగాణ దినపత్రిక నూతన క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించి నవతెలంగాణ పత్రిక సిబ్బందికి, రాష్ట్ర ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శ్రీనివాస్ గుప్తా మాట్లాడుతూ సమాజంలో నెలకొన్న ప్రజా సమస్యలను గుర్తించి వాటిపై సమగ్రంగా విశ్లేషించి వాస్తవిక వార్తా కథనాలను ప్రచురిస్తూ ఇటు ప్రజాప్రతినిధులను, అటు అధికారుల దృష్టి సారించి సమస్యల పరిష్కారానికి నవతెలంగాణ దినపత్రిక ఎంతో కృషి చేస్తుందన్నారు. పత్రికలు సమస్యలను పరిష్కరించేలా చేయడమే కాకుండా ప్రభుత్వాలకు, ప్రజలకు వారధిగా పని చేస్తాయన్నారు. నవ తెలంగాణ దినపత్రిక ఎప్పుడూ కార్మిక, కర్షక, బడుగు, బలహీన వర్గాల పేద, మధ్యతరగతి ప్రజల సమస్యలను వెలికితీయడానికి నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లడంలో దిన పత్రికలే కీలకపాత్రను పోషిస్తాయని పేర్కొన్నారు. నవతెలంగాణ దినపత్రిక ముందు ముందు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని మరింత అభివృద్ధి చెందాలని తెలిపారు.



దళిత కుటుంబాలకు అండగా రాష్ట్ర ప్రభుత్వం



ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే
మంచిరెడ్డి కిషన్‌రెడ్డి
మునగనూర్, తుర్కయంజాల్ దళిత
కుటుంబాలకు ఇండ్ల స్థలాల
సర్టిఫికెట్లు అందజేత

నవతెలంగాణ-తుర్కయాంజల్

దళిత జనోద్ధారణకు ముఖ్యమంత్రి కేసీఆర్ కంకణం కట్టుకున్నారనీ, దళిత కుటుంబాలకు అండగా బీఆర్ఎస్ ప్రభుత్వం నిలబడుతున్నదని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి అన్నారు. తుర్కయంజాల్, రాగన్న గూడ గ్రామాలకు చెందిన 52 కుటుంబాలకు మన్నెగూడ సర్వేనెంబర్ 27లో ఇండ్ల స్థలాల కోసం 30 సర్టిఫికెట్లు, మునగనూరులోని సర్వే నంబర్ 120లో 63 కుటుంబాలకు 20 సర్టిఫికెట్లను ఎమ్మెల్యే శనివారం అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గత కాంగ్రెస్ ప్రభుత్వంలో దళితుల నుంచి పీఓటీ కింద లాక్కున్నారనీ, వారికి ఎలాంటి న్యాయం చేయలేదనీ, వారికి న్యాయం చేసే విధంగా తన వంతు కృషి చేసినట్టు ఎమ్మెల్యే చెప్పారు. ఇండ్ల పట్టాల వల్ల ప్రతి దళిత కుటుంబానికీ నేరుగా రూ.కోటి విలువైన ఇంటి స్థలం లభించిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వెంకటాచారి, తహసీల్దార్ అనితారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు సత్తు వెంకటరమణారెడ్డి, జిల్లా రైతుబంధు సమితి అధ్యక్షుడు వంగేటి లక్ష్మారెడ్డి, డీసీసీబీ వైస్ చైర్మన్ కొత్తకురుమ సత్తయ్య, కౌన్సిలర్లు వేముల స్వాతి, మేతరి అనురాధ, మాజీ సర్పంచ్ కందాడ లక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు అమరేందర్ రెడ్డి పాల్గొన్నారు.



రైతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి

నవతెలంగాణ-బడంగ్‌పేట

రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి ఎంతో కృషి చేస్తుందని ది భాగ్యనగర్ రైతు సేవా సహకార సంఘం బ్యాంకు చైర్మన్ మర్రి నర్సింహా రెడ్డి అన్నారు. శనివారం బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న నాదర్ గుల్‌లోని ది భాగ్యనగర్ రైతు సహకార సంఘం బ్యాంకు చైర్మన్ మర్రి నర్సిహ్మారెడ్డి అధ్యక్షతన వైస్ చైర్మన్ బంగారు బాబుతో కలిసి నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతుల ఆర్థికాభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ముఖ్యంగా రైతుల కోసం రైతు బంధు, 24గంటల ఇచిత విద్యుత్, రైతు భీమా తదితర అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ చైర్మన్ పెత్తుల్ల పుల్లారెడ్డి, నాదర్‌గుల్ మాజీ సర్పంచ్ ఎల్చల సుదర్శన్ రెడ్డి, బ్యాంకు డైరెక్టర్లు తోట ప్రతాప్ రెడ్డి, తిరుపతి గిరిరాజ్, సీఈఓ అలిసా, మేనేజర్ పిండి నారాయణ రెడ్డి, అసిస్టెంట్ మేనేజర్ సువర్ణ పాల్గొన్నారు.



సచివాలయ నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గానికి సన్మానం

నవతెలంగాణ-వనస్థలిపురం

వనస్థలిపురం సచివాలయం నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సన్మాన కార్యక్రమంతోపాటు పరిచయ వేదిక కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. సచివాలయం నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా జి.కుర్మారావు, ఉపాధ్యక్షులుగా పి.సాంబశివరావు, రవికుమార్, జనరల్ సెక్రెటరీగా బి.హనుమంతరావు, కోశాధికారిగా జి.గోపాల్ రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా సీహెచ్ సూర్యనారాయణ, స్పోర్ట్స్ సెక్రెటరీగా పి.శ్రీధర్, కల్చలర్ సెక్రెటరీగా జి.బాల్ రెడ్డి, సభ్యులుగా ఎస్.ఆంజనేయులు, టి.రవికుమార్, ఈ. నరసింహారెడ్డి, కె.జనార్దన్‌రావు, కె.శాంతరాం శెట్టి, అసోసియేషన్ ఎన్నికల్లో విజయం సాధించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని సన్మానించారు.

స్వచ్ఛ మీర్‌పేట్‌కు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి



మేయర్ దుర్గాదీప్ లాల్ చౌహాన్

నవతెలంగాణ-మీర్ పేట్

స్వచ్ఛ మీర్ పేట్ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ దుర్గా దీప్ లాల్ చౌహన్ అన్నారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో జరిగిన "స్వచ్ఛ సర్వేక్షన్-2023" పై కార్పొరేటర్లకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ దుర్గా దీప్ లాల్ చౌహన్ మాట్లాడుతూ " స్వచ్ఛ మీర్ పేట" అనే నినాదంతో కార్పొరేషన్‌ని స్వచ్ఛత వైపు తీసుకెళ్లేందుకు అందరూ కృషి చేయాలని కోరారు. కార్పొరేషన్ పరిధిలోని అన్ని డివిజన్లలో వీధులు, రహదారులపై ఎలాంటి చెత్త వేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. మీర్‌పేట్ కార్పొరేషన్‌ను పరిశుభ్రమైన పట్టణంగా తీర్చిదిద్దడానికి తీసుకోవాల్సిన చర్యలు, కార్యాచరణ, నూతన పద్ధతులను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రజలను చైతన్యం చేయాలన్నారు. తడి, పొడి చెత్తలను వేరు చేయడం, ఇంట్లోని చెత్తలను తప్పనిసరిగా స్వచ్ఛ ఆటోలకు ఇవ్వడం, బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా మల మూత్ర విసర్జన చేయకుండా చర్యలు తీసుకోవడం, ప్లాస్టిక్ రహిత మీర్ పేట్‌గా చేయడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ తీగల విక్రమ్ రెడ్డి, కమిషనర్ నాగేశ్వర్, డీఈ గోపీనాథ్, కార్పొరేటర్లు, మారి స్వచ్ఛంద సంస్థ సభ్యులు, కో-ఆప్షన్ సభ్యులు మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పన్నులను తగ్గించకుంటే మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తాం

డీసీసీ రంగారెడ్డి జిల్లా చల్లా నర్సింహారెడ్డి

నవతెలంగాణ-మీర్ పేట్



పెంచిన ఇంటి పన్నులను తగ్గించకుంటే మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని కాంగ్రెస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి చేశారు. మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఉన్న అధిక ఇంటి పన్నులను తగ్గించాలని మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 15, 39, 43వ డివిజన్లలో ఇంటి ఇంటికీ తిరిగి ప్రజలతో వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీర్ పేట్ కార్పొరేషన్ లో ఇంటి పన్నులు భారీగా ఉన్నాయన్నారు. జీహెచ్ఎంసీలో సైతం ఇంతగా ఇంటి పన్నులు, వ్యాపార పన్నులు లేవన్నారు. రాష్ట్రంలో ఏ మున్సిపాలిటీలో లేని విధంగా మీర్‌పేట్ కార్పొరేషన్‌లో అధిక పన్నులు వసూలు చేస్తున్నారనీ, దీంతో ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. స్థానిక మంత్రి అధికారంలోకి వచ్చే ముందు అధికంగా ఉన్న ఇంటి పన్నులను తగ్గిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక ఆ విషయం మర్చిపోయారని విమర్శించారు. అధికంగా ఉన్న ఇంటి పన్నులను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. పన్నులు తగ్గించే వరకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మీర్ పేట్ నాయకులు చల్లా బాల్ రెడ్డి, సిద్దాల శ్రీశైలం, వెంకటేష్ గౌడ్, భాస్కర్, పరుశురాం, ఎల్లయ్య, గంగమ్మ, యాదిరెడ్డి, రవీందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణలో ప్రజల భాగస్వామ్యం చాలా అవసరం



నవతెలంగాణ-బోడుప్పల్

మేడిపల్లి పోలీసు స్టేషను పరిధిలో నేరాల నియంత్రణకు ప్రజల భాగస్వామ్యం చాలా అవసరమని మేడిపల్లి సీఐ జి.గోవర్ధన గిరి అన్నారు. శనివారం పోలీసు స్టేషన్‌లో మీడియాతో మాట్లాడారు. నేడు పెరిగిన సాంకేతికత పరిజ్ఞానంతో అపరిచితులు ఫోన్ చేసి బ్యాంకుల పేరిట మోసాలకు పాల్పడితున్నారని తెలిపారు. ప్రజలు అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్ పై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సెల్ ఫోన్లకు కొంత మంది అశ్లీల దృశ్యాలు, వీడియోలను సందేశాల రూపంలో పంపించి వలలో చిక్కేలా ప్రయత్నాలు చేస్తున్నారనీ, అలాంటి వీడియోలను డౌన్ లోడ్ చేయవద్దని పేర్కొన్నాడు. బ్యాంకు ఖాతాల వివరాలు అంటూ మీ ఫోన్‌కు ఓటీపీ వస్తుందని చెప్పి తమతమ ఖాతాలోని నగదును కాజేయాలని చూస్తారనీ, అలాంటి ఫోన్లు వచ్చినప్పుడు స్పందించవద్దని సూచించారు. ఒకవేళ ఎవరి ఖాతాలోంచి నగదు మాయమైనట్టు అనుమానం వస్తే 1930 కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు.

డ్రగ్స్ విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలి

ఈ మధ్య కాలంలో కాలేజ్ విద్యార్థులే టార్గెట్‌గా గంజాయి, డ్రగ్స్ ముఠాలు అమ్మకాలు సాగిస్తున్నాయనీ,, తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనను ఎప్పటికప్పుడు గమనిస్తూ జాగ్రత్తలు తీసుకోవాలనీ, ఎవరైనా గంజా, డ్రగ్స్ తీసుకున్నట్టు అనుమానం వస్తే వారికి పోలీసు స్టేషను లో కౌన్సిలింగ్ నిర్వహించి మార్పులు తీసుకురవచ్చాని తెలిపారు.

పలు డివిజన్లలో కార్పొరేటర్ పర్యటన

నవతెలంగాణ-ఉప్పల్



చిల్కానగర్ డివిజన్‌లోని ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా కార్పొరేటర్ గీత పలు కాలనీల్లో పర్యటించారు. ప్రజలను వారి సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ గీతా మాట్లాడుతూ కళ్యాణపురి ఈ సేవా నుంచి హైకోర్టు కాలనీ వరకు బాగా దెబ్బతిన్న సీసీ రోడ్డుకు ప్రతిపాదనను పెట్టి నూతన సీసీ రోడ్డు ఏర్పాటు చేస్తానని తెలిపారు. ప్రమాదకరంగా మారిన వాటర్ వర్క్స్ మ్యాన్ హెూల్స్ ని వెంటనే మరమ్మత్తు చేయిస్తామని తెలిపారు. పలు కాలనీల్లో వీధి దీపాల కొరత ఉందనీ, వాటిని వెంటనే ఏర్పాటు చేయిస్తామని తెలిపారు. ఆదర్శనగర్ కాలనీలో వాటర్ ప్రెషర్‌ని అరికట్టే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, ఎద్దుల కొండల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కోకుండా జగన్, రామానుజన్, ముద్దం శ్రీనివాస్ యాదవ్, ఫోటో బాలు, మహమూద్, భీరప్ప గడ్డపాలు శ్యామ్ నిదాన కవి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మత్తుకు బానిసై భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దు



నవతెలంగాణ-బోడుప్పల్

మత్తుకు బానిసై తమ ఉజ్వలమైన భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని నేషనల్ స్మాల్ ఇండస్ట్రీస్ కార్పొరేషన్ డిప్యూటీ మేనేజర్ అబ్దుల్ ఖాదర్ అన్నారు. శనివారం పర్వతాపూర్‌లోని అరోరా టెక్నాలజికల్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ కాలేజ్ మెకానికల్ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల నివారణ, దుష్పలితాలపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అబ్దుల్ ఖాదర్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ చాపకింద నీరులా వ్యాపిస్తున్న డ్రగ్స్ మాఫియాపై ఇప్పటికైనా ఉక్కుపాదం మోపకపోతే.. యువత భవిష్యత్తు అంధకారం అవుతుందన్నారు. ప్రతి విద్యార్థీ మాదకద్రవ్యాలకి దూరంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా అరబిందో కాలేజీ ఆఫ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ ప్రిన్సిపాల్ డాక్టర్ రాజ్ కుమార్ మాట్లాడుతూ సరదాగా మొదలయ్యే డ్రగ్స్ వినియోగం అలవాటు.. చివరికి బానిసగా మార్చుకుంటుందన్నారు. డ్రగ్స్ కోసం నేరాలు చేసేందుకు కూడా బాధితులు వెనకాడరని తెలిపారు. స్నేహితులు, బాంధవ్యాలను మరిచి ఒంటరిగా కుంగిపోయి చివరికి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని తెలిపారు, ఈ కార్యక్రమంలో మెకానికల్ విభాగాధిపతి అనిల్ కుమార్, డాక్టర్ అజయ్ కుమార్, కళాశాల అసిస్టెంట్ రిజిస్టర్ బాలకృష్ణారెడ్డి, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అక్రమ కేసులతో ఉద్యమాన్ని అణచలేరు



నవతెలంగాణ-బోడుప్పల్

రాష్ట్ర స్థాయి పోలీసు నియమాకాల్లో జరిగిన అవకతవకలపై విచారణ జరిపి అర్హులైన అభ్యర్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో శనివారం చేపట్టిన చలో ప్రగతి భవన్ కార్యక్రమాన్ని నిలువరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అక్రమ అరెస్టులకు పాల్పడుతుందని మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొత్త సుశాంత్ గౌడ్ అన్నారు. పోలీసు రిక్రూట్ మెంట్‌లో ఉన్న సమస్యలకు పరిష్కారం చూపేందుకు మార్గాలు చూపాలని డిమాండ్ చేస్తే సదరు అంశంపై శ్రద్ధ లేని ఈ రాష్ట్ర ప్రభుత్వం పోలీసులను ప్రయోగించి ఉద్యమాన్ని అణిచివేసే ప్రయత్నాలు చేయడం సిగ్గు మాలిన చర్యగా అభివర్ణించారు. పోలీసు నియమాకాల్లో అవలంభిస్తున్న నూతన విధానాల వల్ల అనేకమంది అర్హులైన వారికి నష్టం జరగడంతోపాటు కొంత మంది ప్రాణాలు కోల్పోయారనీ, అందుకే నియమాకాల్లో జరుగుతున్న అవకతవకలపై విచారణ జరిపేలా చర్యలు తీసుకోవాలని కోరితే పోలీసులు ముందస్తు అరెస్టులకు పాల్పడటం సరైన పద్ధతి కాదన్నారు. మేడిపల్లి పోలీసులు అరెస్టు చేసిన యూత్ కాంగ్రెస్ నాయకులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో నియోజకవర్గ ఉపాధ్యక్షుడు ఉప్పుగళ్ల ప్రశాంత్, అసర్ల భీరప్ప, తోటకూర రాహుల్ యాదవ్, గణేష్ నాయక్, తదితరులు ఉన్నారు.

బచ్‌పన్ అకాడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్‌లో విజ్ఞాన ప్రదర్శన

నవతెలంగాణ-వనస్థలిపురం



వనస్థలిపురం డివిజన్ పరిధిలోని బచ్‌పన్ అకాడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్‌లో విద్యార్థిని విద్యార్థులు విజ్ఞాన ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ ప్రదర్శనను పబ్లిక్ స్కూల్ రీజినల్ డైరెక్టర్ కె.శ్రీకాంత్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. విద్యార్థిని, విద్యార్థులు వివిధ అంశాలకు సంబంధించిన నమూనాలను ఈ ప్రదర్శనతో ప్రదర్శించి తమ నైపుణ్యాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ ఇలాంటి విజ్ఞాన ప్రదర్శనలు విద్యార్థుల్లో సృజనాత్మకతను, విషయ పరిజ్ఞానాన్ని, మేధా సంపత్తిని ఇను ముడింపజేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో తమ ప్రతిభ పాటవాలను వారు ప్రశంసించారు. వీరికి సత్కరించిన విద్యార్థుల తల్లిదండ్రులను ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులను, అడ్మిన్ బందాన్ని ఆయన అభినందించారు.



పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ వరం

నవతెలంగాణ-అబ్దుల్లాపూర్‌మెట్

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరమని బండరావిరాల ఎంపీటీసీ దంతూరి అనిత మహేందర్ గౌడ్ అన్నారు. ముఖ్యమంత్రి సహాయనిధి కింద మంజూరైన చెక్కులను బండరాల గ్రామానికి చెందిన బాధితులు దంటపల్లి వీరా రెడ్డికి రూ.60 వేలు, వల్లపు ఐలయ్యకి రూ.60 వేలు, డొంకని బుచ్చయ్యకు రూ.28 వేల చెక్కులను ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ మాట్లాడుతూ ముఖ్య మంత్రి సహాయనిధి పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఎంతో ఆసరాగా నిలుస్తుందన్నారు. వారి కుటుంబాలకు ఆర్థిక సహాయం అందుతుందని తెలిపారు. ఎమ్మెల్యే మంచి రెడ్డి కిషన్ రెడ్డి సహకారంతో ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందేలా కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు సమన్వయ కమిటీ అధ్యక్షుడు వంగేటి లక్ష్మారెడ్డి, డీసీసీబీ బ్యాంక్ వైస్ చైర్మన్ కొత్త కుర్మ సత్తయ్య, సహకార సంఘం చైర్మన్ లెక్కల విఠల్ రెడ్డి, బీఆర్ఎస్ అధ్యక్షులు కొత్త కిషన్‌గౌడ్, మాజీ అధ్యక్షుడు పూజారి చక్రవర్తి, మండల సంయుక్త కార్యదర్శి మొలుగు దానేష్, గ్రామ శాఖ అధ్యక్షుడు జంగయ్య, యువజన విభాగం అధ్యక్షుడు కవాడి దయాకర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు కందికంటి ప్రవీణ్, ఎస్సీ సెల్ అధ్యక్షులు చిలుకూరు నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్లు మారుతున్నయ్.. బతుకులు మారట్లేదు




పవతెలంగాణ-సంతోష్ నగర్

వెనుకబడిన వడ్డెర జాతి భవిష్యత్ మారాలంటే చదువుకున్న వడ్డెర యువత ముందుకు రావాలనీ, ఎవరో వస్తారు.. ఏదో చేస్తారు అని వేచి చూస్తే క్యాలెండర్లు మారుతున్నాయి తప్ప బతుకులు మారట్లేదు అని వీఆర్పీఎస్ అధ్యక్షులు గుంజి సంతోష్ కుమార్ అన్నారు. శనివారం వీఆర్పీఎస్ ప్రధాన కార్యాలయంలో తమ్మిశెట్టి శివకృష్ణను ఆ సంఘం రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా నియమిస్తూ ఆయన నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంతోష్ కుమార్ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ఇప్పటికీ కొంతమంది వడ్డెరలను దూరంగా పెడుతూ వివక్షతకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు చదువు లేని వాళ్ళు చేస్తున్న కొన్ని ఘటనల వల్ల మొత్తం అలానే ఉంటారని చులకనగా సమాజం చూస్తుందన్నారు. తమ్మిశెట్టి శివకృష్ణ గతంలో తాను చెప్పిన మాటలు విశ్వసించి ఈరోజు విద్యావంతులుగా ముందుకు వచ్చినట్టు తెలిపారు.

గ్రామ బాలల పరిరక్షణకు తగిన చర్యలు

నవతెలంగాణ-ఘట్కేసర్



గ్రామాల్లో బాల బాలికల పరిరక్షణ కోసం తగిన చర్యలు చేపట్టనున్నట్టు ఘనపూర్ గ్రామ సర్పంచ్ బద్దం గోపాల్ రెడ్డి అన్నారు. ఘట్ కేసర్ మండలంలోని ఘణపురం గ్రామంలో బాలల పరిరక్షణ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గోపాల్ రెడ్డి మాట్లాడుతూ 18 ఏండ్ల లోపు బాలబాలికల రక్షణ, సంరక్షణ కోసం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు. పిల్లల భద్రత అందరి బాధ్యత అన్నార. ప్రతినెలా గ్రామసభలో బాల బాలికల, మహిళల సమస్యలను చర్చించుకుంటామని తెలిపారు. గ్రామ సెక్రెటరీ శశికుమార్ మాట్లాడుతూ పిల్లల రక్షణకు, మహిళల భద్రత గురించి గ్రామసభలో చర్చించుకుంటామన్నారు. బాల బాలికలపై జరుగుతున్న అఘాయితులపై, బాల్య వివాహాలకు, బడి ఈడు పిల్లలు బడిలో ఉండాలని తెలిపారు. మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లా బాలల పరిరక్షణ సభ్యుడు శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ ఆపదలో ఉన్న బాల బాలికలకు ఎలాంటి సమస్య వచ్చినా 1098 కాల్ చేయవచ్చునీ, ఇది ఉచిత టోల్ ఫ్రీ నెంబర్ అనీ, జాతీయస్థాయిలో పని చేస్తుందని తెలిపారు. గ్రామస్థాయి బాలల పరిరక్షణ కమిటీలో గ్రామంలోని బాల్య వివాహాలు, బడి ఈడు పిల్లలు బడిలో ఉండాలని, పిల్లలు బాల కార్మికులు గా పని చేయరాదని, బిక్షాటన చేస్తున్న పిల్లలు కనిపించినా, తప్పు పోయిన పిల్లల గురించి తెలిసిన, బాలలపై జరుగుతున్న పిల్లలపై జరుగుతున్న లైంగిక వేధింపులు, అఘాయిత్యాలపై పిల్లల అక్రమ రవాణా దత్తత ప్రక్రియ, తల్లిదండ్రులు కోల్పోయిన పిల్లలకు స్పాన్సర్‌షిప్ ఇస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ వేముల పరమేశ్వర్ గౌడ్, అంగన్వాడీ టీచర్ మంజుల, సరోజ, వీఓ బాలమ్మ, వార్డ్ మెంబర్స్, వద్య పవన్, గ్రామ పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరేందర్, సతీష్ కుమార్, అనిల్ రెడ్డి, ఆశా లత, చైల్డ్ లైన్ మెంబర్ మల్లేష్, గ్రామ పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

మంత్రి మల్లారెడ్డిని కలిసిన నాగారం మున్సిపల్ బీఆర్ఎస్ నాయకులు



నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్

రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డిని నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుంట్ల చంద్రారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు గండి అంజయ్య గౌడ్, జెమ్మల శ్రీనివాస్‌గౌడ్, నెలుట్ల భాస్కర్, ఎలిజాల ఐలేష్ గౌడ్, దయాకర్ మర్యాదపూర్వకంగా కలిసి మంత్రిని శాలువాతో సన్మానించారు. రాంపల్లి, ఘట్కేసర్, చర్లపల్లి టు కరీంగూడ రోడ్డు వెడల్పు పనులు జరిగేలా చూడాలని మంత్రిని కోరారు. మంత్రి సానుకూలంగా స్పందించి త్వరలో రోడ్డు వెడల్పు టెండర్ పనులు అయి పోగానే పనులు ప్రారంభిస్తామని మంత్రి తెలిపారన్నారు.

డౌన్ బడ్స్ మోడల్ స్కూల్‌లో పిల్లలకు ఎల్లో కలర్ కార్యక్రమం

నవతెలంగాణ-బేగంపేట్

డౌన్ బడ్స్ మోడల్ స్కూల్‌లో ప్రిన్సిపాల్ నాగరాజు ఆధ్వర్యంలో ప్రీప్రైమరీ పిల్లలకు ఎల్లో కలర్ కార్యక్రమం ఎంతో ఆహ్లాదంగా నిర్వహించడం జరిగింది. ఇందులో పిల్లలు అందరు ఎల్లో డ్రస్సులు వేసుకొని, ఎల్లో పండ్లు, ఎల్లో పువ్వులు, ఎల్లో బెలూన్లు ప్రదర్శిస్తూ ఎంతో ఆనందంగా జరిగింది. ఈ కార్యక్రమంలో పద్మరేఖ, మంజుల, శ్రీవాణి, లక్ష్మి తదితర ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.



నాలాల అభివృద్ధితోనే సమస్య పరిష్కారం

మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

నవతెలంగాణ-బేగంపేట్

నాలాల సమగ్ర అభివృద్ధితోనే వరదముంపు సమస్య శాశ్వతంగా పరిష్కారం అవుతుందని రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య పాడి పరిశ్రమల అభివృద్ధి, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శనివారం సనత్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని మినిస్టర్ రోడ్‌లో పికెట్ నాలాపై ఎస్ఎన్‌డీపీ కార్యక్రమం కింద చేపట్టిన వంతెన పునర్నిర్మాణ పనులను మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాల క్రితం నిర్మించిన నాలాల నిర్వహణ సక్రమంగా లేకపోవడం, నాలాలు ఆక్రమణలకు గురికావడం వంటి కారణాలతో ప్రతి సంవత్సరం వర్షాకాలంలో నాలాకు ఎగువ నుండి వచ్చే నీరు సక్రమంగా వెళ్ళక పరిసర కాలనీలు వరద ముంపునకు గురవుతున్నాయని చెప్పారు. పికెట్ నాలా వంతెన కూడా ప్రస్తుతం నీటి వరద ప్రవాహానికి అనుగుణంగా లేకపోవడం వలన వరద



ముంపు సమస్య ఏర్పడుతుందని అన్నారు. ఈ సమస్య పరిష్కారం కోసమే ఎస్ఎన్‌డీపీ కార్యక్రమం కింద 20కోట్ల రూపాయల వ్యయంతో వంతెన పునర్నిర్మాణ పనులు, కళాసీగూడ నాలా విస్తరణ పనులను చేపట్టినట్లు వివరించారు.

పునర్నిర్మాణ పనులలో భాగంగా గతంలో 12 మీటర్లు ఉన్న వంతెనను 22 మీటర్ల వెడల్పుతో నిర్మిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా 20మీటర్ల వెడల్పుతో ఉన్న రోడ్డును 30మీటర్లకు విస్తరించడం జరుగుతుందని అన్నారు. వంతెన నిర్మాణ పనులు చేపట్టిన ప్రాంతంలో మంచినీటి సరఫరా పైప్ లైన్, 132 కేవీ విద్యుత్ లైన్‌లు ఉన్నాయని, ఆయా శాఖల అధికారుల సమన్వయంతో పనులను వేగవంతం చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఈ వంతెన నిర్మాణం పూర్తయితే కంటోన్మెంట్, ఆసియా ఖండంలోనే అతిపెద్ద బస్తీగా ఉన్న రసూల్‌పురా బస్తీ, అన్నానగర్, బీహెచ్ఈఎల్ కాలనీ, ఇక్రిశాట్ తదితర కాలనీల ప్రజలకు మేలు జరుగుతుందని అన్నారు. మంత్రి వెంట ఎస్ఎన్‌డీపీ సీఈ కిషన్, వాటర్ వర్క్స్ డైరెక్టర్ కృష్ణ, ఎస్ఈ భాస్కర్‌రెడ్డి, కార్పొరేటర్ మహేశ్వరి, మాజీ కార్పొరేటర్ అత్తిలి అరుణ, జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, ఈఈ సుదర్శన్, వాటర్ వర్క్స్ జీఎం రమణారెడ్డి, ఎలెక్ట్రికల్ డీఈ శ్రీధర్, శానిటేషన్ డీఈ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ముగిసిన తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ 3వ మహాసభలు

నవతెలంగాణ-సిటీబ్యూరో

తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ మల్కాజిగిరి ఏరియా 3వ మహాసభలు విజయవంతంగా ముగిశాయి. అంబేద్కర్ భవన్‌లో జరిగిన సభకు బాలయ్య, నర్సయ్యలు అధ్యక్షులుగా వ్యవహరించారు. 60మంది ప్రతినిధులు హాజరయ్యారు. రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాలకుర్తి క్రిష్ణమూర్తి, మచ్చా రంగయ్యల పర్యవేక్షణలో 25మందితో కార్యవర్గం ఏర్పడింది. నూతన కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా ఆర్.అశోక్, జి.ఆర్.విజయ కుమార్‌లు ఎన్నికయ్యారు. ఈ మహాసభలో పలు తీర్మానాలు ఆమోదించారు. ఇపిఎస్ పెన్షనర్లకు డీ.ఏ.తో కూడిన కనీస పెన్షన్ 9వేలు అమలు చేయాలని, వైద్య వసతులు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లలకు పీ.ఆర్సీ సిఫార్సుల జీ.వోలు వెంటనే విడుదల చేయాలని, డీ.ఏ



బకాయిలు చెల్లించాలని, వెల్‌నెస్ సెంటర్ పని విధానం మెరుగుపరచాలని, కేంద్ర ప్రభుత్వ పెన్షనర్లకు ఫ్రీజ్ చేసిన 3 డి.ఏలను విడుదల చేయాలి. సీనియర్ సిటిజన్లకు నిలిపి వేసిన రైల్వే ఛార్జీల రాయితీలు పునరుద్ధ రించాలి. బస్సుల్లో కూడా రాయితీలు అమలు చేయాలి. తీర్మానాల అమలు కోసం పెన్షనర్లు అందరినీ సమీకరించి బలమైన ఉద్యమం నిర్మిస్తామని, నూతనంగా ఎన్నికైన కమిటీ నాయకులు తెలిపారు.

రెడ్ బకెట్ బిర్యానీ సెంటర్ ప్రారంభం

ఎమ్మెల్యే సాయన్న, మైనంపల్లి రోహిత్

నవతెలంగాణ-కంటోన్మెంట్

నూతన టేక్ వే రెడ్ బకెట్ బిర్యాని పాయింట్‌ను తిరుమలగిరి చౌరస్తాలో శనివారం ఎమ్మెల్యే సాయన్న, మైనంపల్లి రోహిత్ 'రెడ్ బకెట్ బిర్యానీ' పేరిట ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి తిరుమలగిరి పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ శ్రవణ్ కుమార్, పలు పార్టీల నేతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వాకులు వెంకట్ రెడ్డి మాట్లాడుతూ రెడ్ బకెట్ బిర్యానీ క్వాలిటీ, క్వాంటిటీ ప్రత్యేకతని తిరుమలగిరిలో మొదటి బ్రాంచీగా ప్రారంభించినట్లు, రానున్న రోజుల్లో మరికొన్ని బ్రాంచీలు ఏర్పాటు చేస్తామని, రుచికరమైన బిర్యాని ప్రియులకు అన్ని



బిర్యానీల కంటే రెడ్ బకెట్ బిర్యానీ రేటు చాలా తక్కువేనంటు టేక్ వేలో స్విగ్గి, జొమాటో అందుబాటులో ఉన్నట్లు నిర్వాహకులు రెడ్డి తెలిపారు.

ఘనంగా కార్పొరేటర్ జన్మదిన వేడుకలు

- **హాజరైన ఎమ్మెల్యే మాధవరం, బీఆర్ఎస్ నాయకులు**

నవతెలంగాణ-కంటోన్మెంట్

ఓల్డ్ బోయిన్పల్లి డివిజన్ కార్పొరేటర్ నరసింహ యాదవ్ జన్మదిన వేడుకలను శనివారం నాడు పార్టీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు, స్థానిక ఎంఆర్ ఎం గార్డెన్‌లో ఘనంగా నిర్వహించారు. జన్మదిన వేడుకలు కార్యక్రమానికి కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు బీఆర్ఎస్ ప్రముఖ నాయకులు, స్థానిక కార్యకర్తలు పాల్గొని అట్టహాసంగా వేడుకలు నిర్వహించారు. ఓల్డ్ బోయిన్పల్లి డివిజన్ నుండే కాకుండా కూకట్‌పల్లి, బాలానగర్, కంటోన్మెంట్ ప్రాంతాల నుండి కూడా భారీగా కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చి కార్పొరేటర్



నరసింహ యాదవ్‌కు పుష్పగుచ్ఛం అందజేసి కేకు కట్ చేసి, ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కార్యకర్తలు, అభిమానులు మధ్య జన్మదిన వేడుకలు నిర్వహించుకోవడం తనకు ఎంతో ఆనందంగా ఉందని అన్నారు.

విద్యార్థులు ఫిజికల్ గేమ్స్‌పై శ్రద్ధ చూపాలి

- **కార్పొరేటర్ సుచిత్ర**



నవతెలంగాణ-బేగంపేట్

చిన్న పిల్లలు నుంచి పెద్దలు వరకు సెల్‌ఫోన్లకు బానిసలై జీవితాన్ని అగమ్యగోచరంగా చేసుకుంటున్నారు. ఈ విషయం సైంటిస్టులు, నిపుణులు తెలుపుతున్నారు. పదేపదే ప్రచార మాధ్యమాలలో అనేక వార్తలు వస్తున్నాయి. అయితే ఈ విషయంలో విద్యార్థులకు కార్పొరేటర్ చీర సుచిత్ర శ్రీకాంత్ చాలా చక్కగా వివరించారు. నెహ్రూ యువ కేంద్ర హైదరాబాద్ వారు సికింద్రాబాద్ రామ్ గోపాల్‌పేట డివిజన్ పరిధిలోని నల్లగుట్టలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు కబడ్డీ, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. విద్యార్థులచేత ఉత్సాహంగా, ఉల్లాసంగా ఆనందోత్సాహాలతో జరిగిన కబడ్డీ, వాలీబాల్ పోటీలు జరుగగా, గెలిచిన విద్యార్థులకు స్థానిక కార్పొరేటర్ చీర సుచిత్ర శ్రీకాంత్ ముఖ్య అతిథిగా బహుమతులు అందచేసి ప్రసంగించారు. విద్యార్థులందరు విరామ సమయంలో సెల్ ఫోన్‌లకు హత్తుకు పోకుండా ఫిజికల్ గేమ్స్‌లో పాల్గొని ఆరోగ్యంగా ఉండాలని, ఫిజికల్ గేమ్స్ ఆడినట్లైతే జ్ఞానం మరింత అభివృద్ధి చెందుతుందని ఆమె పలు విషయాలను వెల్లడించారు. ఈ కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్ర సభ్యులతోపాటు బీజేపీ శ్రేణులు మదన్, సాయికుమార్, నిర్మల, ఆషా, శ్రీధర్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు బీఎల్ఆర్ ట్రస్ట్ అండ



నవతెలంగాణ-కాప్రా

ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు ఆపన్న హస్తం అందించేందుకు బిఎల్ఆర్ ట్రస్ట్ ఎల్లవేళలా సిద్ధంగా ఉంటుందని ట్రస్ట్ ప్రతినిధి నేమూరి మహేష్‌గౌడ్ పేర్కొన్నారు. అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పెద్ద చర్లపల్లికి చెందిన కడియాల నగేష్ కుటుంబానికి అండగా నిలవాలని బీఎల్ఆర్ ట్రస్ట్ చైర్మెన్ బండారి లక్ష్మారెడ్డి ఆదేశం మేరకు నగేష్ కుటుంబానికి పదివేల రూపాయల ఆర్థిక సహాయం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ట్రస్టు ప్రతినిధి మహేష్‌గౌడ్ మాట్లాడుతూ వైకల్యంతో బాధపడుతున్న వెంకటరెడ్డి నగర్ చెందిన 14 ఏళ్ల చిన్నారికి, అదేవిధంగా క్యాన్సర్‌తో బాధపడుతున్న చర్లపల్లికి చెందిన మధుప్రియ కుటుంబాలకు గతంలోనూ ట్రస్ట్ అండగా నిలిచిందని భవిష్యత్తులో కూడా అన్ని విధాల సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత బండారి లక్ష్మారెడ్డి

నవతెలంగాణ-కాప్రా

నాచారం అంబేద్కర్ నగర్‌లో నివసించే రమణ అనే మహిళ నాచారంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ హాస్టల్లో ఆయాగా పనిచేస్తున్నది. ఇదివరకే అనారోగ్య కారణాలతో భర్త చనిపోయాడు. కొద్దిరోజుల క్రితం చౌటుప్పల్‌లో జరిగిన ప్రమాదంలో ఆమె తన రెండు కాళ్లు కోల్పోయింది. నిరుపేద కుటుంబానికి చెందిన రమణ పనిచేస్తే కానీ ఇల్లు గడవదు. ఈమెకు ఒక బాబు, ఒక పాప ఉన్నారు. వీరి చదువులకు, ఇల్లు గడవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్న సంగతి తెలిసిన బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత టీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బండారి లక్ష్మారెడ్డి బాధిత మహిళ కుటుంబానికి వచ్చి, వారి కుటుంబాన్ని పరామర్శించి వారికి ధైర్యాన్నిచ్చారు. వారి కుటుంబ పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. రాబోయే రోజుల్లో వారి కుటుంబానికి ఏ సహాయం అవసరం ఉన్న తప్పకుండా చేస్తానని హామీ ఇచ్చారు. 20వేల రూపాయల



ఆర్థిక సహాయం అందజేశారు. అలాగే కూతురుకు భవిష్యత్తులో చదువుకు సంబంధించి అన్ని ఫీజులు కట్టడానికి ముందుకు వచ్చారు. అలాగే బాధిత మహిళకు కృత్రిమ కాళ్లు ఏర్పాటుకు సహకరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సాయిజెన్ శేఖర్,ప్రముఖ యూట్యూబర్ వేదాంత్ జాక్సన్, మేకల ముత్యం రెడ్డి, ఇర్షాద్ ఖాన్, అంజి, అశోక్, నర్సింగ్‌రావు, హరిప్రసాద్, కట్టబుచ్చన్న గౌడ్, చంద్రశేఖర్ రవీందర్ రెడ్డి, విఠల్ యాదవ్, సుగుణాకర్ రావు, రఫీక్‌యాకి, భాను, రవి పాల్గొన్నారు.

అక్షరలో నూతన సంవత్సర సంబరాలు

నవతెలంగాణ-కాప్రా



ఏఎస్‌రావునగర్ అక్షర అంతర్జాతీయ పాఠశాల నందు నూతన సంవత్సర వేడుకలు అత్యంత వైభవోపేతంగా జరిగాయి. విద్యార్థినీ విద్యార్థులు నిత్య నూతనోత్సాహాలతో, వారి కేరింతలతో అక్షర పాఠశాల ఆవరణమంతా, రసరమ్యంగా మారింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని, పాఠశాల ప్రధానోపాధ్యాయిని, కనుప్రియ వాహి మాట్లాడుతూ ప్రతి సంవత్సరంలాగే ఈ సంవత్సరం కూడా నూతన సంవత్సరం రాబోతుందని, వెనుకటి సంవత్సరములోని మంచి చెడులను పోల్చుకుంటూ ,రాబోయే సంవత్సరం సుఖసంతోషాలతో గడపాలని కోరారు. విద్యార్థులు ఎల్లప్పుడూ ఆరోగ్యంగా తమ తమ తరగతులలోని విషయాలను అభ్యసనం చేసుకుంటూ, నూతనోత్తేజులు కావాలని, అటు కన్నతల్లిదండ్రులకు, మీ పురోభివృద్ధికి పాటుపడుతున్న అక్షర పాఠశాలకు పేరు తీసుకురావాలని, కోరుతూ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. తదనంతరం పాఠశాల సీఈఓ శ్రీ మదనమోహన్ రావు తరగతి తరగతికి వెళ్లి, కేక్ కట్ చేసి, విద్యార్థులందరికీ శుభాభినందనలు తెలియజేసి, అందరూ ఆరోగ్యంగా ఉండి బాగా చదువుకోవాలని ఆశీర్వదించారు. ఆ తర్వాత విద్యార్థినీ విద్యార్థుల లలిత కళా సంబరంభం జరిగింది. అందరూ ఆనందోత్సాహాల మధ్య నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్నారు.



తెలంగాణ రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మెన్‌గా పదవిని అందుకున్న సముద్రాల వేణుగోపాల చారిని కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియ జేశారు. వీరితో పాటు డివిజన్ నాయకులు తండా వాసుగౌడ్, పైళ్ల ప్రవీణ్, నర్సింగ్‌రావు, చినింగల శ్రీనివాస్, శివ తదితరులు పాల్గొన్నారు.

-నవతెలంగాణ,కాప్రా

పౌరులకు రాజ్యాంగం అనేక హక్కులు కల్పించింది

కాప్రా తహశీల్దార్ అనిత

నవతెలంగాణ-జవహర్‌నగర్

రాజ్యంగం పౌరులకు అనేక హక్కులు కల్పించిందని, ప్రతి ఒక్కరూ పౌర హక్కులపై అవగాహన కలిగి ఉండాలని కాప్రా తహశీల్దార్ అనిత అన్నారు. శనివారం కార్పొరేషన్‌లోని ఎస్సీ కమ్యూనిటీ హాల్లో పౌర హక్కులపై తహశీల్దార్ అనిత అధ్యక్షతన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ సమాజంలో ప్రజలందరూ సమానమేనని, హక్కులతోనే ప్రశ్నించేతత్వం పెరుగుతుందని, రాజ్యంగం కల్పించిన హక్కులపై ప్రజలందరూ నిలదీయొచ్చని తెలిపారు. అన్ని వర్గాల ప్రజలు పౌర హక్కులు పొందాలని, అవగాహనతోనే అవినీతిని ఎండగట్టొచ్చని



జర్నలిస్ట్ సురేందర్ అన్నారు. ఈ కార్యక్ర మంలో డిప్యూటీ తహశీల్దార్ రవీందర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ విశ్వనాథ్, జూనియర్ అసిస్టెంట్ సాయి, ఎస్సీ నాయకులు కోయడ వెంకటేష్, ప్రకాశ్, బూడిద వెంటకటేష్, శ్రీనివాస్, యాదగిరి, రెవెన్యూ సిబ్బంది చంద్రకళ, సోని, నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

బుడిబుడి నడకల చిన్నారులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించేయని పార్సిగుట్ట సెయింట్ లూయిస్ స్కూల్ నవిత ప్రిన్సిపాల్ అన్నారు. శనివారం క్రిస్మస్ మరియు నూతన సంవత్సర వేడుకలు జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందని ఆమె తెలిపారు.



-నవతెలంగాణ,బేగంపేట్

హైదరాబాద్ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు

- డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి



నవతెలంగాణ-ఓయూ

హైదరాబాద్ ప్రజలకు గ్రేటర్ హైదరాబాద్ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి, కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షులు మోతే శోభన్ రెడ్డిలు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు వారు ఒక ప్రకటనల విడుదల చేశారు. కొత్త సంవత్సరంలో రాష్ట్రం మరింతగా పురోగమించాలని, ప్రజలు సుఖ సంతోషాలతో జీవించే పరిస్థితులు కొనసాగాలని ఆకాంక్షించారు. కరోనా మహమ్మారి నుంచి పూర్తిగా గట్టెక్కే వరకు ప్రజలు పలు జాగ్రత్తలు పాటించాలని, నూతన సంవత్సరంలో అందరూ ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో, సుఖసంతోషాలతో ఆనందంగా గడపాలని కోరుకున్నారు.

40 రోజుల పోరాటంలో న్యాయం జరగలేదు



నవతెలంగాణ-బంజారాహిల్స్

40 రోజులు పోరాటం చేసినా తమకు న్యాయం జరగలేదని నిమ్స్ లో విధులు నిర్వహిస్తున్న నర్సులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇచ్చిన హామీ మేరకు నిమ్స్ పెన్షన్ పొందడానికి 200 మంది నర్సులు తమకు న్యాయం చేయాలని ప్రతిరోజూ మధ్యాహ్నం భోజనం సమయంలో ఒక గంట నిరసన కార్యక్రమం చేపడుతూ విధులు నిర్వహిస్తున్నారు. వారు మాట్లాడుతూ.. నూతన సంవత్సరంలోనైనా తమకు న్యాయం జరుగుతుందేమో వేచి చూడాలి అని, తమ పోరాటం మాత్రం ఆగదని హెచ్చరించారు. సీఎం కేసీఆర్, ఆరోగ్య మంత్రి హరీశ్‌రావులు చొరవ తీసుకొని తమ సమస్యను సామరస్యంగా పరిష్కరిస్తారని ఎదురుచూస్తున్నట్టు వారు తెలిపారు.

నూతన సంవత్సరం కానుకగా కొత్తగూడ ఫ్లై ఓవర్

- నేడు ప్రారంభించనున్న మంత్రి కేటీఆర్
- గచ్చిబౌలి ప్రాంతాల్లో తీరనున్న ట్రాఫిక్ సమస్య



నవతెలంగాణ-సిటీబ్యూరో

నూతన సంవత్సర కానుకగా హైదరాబాద్ నగర ప్రజలకు కొత్త గూడ ఫ్లైఓవర్ నేటి నుంచి అందుబాటులోకి రానుంది. ఆదివారం ఉదయం 11 గంటలకు రాష్ట్ర మున్సిపల్, పట్టణా భివృద్ధి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కె.తారక రామారావు ఈ ఫ్లై ఓవర్‌ను ప్రారంభించనున్నారు.

గచ్చిబౌలి ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యను అధిగమించడానికి రూ. 263 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన కొత్తగూడ గచ్చిబౌలి ఫ్లైఓవర్ 2216 మీటర్ల పొడవుతో అందుబాటులోకి రానున్నది. జీహెచ్ఎంసి ఎస్.ఆర్.డి.పి కార్యక్రమం ద్వారా నగర వాసులకు రోడ్డు నెట్ వర్క్ పెంచడం, రవాణా సమయం తగ్గించడం, ప్రయాణ వేగాన్ని పెంచడం, ఇంధన వనరులను తగ్గించి, చేరవలసిన గమ్యానికి సకాలంలో చేరేందుకు, ఆలస్యాన్ని తగ్గించే ప్రయోజనాలు కల్పించేందుకు ప్రయిత్నిస్తోంది. ఈ నేపథ్యంలో పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు జీహెచ్ఎంసీ కృషి చేస్తున్నది. అందులో భాగంగానే నిధులను సమకూర్చుకొని ప్రజ లకు మెరుగైన వసతులు కల్పిస్తుంది. జీహెచ్ఎంసీ ఆధ్వ ర్యంలో ఎస్.ఆర్.డి.పి ద్వారా మొత్తం 41 పనులు మరో 6 పనులను ఆర్ అండ్ బి, హెచ్ఎండీఏ, జాతీయ రహదారుల ద్వారా చేపటడం జరిగింది. ఇతర శాఖల ద్వారా చేపట్టిన 6 పనులలో 3 పనులు పూర్తి కాగా మిగతా మూడు పనులు వివిధ ప్రగతి దశలో ఉన్నాయి. ఎస్.ఆర్.డి.పి ద్వారా చేపట్టిన 41 పనులలో 31 పనులు పూర్తి కాగా కొత్తగూడ ఫ్లైఓవర్ తో 18వ ఫ్లై ఓవర్ అందుబాటులోకి వస్తుంది. దీంతో మొత్తం 47 పనులలో 34 పనులు పూర్తవుతాయి.

కొత్తగూడ గచ్చిబౌలి ప్రధాన ఫ్లై ఓవర్ 2216 మీటర్ల పొడవు కాగా అందులో(ఎస్ఎల్ఎన్ టెర్మినల్ నుంచి బొటానికల్ జంక్షన్ వరకు 5 లేన్ల వెడల్పుతో, బొటానికల్ జంక్షన్ నుంచి కొత్త గూడ జంక్షన్ వరకు 6 లేన్ల వెడల్పు, కొత్త గూడ జంక్షన్ నుంచి కొండాపూర్ ఆర్‌టీఏ ఆఫీస్ వరకు 3 లేన్ల వెడల్పు రోడ్డు ఫ్లై ఓవర్ ను పూర్తి చేశారు.

మదీనా బండ నుంచి బొటానికల్ జంక్షన్ ట్రాఫిక్ కోసం 2 లేన్ల గల బొటానికల్ అప్ ర్యాంపు, హైటెక్ కొత్తగూడ నుంచి హైటెక్ సిటీ వెళ్లేందుకు 383 మీటర్ల పొడవు తో హైటెక్ సిటీ వైపు 3 లేన్ల డౌన్ ర్యాంపును ఏర్పాటు చేశారు. 470 మీటర్ల పొడవు తో 3 లేన్ల వెడల్పుతో అండర్ పాస్ ను హాఫిజ్ పెట్ కు వెళ్లేందుకు అండర్ పాస్ ను నిర్మించారు.

కొత్తగూడ ఫ్లైఓవర్ వలన వాహనదారులు, దాని చుట్టూ ఉన్న కాలనీలు, పరిసరాల వారు ప్రయోజనం పొందుతారు. అందులో బొటానికల్ గార్డెన్, కొత్తగూడ, కొండాపూర్ జంక్షన్ ల మధ్య చాలా తక్కువ దూరంలో ఉన్న కూడళ్ల నుంచి సాఫీగా వెళ్లేందుకు వెసులుబాటు ఉంటుంది. దానికి తోడు ప్రస్తుతం ఉన్న గ్రేడ్ కారిడార్ కు ఇరువైపులా వాణిజ్య పరమైన నిర్మాణాలకు ప్రయోజనం కలుగుతుంది. ఈ జంక్షన్‌ల పరిసరాల్లో అనేక సాఫ్ట్ వేర్ కంపెనీలు ఉండడం వలన రద్దీ సమయంలో ట్రాఫిక్ సమస్య ఉండదు. గచ్చిబౌలి నుంచి మియాపూర్ వరకు ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ నుంచి హైటెక్ సిటీ వరకు కనెక్టివిటీ తో పాటు మియాపూర్, హై టెక్ సిటీ, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ పరిసర ప్రాంతాలను కలుపుతుంది. ఫ్లై ఓవర్ వలన బొటానికల్ గార్డెన్ జంక్షన్ కొత్తగూడ జంక్షన్ లలో 100 శాతం ట్రాఫిక్ సమస్య పరిష్కారం అవ్వడమే కాకుండా కొండాపూర్ జంక్షన్‌లో 65 శాతం ట్రాఫిక్ సమస్య తీరుతుంది.

హైలెవల్ కమిటీ సిఫారసులను అమలు చేయాలి



- సినీ పరిశ్రమలో మహిళలపై లైంగిక వేధింపుల నిరోధానికి చర్యలు చేపట్టాలి
- ఐద్వా హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి నాగలక్ష్మి

నవతెలంగాణ-ముషీరాబాద్

తెలుగు సినీ, టీవీ ఇండస్ట్రీలల్లో పనిచేస్తున్న మహిళలపై జరుగుతున్న లైంగిక వేధింపుల నిరోధానికి ఏర్పాటు చేసిన హైలెవల్ కమిటీ సిఫారసులను తక్షణమే అమలు చేయాలని ఐద్వా హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి నాగలక్ష్మి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని గోల్కొండ క్రాస్ రోడ్డులోని ఐద్వా నగర కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. సినీ పరిశ్రమలో మహిళలపై జరుగుతున్న లైంగిక వేధింపులు, వివక్షతకు వ్యతిరేకంగా 2018లో వివిధ మహిళా సంఘాల ఐక్యవేదిక చేసిన ఆందోళనలు, సినీ పరిశ్రమలో నటీమణుల ఆందోళనతో సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం హైలెవల్ కమిటీని నియమించిందన్నారు. సమస్యలపై అధ్యయనం చేసేందుకు సబ్ కమిటీని కూడా ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ మేరకు సినీ పరిశ్రమల్లో మహిళలపై జరుగుతున్న వివక్షతను, లైంగిక వేధింపులకు సంబంధించి సబ్ కమిటీ తన పరిశీలనలను హై లెవెల్ కమిటీకి అందజేసిందన్నారు. కానీ ప్రభుత్వం ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. సబ్ కమిటీ సిఫారసులను బహిర్గతం చేసి లైంగిక వేధింపుల నిరోధానికి చర్యలు చేపట్టాలన్నారు. తెలుగు ఫిలిం చాంబర్ ఆఫ్ కామర్స్ బాధ్యత తీసుకుని లైంగిక వేధింపుల నిరోధక కమిటీలను ప్రతీచోట ఏర్పాటు చేయాలన్నారు. వాటిని ప్రభుత్వ అజమాయిషీలో పనిచేసేటట్టు చూడాలన్నారు. ఆర్టిస్టులను తీసుకోడానికి కమిటీలను ఏర్పాటు చేయాలని కోరారు. న్యూస్ ఛానళ్లలో పనిచేసే మహిళా జర్నలిస్టులందరికీ అక్రిడేషన్ కార్డుతో పాటు ప్రెస్ క్లబ్ సభ్యత్వం కల్పించి లింగ సమానత్వానికి కషి చేయాలన్నారు. సినీ కార్మికుల భర్తీ, వేతన ఒప్పందాలపై ప్రస్తుతం ఉన్న మధ్యవర్తులు, ఏజెన్సీల జోక్యం లేకుండా చట్టపరమైన రెగ్యులేటరీ సంస్థను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షురాలు ఏ పద్మ, నాయకులు వరలక్ష్మి, షబానా పాల్గొన్నారు.

తొలగించిన కులాలను బీసీ జాబితాలో చేర్చాలి



- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య

నవతెలంగాణ-ముషీరాబాద్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2014వ సంవత్సరంలో బీసీ జాబితాలోంచి తొలగించిన శెట్టిబలిజ, కొప్పుల వెలమ, తూర్పు కాపు, కళింగ తదితర 26 కులాలను బీసీ జాబితాలో చేర్చాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్రంలో తొలగించిన 26 బీసీ కులాల పోరాట సమితి ఆధ్వర్యంలో బీసీల ఆత్మగౌరవ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆర్ కష్ణయ్య మాట్లాడుతూ గత 46 సంవత్సరాలుగా బీసీ జాబితాలో కొనసాగుతున్న ఈ కులాలు అర్ధాంతరంగా తొలగిస్తే రిజర్వేషన్లపై ఆధారపడిన వారి పిల్లల చదువులకు ఎంతో ఇబ్బందులు కలుగుతుందని తెలిపారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఆహిర్ కులంతో పాటు రాజస్థాన్ చత్తీస్‌ఘడ్, మహారాష్ట్ర, కర్ణాటక తదితర రాష్ట్రాల నుంచి వచ్చి స్థిరపడిన 17 కులాలను బీసీ జాబితాలో కలిపారని గుర్తు చేశారు. ఏదైనా కులాన్ని తొలగించాలంటే ప్రభుత్వానికి అధికారాలు లేవని, అది బీసీ కమిషన్ ద్వారానే సాధ్యమవుతుందని తెలిపారు. 2018వ సంవత్సరంలో ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో జరిగిన బీసీ శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, పార్లమెంటు సభ్యుల సమావేశంలో కూడా ఈ కులాలను బీసీ జాబితాలో కలపాలని ఏకగ్రీవంగా తీర్మానించినట్టు గుర్తు చేశారు. తెలంగాణలో గత 75 సంవత్సరాలుగా స్థిర నివాసం ఏర్పరచుకొని జీవిస్తున్న వీరిని ఇంకా ఆంధ్ర ప్రాంతమని బేధం చూపడం అన్యాయమన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఈ కులాల పట్ల పునరాలోచించి జారీ చేసిన జీవోలను ఉపసంహరించుకోవాలని కోరారు. ఆళ్ల రామకష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి పీవీ సత్యనారాయణ బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కష్ణ, బీసీ యువజన సంఘం అధ్యక్షులు నీల వెంకటేష్, కార్వాన్ కార్పొరేటర్ స్వామి యాదవ్, పురుషోత్తం మురళీధర్ శ్రీ ఆనంద ప్రసాద్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు



స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి

- కార్పొరేటర్ ఇ. విజయ్ కుమార్ గౌడ్

నవతెలంగాణ-అంబర్‌పేట

స్థానిక సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తున్నానని అంబర్‌పేట కార్పొరేటర్ ఇ.విజయ్ కుమార్ గౌడ్ అన్నారు. శనివారం అంబర్‌పేట డివిజన్ పరిధిలోని న్యూ అన్నపూర్ణ కాలనీలో మంచినీరు లో ప్రెషర్‌తో రావడంతో స్థానిక బస్తీ వాసులు కార్పొరేటర్ దష్టికి విషయాన్ని తీసుకువచ్చారు. వెంటనే స్పందించిన కార్పొరేటర్ కాలనీలో పర్యటించి సమస్యని పరిశీలించారు. అనంతరం వెంటనే సంబంధిత అధికారులకు సమస్యను తెలియజేసి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలోనే బస్తీలలో నూతన వాటర్ పైప్‌లైన్‌లను, డ్రయినేజీలను నిర్మిస్తామని, అందుకు అధికారులు ప్రపోజల్ తయారు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ స్థానిక నాయకులు వేణు తదితరులు పాల్గొన్నారు.

మత విద్వేషాలు రెచ్చగొట్టే వారిని కఠినంగా శిక్షించాలి

- మాదిగ పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు గారే వెంకటేష్



నవతెలంగాణ-ముషీరాబాద్

మత విద్వేషాలు రెచ్చగొట్టే వారి పట్ల ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరించాలని మాదిగ పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు గారే వెంకటేష్ మాదిగ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం బాగలింగంపల్లిలోని రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొంతమంది చిల్లర మల్లర నాయకులు అంబేద్కర్ పేరును అప్రతిష్టపాలు చేసే విధంగా అంబేద్కర్ వేదికల మీద ఇష్టారాజ్యంగా మాట్లాడుతూ మత విద్వేషాలను రెచ్చగొడుతున్నారని మండిపడ్డారు. అంబేద్కర్ రాజ్యాంగంలో ప్రతీ మతానికి సమాన స్థానం కల్పించాలని గుర్తు చేశారు. భారతదేశం భిన్న మతాలకు భిన్న సంస్కృతులకు నిలయమని అలాంటి సమాజంలో విద్వేషాలు రెచ్చగొడుతూ మనుషుల మధ్య దూరాన్ని పెంచే వారిని దేశ బహిష్కరణ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మాదిగ పరిరక్షణ సమితి రాష్ట్ర అధికార ప్రతినిధి ఇంజం సాంబయ్య ,మీడియా అధ్యక్షులు మాదిరే నర్సింగరావు ,జాతీయ ఉపాధ్యక్షులు తలారి నారాయణ, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు నర్సింగ్ మాదిగ, ఉపాధ్యక్షులు వెంకటేష్, నాయకులు తులసిరామ్, సంపత్ ,రాజేందర్,న దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఇంగ్లీష్ మీద పట్టుంటే పోటీ పరీక్షల్లో రాణించవచ్చు



- డాక్టర్ మహిపతి శ్రీనివాసరావు

నవతెలంగాణ-ముషీరాబాద్

ఇంగ్లీషు భాష మీద పట్టుంటే పోటీ పరీక్షల్లో రాణించవచ్చని అనురాగ్ యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ ట్రైనర్ ఫెసిలిటేటర్ రచయిత డాక్టర్ మహిపతి శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం గోల్కొండ క్రాస్ రోడ్డు లోని చె ఇన్స్టిట్యూట్ ఆఫ్ స్పోకెన్ ఇంగ్లీష్ విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ బీటెక్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన వారు వివిధ వృత్తులలో ఉన్న వారికి ఇంగ్లీష్ అంటే ఉన్న భయాన్ని తొలగించి.. చిరునవ్వుతో తమ తల్లిదండ్రులతో మిత్రులతో ఉన్నత అధికారులతో ఉత్సాహంగా చలాకిగా చెప్పదలుచుకున్న అంశాన్ని ఇంగ్లీషులో చెప్పే విధానాన్ని సులభంగా నేర్పిస్తున్నట్లు తెలిపారు. స్పోకెన్ ఇంగ్లీష్ తో పాటు సమా జంలోని ఇతర తరగతుల ప్రజలకు అండగా ఉండేలా ప్రతి ఒక్కరు తయారు కావాలని సూచించారు. ఇన్స్టిట్యూట్ ఇన్‌చార్జ్ వి కామేష్ బాబు మాట్లాడుతూ తదుపరి బ్యాచ్ ఏపీపీఎస్సీ టీఎస్పీఎస్సీ గ్రూప్ వన్ ఎస్సై క్వాలిఫైయింగ్ గ్రూప్ 2,3,4 కానిస్టేబుల్ ఎగ్జామినేషన్స్ కోసం ప్రిపరేషన్ విద్యార్థులకు ప్రత్యేకంగా నడపుతామని తెలిపారు ఈ అవకాశాన్ని వినియోగించవలసిందిగా కోరారు. మరిన్ని వివరాల కోసం గోల్కొండ క్రాస్ రోడ్డు లోని మెట్రో పిల్లర్ నెంబర్ 1086 వద్దగల చే ఇన్స్టిట్యూట్ ఆఫ్ స్పోకెన్ ఇంగ్లీష్ కేంద్రంలో 98660 83250 సంప్రదించాలని కోరారు

అత్యవసర చికిత్సతో ప్రాణాలను కాపాడాలి

- ఎమ్మెల్యే, బసవతారకం ఆస్పత్రి చైర్మెన్ బాలకృష్ణ
- ఆస్పత్రిలో ఎమెర్జెన్సీ వార్డు ప్రారంభం



నవతెలంగాణ-బంజారాహిల్స్

అత్యవసర చికిత్సతో రోగుల ప్రాణాలను కాపాడాలని ఏపీ ఎమ్మెల్యే, సినీ హీరో, బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ చైర్మెన్ నందమూరి బాలకృష్ణ అన్నారు. బసవతారకం ఆస్పత్రిలో రీసెర్చి ఇన్‌స్టిట్యూట్‌లో అత్యా ధునిక సదుపాయాలతో కూడిన 14 పడకల ఎమెర్జెన్సీ వార్డును శనివారం ఎన్ఆర్ఐ ట్రస్ట్ బోర్డు మెంబర్ గడ్డం దశరథ రామరెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అత్యవసర పరిస్థి తులలో వచ్చే పేషెంట్లకు అవసరమైన చికిత్స అందించడానికి ఈ వార్డు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఇక్కడికి దివంగత ఎన్టీఆర్ ఆశించినట్టు అందుబాటైన ధరలలో అత్యాధునిక వైద్య సదుపాయాలు రోగులకు అందించాలనే లక్ష్యాన్ని సాధించే దిశగా సాగుతున్న ప్రయాణంలో ఈ వార్డు ఏర్పాటు భాగమని చెప్పారు. త్వరలోనే అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన రేడియేషన్ యంత్రంతో పాటూ రెండో పెట్ సిటీ స్కానింగ్ యంత్రాన్ని కూడా అందుబాటులోకి తీసుకురానున్నట్టు ప్రకటించారు. హాస్పిటల్ ఎన్నో రకములైన సేవలు అందిస్తోందని, వాటికి గుర్తింపుగా ఎన్నో అవార్డులు అందుతున్నాయని తెలిపారు. అలాగే నానాటికీ పెరుగుతున్న మహమ్మారి నివారణకు సంబంధించిన అంశాలపై పరిశోధనలు చేయడానికి ప్రత్యేక పరిశోధనా విభాగం కూడా ఏర్పాటు చేశామని చెప్పారు. దాంతో పాటూ రెండు తెలుగు రాష్ట్రాలలోని ప్రజలలో క్యాన్సర్‌పై అవగాహన కలిగించడానికి కూడా సంస్థ ఎన్నో ప్రత్యేకమైన అవగాహన కార్యక్రమాలు, స్క్రీనింగ్ క్యాంపులు నిర్వహిస్తున్నదని వివరించారు. ఈ సందర్భంగా హాస్పిటల్ అభివద్ధికి పాటుపడిన సిబ్బంది, యాజమాన్యంతో పాటూ నిధులు అందిస్తున్న పలువురు దాతలకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి సీఈఓ డా. ఆర్‌వీ ప్రభాకరరావు, ఎండీ డా.టీయస్ రావు, ఎంఎస్,డా. ఫణి కోటేశ్వర రావు, అసోసియేట్ డైరెక్టర్, యాడ్ లైప్ అండ్ అకడమిక్స్ డా.కల్పనా రఘునాథ్‌లతో పాటు పలువురు వైద్యులు, వైద్యేతర సిబ్బంది, నర్సింగ్, పారామెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

నూతన సంవత్సర వేడుకలు

అనంతరం హాస్పిటల్ ఆవరణలో ఏర్పాటు చేసిన నూతన సంవత్సర వేడుకలలో బాలకృష్ణ పాల్గొని కేక్ ను కట్ చేశారు. వేడుకలలో భాగంగా సిబ్బంది నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలను వీక్షించారు.



వెల్‌కమ్ 2023





హైదరాబాద్‌లో నూతన సంవత్సర వేడుకలు అంబరాన్నంటాయి. ప్రజలు కేకులు కోస్తూ, డీజే పాటలకు డ్యాన్స్‌లు చేస్తూ నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. ఒకరికొకరు శుభాకాంక్షలు చెప్పుకున్నారు.













చోరీకి గురైన బైక్‌ను బాధితులకు అప్పగించిన పోలీసులు



నవతెలంగాణ-ధూల్‌పేట్

తరుచూ వాహనాల తనిఖీలలో దొంగతనం అయిన బైక్‌లను పోలీసులు పట్టుకుని బాధితులకు అందిస్తున్నారు. తాజాగా అబిడ్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో 2019లో దొంగతనం అయినా హీరో హెూండా ప్యాషన్ బైక్‌ను పోలీసులు పట్టుకొని శనివారం బాధితులకు అప్పగించారు. ఈ సందర్భంగా గోషామహల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ధనలక్ష్మి బైక్‌లను పట్టుకున్న సిబ్బందిని అభినందించారు.



35వ జాతీయ పుస్తక ప్రదర్శనకు శనివారం విచ్చేసిన సీపీఐ(ఎం) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు నవ తెలంగాణ బుక్ స్టాల్‌ను సందర్శించారు. అలాగే ప్రొఫెసర్ మంద భూషి శ్రీధర్ ప్రొఫెసర్ నల్సార్ కూడా నవ తెలంగాణ పుస్తక స్టాల్‌ను సందర్శిం చారు. వారికి నవతెలంగాణ బుక్ హౌజ్ జనరల్ మేనేజర్ ఆర్ వాసు పుస్తకం బహుమతిగా అందజేశారు.



నవతెలంగాణ-అదిక్‌మెట్

మన చరిత్రను తెలిపే గ్రంథం తెలంగాణ చరిత్ర తొవ్వల్లో



నవతెలంగాణ-అదిక్‌మెట్

ప్రొ. శ్రీరామోజు హరగోపాల్ రచించిన 'తెలంగాణ చరిత్ర తొవ్వల్లో' పుస్తకాన్ని హైదరాబాద్‌లోని ఎన్‌టీఆర్ స్టేడియంలో కొనసాగుతున్న హైదరాబాద్ బుక్ ఫెయిర్‌లో చరిత్రకారులు ప్రొ. యాశ్వంత్ రామూర్తి శనివారం ఆవిష్కరించారు. డెక్కన్ హెరిటేజ్ అకాడమి నిర్వహణలో పర్యావరణ వేత్త, చరిత్ర కారుడు వేదకూమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పుస్తాకావిష్కరణలో ప్రొ.సల్మా అహ్మద్ ఫరూఖీ, ప్రొ.అంజన్న,శ్రీరామోజు హరగోపాల్, చరిత్ర కారుడు హైదరాబాద్ యాదే బాతే ప్రెసిడెంట్ అనందర్ రాజ్ వర్మ,ప్రొ.రఘు,తెలంగాణ అకాడమి చైర్మెన్ జూలూరు గౌరి శంకర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా యాశ్వంత్ రామూర్తి మాట్లాడుతూ... తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయలు భిన్నత్వంలో ఏకత్వం తరహాలో ఉంటాయని చెప్పారు. అందులో హైదరాబాద్ నగరం కు ఉన్నా ప్రాముఖ్యత ఎంతో విశిష్టమైందన్నారు. ఈ నగరంపై మరిన్ని పరిశోధనలు చేసేందుకు ఈ పుస్తకం ఉపయోగపడుతుందని చెప్పారు. ప్రభుత్వం కూడా తెలంగాణ చరిత్రను, సంస్కతులను పరిరక్షించేందుకు చాల కృషి చేస్తుందన్నారు. వేదకూమార్ మాట్లాడుతూ తెలంగాణ చరిత్రను, దక్కన్ సంస్కతులను ప్రజల దృష్టికి తీసుకువచ్చేందుకు రచించిన తెలంగాణ చరిత్ర తొవ్వల్లో పుస్తకమని అన్నారు. ప్రొ.సల్మా మాట్లాడుతూ ఈ పుస్తకాన్ని వివిధ భాషలను తీసుకురావాలని సూచించారు. ప్రొ. అంజన్న మాట్లడుతూ.. తెలంగాణ చరిత్ర అంటే హైదరాబాద్ చరిత్రే అన్నారు. ఇందులో 21 ఆర్టికల్స్ 18 శాసనాలు ఉన్నాయని చెప్పారు.సాధారణ ప్రజలకు, విద్యార్థులకు చాల ఉపయోగపడుతుందని అన్నారు. అనంతరం అనంద్ రాజ్ మాట్లాడుతూ.. హైదరాబాద్ అంటే పాతబస్తీ మకరందమని చెప్పారు.

జూలూరు గౌరి శంకర్ మాట్లాడుతూ తెలంగాణ చరిత్ర రాసేందుకు చారిత్రక దారులు వేస్తున్న పుస్తకమని అన్నారు. పుస్తకంలోని ముఖ్యమైన అంశాలపై డాక్టర్ ఎస్.రఘు మాట్లాడారు.ఈ కార్యక్రమంలో కవులు, రచయితలు, స్వచ్ఛంద సంస్థలు, దక్కన్ హెరిటేజ్ అకాడమీ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

40 సెకండ్స్ పుస్తకావిష్కరణ



నవతెలంగాణ-అదిక్‌మెట్

సుప్రీయ గెహ్లాట్ రచించిన 40 సెకండ్స్ పుస్తకాన్ని హైదరాబాద్ బుక్ ఫెయిర్‌లో తెలంగాణ సాహిత్య అకాడమి చైర్మెన్ జూలూరు గౌరి శంకర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ ప్రపంచవ్యాప్తంగా ప్రతీ 40 సెకండ్లకు ఒకరు చొప్పున ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని అన్నారు. ఈ విషయం చాల ఆందోళనకరమైనదన్నారు. ముఖ్యంగా యువత ఎక్కవగా మానసిక ఒత్తడికి గురవుతున్నారని ఈ 40 సెకండ్స్ పుస్తకం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు. మంచి పుస్తకాన్ని అందుబాటులోకి తెచ్చిన రచయిత సుప్రీయ గెహ్లాట్ అభినం దించారు. ఈ కార్యక్రమంలో సినియర్ మానసిక వైద్యులు నాగేంద్ర రావు, రోషిణి పౌండేషన్ డైరెక్టర్ ఉషాశ్రీ, జ్యోతి తదితరులు పాల్గోన్నారు.

సీనియర్ టీడీపీ నాయకులు కోలన్ లైన్ నర్సింహారెడ్డిని కలిసిన ఆశినగేష్



నవతెలంగాణ-దుండిగల్

కుతుబుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ ఇంద్రన్న కాలనీకి చెందిన ఆశి నగేష్ 2023 నూతన సంవత్సరం పురస్కరించుకొని శనివారం మల్కాజ్‌గిరి పార్లమెంట్ టీడీపీ వైస్ ప్రెసిడెంట్, సీనియర్ టీడీపీ నాయకులు, కోలన్ లైన్ నర్సింహారెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

తుమ్మ భూమన్న సంస్మరణ సంతాప సభకు ఆహ్వానం అందజేత



నవతెలంగాణ-మేడ్చల్

ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు తుమ్మ భూమన్న సంస్మరణ సంతాప సభకు రావాలని కోరుతూ మాజీ సర్పంచ్ వీర్లపల్లి రాజ మల్లారెడ్డికి జిల్లా అధ్యక్షుడు బక్క నరేందర్ ఆధ్వర్యంలో శనివారం ఆహ్వాన పత్రిక అందజేశారు. తుమ్మ భూమన్న సంతాప సభ ఈ నెల 6వ తేదీన మేడ్చల్ పట్టణంలో నిర్వహించనున్నట్టుగా తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ సంఘం ఉపాధ్యక్షుడు డి.రాములు, ప్రధాన కార్యదర్శి బేత్రి విజయ్ కుమార్, మండల ఉపాధ్యక్షుడు తుడుం మాణిక్యరావు, బీఆర్ఎస్‌కేవీ నాయకులు మల్లిగాడు మహేష్, సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కే ప్రభు, మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏర్పులహరి, గజ్వేల్ నియోజకవర్గం ఇన్‌ఛార్జి కనిగిరి వెంకటేశం, నాయకులు రాజలింగం తదితరులు పాల్గొన్నారు.

వరదనీటి సమస్యకు పైప్ లైన్ ద్వారా పరిష్కారం



నవతెలంగాణ-బాలానగర్

మూసాపేట సర్కిల్ ఫతేనగర్ డివిజన్ పరిధిలోని దీన దయాళ్ నగర్‌లో కూకట్‌పల్లి శాసన సభ్యులు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుతో కలసి జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు, ఫతే నగర్ డివిజన్ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ రూ.19 లక్షల నిధులతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైప్ లైన్ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణారావు మాట్లాడుతూ ప్రతి ఏటా వర్షాకాలంలో దీనదయాళ్ నగర్ బస్తీ లోతట్టు ప్రాంతం కావడం వల్ల వరదనీరు ఇళ్లలోకి రావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని స్థానిక వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుల ఫిర్యాదు మేరకు నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఈ పైప్ లైన్ నిర్మాణం వల్ల వరదనీటిని తరలింపు జరుగుతుందన్నారు. ఈమేరకు వర్షాకాలంలో బస్తీ ప్రజలకు వరదనీటి సమస్యకు పరిష్కార మవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు కంచి బిక్షపతి, సుదర్శన్ రెడ్డి, సి.సతీష్, నాగరాజ్, రాజేష్, సాయులు, రవీందర్, మీన, అశోక్, రాజేశ్వర్ రెడ్డి, ప్రసాద్ నాయుడు, సాగర్, రామ్ రెడ్డి, కన్నయ్య, సుధాకర్ రెడ్డి, సురేష్ ముదిరాజ్, భాగయ్య, విష్ణు, వేణు, పవన్, సాంబ, సురేందర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కెపీహెచ్‌బిలో...

సరికొత్త ప్రణాళికలతో మరింత ముందుకు వెళ్ళాలి

2023 నూతన సంవత్సరంలో సరికొత్త ప్రణాళి కలతో మరింత ముందుకు వెళ్లి విజయం సాధించాలని కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూకట్‌పల్లి నియోజక వర్గ ప్రజలందరికీ 2023 నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

మీరు అనుకున్న పనులు సంకల్ప శక్తితో సాధించి ముందుకు వెళతారని ఆశిస్తున్నానని తెలిపారు. జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరాలంటే గత చేదు అనుభవాలను ఎప్పటికీ గుర్తు చేసుకోకూడదని, కేవలం భవిష్యత్తు ప్రణాళిక పై దృష్టి సారిస్తే అందరూ తప్పకుండా విజయం సాధిస్తారని అన్నారు. ఈ నూతన సంవత్స రం వేళ ప్రతి కుటుం బంలో సంతోషం వెల్లి విరియాలని, పాడి పంటలతో రాష్ట్రం, దేశం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిం చారు. విద్యార్థులు పరీక్షల్లో విజయం సాధించి తల్లితండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు.

అడవుల అభివృద్ధికి, సంరక్షణకు కృషి చేయాలి

- అటవీ అకాడమీ డైరెక్టర్, పీపీ రాజారావు



నవతెలంగాణ-దుండిగల్

కుతుబుల్లాపూర్ నియోజకవర్గం కొంపల్లి మున్సిపాలిటీ దూలపల్లి పరిధిలోని తెలంగాణ రాష్ట్ర అటవీ అకాడమీలో ట్రైనీస్ అభ్యర్థులకు మూడు నెలల వృత్యంతర శిక్షణా కార్యక్రమం శిక్షణ కార్యక్రమం ముగిసిన సందర్భంగా ఐదవ బ్యాచ్ అటవీ సెక్షన్ అధికారుల స్నాతకోత్సవం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి ముఖ్య అతిథులుగా అటవీ అదనపు సంరక్షణ వికారి ప్రధాన సంరక్షణాధికారి, తెలంగాణ రాష్ట్ర అటవీ అకాడమీ డైరెక్టర్ పీపీ రాజారావులు హాజరై మొదట ఐఎఫ్ఎస్సీ పరేడ్ నిర్వహించగా స్నాతకోత్సవంలో శిక్షణార్థులకు ఉత్తీర్ణతా పత్రాలను, ఉత్తమ ఫలితాలను సాధించిన వారికి బంగారు పతకాలను ఐఎఫ్ఎస్ ప్రదానం చేశారు. మొత్తం (24) మంది శిక్షణార్థులలో వికారాబాద్ అటవీ డివిజన్‌కు చెందిన కె.రాజేందర్‌రెడ్డి అత్యధిక మార్కులు పొంది బ్యాచ్ టాపర్‌గా, అల్ రౌండర్‌గా నిలువగా పురుషుల మారథాన్ పరుగు పందెంలో సైతం ప్రథమ స్థానంలో నిలిచి, అత్యుత్తమ ప్రతిభను కనబరిచి (3) బంగారు పతకాలను సాధించారు. పూర్ణిమ మారథాన్ పరుగు స్త్రీల విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకాలను సాధించారు. ఈ కార్యక్రమంలో అటవీ అకాడమీ డైరెక్టర్, పీపీ రాజారావు మాట్లాడుతూ సెక్షన్ అధికారుల బాధ్యత లు అకాడమీలో శిక్షణ పొందిన పిదప పెరుగు తాయని, వారు క్షేత్ర స్థాయిలో స్వీయక్రమ శిక్షణతో బాధ్యతా యుతంగా శిక్షణా జ్ఞానాన్ని, నైపుణ్యాలను వినియోగించుకుని సమర్థ వంతంగా విధులు నిర్వర్తించి అడవుల రక్షణకు, అభివృద్ధికి కృషిచేయాలని, అకాడమీకి, అటవీ శాఖకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. విశ్రాంత అటవీ అధికారులు, జీ.రవీందర్, జి.నర్సయ్య, అటవీ అకాడమీ అదనపు డైరెక్టర్ ఎస్.రమేశ్, డిప్యూటీ డైరెక్టర్ లు గంగా రెడ్డి, వి.ఆంజనేయులు, వి.రామ మోహన్, ఎస్ఏ నాగిని బాను, ఎస్ఆర్ సంగీత, రేంజ్ అధికారు లు, పి.సునీత, ఎం.వంశీ కృష్ణ, వై.సుభాష్‌చంద్ర యాదవ్, రామ్ మోహన్, డిప్యూ టీ రేంజ్ అధికారి ఉమారాణి, సెక్షన్ అధికారి ప్రవీణ్ కుమార్, అటవీ క్షేత్రాధికారి, బీట్ అధికారి శిక్షణార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బైరి నరేష్‌పై కఠిన చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-మేడ్చల్



అయ్యప్ప స్వామిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బైరి నరేష్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని గుండ్ల పోచంపల్లి మున్సిపల్ కౌన్సిలర్ హేమంత్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హిందూ దేవుళ్ళ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన బైరి నరేష్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ గుండ్లపోచంపల్లి మున్సిపల్ పరిధిలోని అయ్యప్ప సొసైటీ సభ్యులు శనివారం నిరసన వ్యక్తం చేశారు. కౌన్సిలర్ హేమంత్ రెడ్డి మాట్లాడుతూ వికారాబాద్ జిల్లా కోస్గిలో ఇటీవల నిర్వహించిన ఒక సమావేశంలో బైరి నరేష్ అనే వ్యక్తి హిందూ దేవుళ్ళు, అయ్యప్ప స్వామిపై చేసిన వ్యాఖ్యలపై మండిపడ్డారు. ప్రభుత్వం వెంటనే అతని అరెస్ట్ చేసి పీడీ యాక్ట్ నమోదు చేయాలన్నారు. అతని అరెస్టు చేసేంత వరకు నిరసన కార్యక్రమాలు కొనసాగిస్తామని చెప్పారు. కార్యక్రమంలో దేవాలయ ఛైర్మెన్ రవీందర్‌గౌడ్, గురుస్వాములు అమరేందర్, ఆకుల నర్సింగ్ రావు, జీత్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, అయ్యప్ప స్వాములు బండారి అశోక్, గడిల కృష్ణారెడ్డి, ఉదయ్ భాస్కర్, రంజిత్ రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

డ్రయినేజీ వ్యవస్థను పరిష్కరించండి

సీఐటీయూ కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్



నవతెలంగాణ-బాలానగర్

పారిశ్రామిక ప్రాంత రహదారులపై మురుగు నీరు ప్రవహిస్తూ అస్తవ్యస్తంగా ఉన్న ఆయా ప్రాంతాల నుండి కార్మికులు, స్థానికులు ముక్కు మూసుకుని రాకపోకలు సాగించాల్సిన దుస్థితి నెలకొందని బాలానగర్ పారిశ్రామిక ప్రాంత సీఐటీయూ కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్ ఆవేదన వ్యక్తంచేశారు. బాలానగర్ పారిశ్రామిక ప్రాంతంలోనీ పోస్టాఫీస్ గల్లీ వీర్ కెమికల్ కంపెనీ ముందు డ్రైనేజీ లీకేజీల వల్ల గత 5 నెలలుగా రోడ్డుపై మురుగు నీరు ప్రవహిస్తుండడంతో రాకపోకలు సాగించే ప్రజలు, కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. గత 5 నెలలుగా మురుగు సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నా సంబంధిత అధికారులు తమకు ఏమీపట్టనట్లు సంబంధిత అధికారులు, సిబ్బంది నిమ్మకు నీరుచందంగా వ్యవహరిస్తున్నారని రాజశేఖర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి రోజు అనేక మంది కార్మికులు అదే రహదారిపై నుండి వందలాది కార్మికులు కంపెనీల్లోకి వెళ్తుంటారని, అటూ వైపున వెళ్ళాలంటే ముక్కు మూసుకుని వెళ్లే పరిస్థితి నెలకొందని, వెంటనే సంబంధిత అధికారులు సమస్యను పరిష్కారించాలని, లేదంటే కార్మికులను ఐక్యం చేసి సంబంధిత కారాయలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సాయి ప్రసాద్, ప్రసాద్, సాంబశివ, భాస్కర్ రెడ్డి, మంగ, రాణి, రత్న, పుష్ప, జాఫర్ పాల్గొన్నారు.

కౌన్సిలర్ కొడే మహేష్ నూతన సంత్సర శుభాకంక్షలు



నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ మున్సిపాలిటీ, మండల, ప్రజలు, ప్రజా ప్రతినిధులకు, అధికారులకు, ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు కౌన్సిలర్ కొడే మహేష్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ కొడే మహేష్ కురుమ మాట్లాడుతూ నూతన సంవత్సరంలో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆ భగవంతున్ని వేడ్డుకునట్లు తెలియజేశారు.

2022లో 5వేలకు పైగా డ్రైవింగ్ లెసెన్స్‌ల రద్దు

- 2021లో 2599 లైసెన్స్‌లు క్యాన్సిల్
- రోడ్లపై ప్రతిఒక్కరూ జాగ్రత్తగా డ్రైవింగ్ చేయాలి

జేటీసీ పాండురంగ నాయక్



నవతెలంగాణ-సిటీబ్యూరో

గ్రేటర్ పరిధిలో ఏటేటా పెరుగుతున్న రోడ్డు ప్రమాదాల కట్టడికి పోలీస్, రవాణాశాఖలు కఠినంగా వ్యవహరిస్తున్నాయి. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తున్న వాహనదారుల డ్రైవింగ్ లైసెన్స్‌లు రద్దుకు రవాణా శాఖకు సిఫార్సు చేస్తోన్న విషయం తెలిసిందే. నగరంలోని ఆర్టీఏ పరిధిలో గతేడాది(2022) 5,819 డ్రైవింగ్ లైసెన్స్‌లు సస్పెండ్ చేసినట్టు హైదరాబాద్ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్(జేటీసీ) పాండురంగ నాయక్ తెలిపారు. అంతకుముందు ఏడాది (2021)తో పోలిస్తే ఇది 3,220 అధికమని ఆయన చెప్పారు. మొత్తంగా రెండేండ్లలో దాదాపు 8,418 మంది డ్రైవింగ్ లైసెన్స్‌లు రద్దు చేసినట్టు తెలిపారు. హైదరాబాద్ పరిధిలో ఖైరతాబాద్, తిరుమలగిరి, మలక్‌పేట, మెహిదీపట్నం, బండ్లగూడలో ఆర్టీఏ కార్యాలయాలు ఉండగా.. గతేడాదిలో అన్ని జోన్లలో భారీగా లైసెన్స్‌లు సస్పెండ్ చేశారు. డ్రంకన్ డ్రైవ్‌లో నిర్దిష్ట సమయంలో రెండు , లేదా మూడుసార్లు పట్టుబడితే డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేయాలని రవాణాశాఖకు పోలీస్ శాఖ సిఫార్సు చేస్తుంది. దీంతో పాటు ప్రమాదాలు, ర్యాష్ డ్రైవింగ్ చేసినా లైసెన్స్ రద్దు చేస్తామని జేటీసీ తెలిపారు. ఎంవీ యాక్ట్ ఉల్లంఘించినా క్రైమ్ చర్యలకు పాల్పడినా లైసెన్స్ క్యాన్సిల్ చేస్తామని, కాబట్టి ప్రతిఒక్కరూ జాగ్రత్తగా డ్రైవింగ్ చేయాలని నగర ప్రజలకు ఆయన సూచించారు.

2023 నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

శ్రీ గాయత్రి బ్రహ్మ సేవా సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన 2023 నూతన సంవత్సర క్యాలెండర్‌ని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ఆవిష్కరించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బ్రాహ్మణులకు అన్ని విధాల ఆదుకుంటుందని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద పేర్కొన్నారు. శ్రీ గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం 2023 నూతన క్యాలెండర్ ఎమ్మెల్యే తన నివాసంలోని శనివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో శ్రీ గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షులు గోగులపాటి కృష్ణమోహన్, సలహాదారులు సర్వేపల్లి రమేష్ కుమార్, ప్రధాన కార్యదర్శి నిట్టల వెంకట సుబ్రహ్మణ్యం, కోశాధికారి సంజీవరావు, ఉపాధ్యక్షులు శ్రీరామ శర్మ చక్రధారి, గడ్డం రాంబాబు, సంఘం నాయకులు రాచపూడి ప్రభాకర్ శర్మ, నాగమోహన్, సాయిరాం, గంగాధర శర్మ, కోటేశ్వర శాస్త్రి, రంగారావు ,సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE ADDITIONAL CHIEF JUDGE, CITY SMALL CAUSE COURT, AT : HYDERABAD
E.P. No: 22 OF 2022
IN
SC. NO. 123 OF 2010

Between :
M/s Kapil Chit Funds Pvt. Ltd.
SECUNDERABAD BRANCH, TT02G-21
....Decree Holder
AND
Mr. P.Chinna Kondaiah & Others
... Judgement-Debtors

To,
JDR-2. Swarna Prem Kumar Abel, S/o. Swarna Gnanaiah, aged 42 yrs, Occ: School Asst. (English), Z.P.H.S. Raipole, Ibrahimpatnam, R R Dist., R/o. H.No. 1-49/24/6A, Surya Nagar Colony, Uppal, Hyderabad.

Whereas the above named Decree Holder has instituted a Execution Petition against you for recovery of money of Rs.7,135/- You are hereby summoned to appear in the above court in person or by an advocate duly instructed on the 06-01-2023 at 10.30. AM failing which the matter will be decided exparte in accordance with law.

By order of the court.
J.SRINIVAS REDDY
C.SHOBA RANI
Advocate
HYDERABAD.

మహారాజశ్రీ మొదటి అదనపు జిల్లా మరియు సెషన్స్ జడ్జి భోనగిరి జిల్లా
ఇ.పి.నెం: 291 ఆఫ్ 2022

బిట్వీన్ :
పొద్దుటూరి విశాల్ రెడ్డి
........డిక్రీ హోల్డర్
మరియు
గద్దమీద సాయిబాబా .....జడ్జిమెంట్

<u>నోటీసు</u>

టు,
గద్దమీద సాయిబాబా,తండ్రి అగయ్య వయస్సు 61 సం॥లు,వృత్తి:వ్యాపారము, నివాసము: ఇ.నం: 11-2-473/4,ఉప్పర బస్తి, నామాలగుండు సికింద్రాబాద్

పై కోర్టులో పైన తెలిపిన డిక్రీ హోల్డర్ గారు, తనపేరున, ఇ.పి. షెడ్యూల్ భూమిని,రిజిస్ట్రేషన్ చేయాలని, జడ్జిమెంట్ డెట్టార్ పై ఇ.పి.నెం: 291 ఆఫ్ 2022 దావాను వేయడం జరిగినది. జడ్జి దావాలో జడ్జిమెంట్ డెట్టార్ కు ఎలాంటి అభ్యంతరాలు ఉన్నచో , పూర్వకముగా, ఋజువు పత్రములతో తేది: 11-01-2023 రోజున ఉదయం 10.30 గంటలకు పై కోర్టులో వ్యక్తిగతంగా కానీ, లేదా తన న్యాయవాది ద్వారా కాని హాజరు అయి, తమరి వాదనను తెలియపర్చవలెనని గౌరవ కోర్టు వారు ఆదేశాలు జారీచేసినారు. ఒకవేళ హాజరు కానిచో, జడ్జిమెంట్ డెట్టార్ కూ ఎలాంటి ఆక్షేపణలు, అభ్యంతరాలు లేవని తలచి, జడ్జిమెంట్ డెట్టార్ కూ పరోక్షముగా దావా తీర్మానించబడుతుంది.

(ఈ నోటీసు కోర్ట్ వారి ఆదేశానుసారముగా జారి చేయడమైనది)

వి. శశిధర్ రెడ్డి
న్యాయవాది హైదరాబాద్
ఇ.నం. 3-9-47/A /4, శారద నగర్
రామంతాపూర్, అంబర్ పేట్
హైదరాబాద్,మొబైల్ నెం: 9966110604

IN THE COURT OF THE HON'BLE XI ADDL CHIEF JUDGE CITY CIVIL COURT, AT : HYDERABAD
MVOP NO 2879 OF 2018

Between:
Indranil Dhar ..Petitioner
And
Ola Fleet Technologies Pvt. Ltd & Others ...Respondents

To.
1). Ola Fleet Technologies Pvt Ltd.
Rep By Keshaw Sinha. Age: Major, Occ. Bussiness, R/o H No 9-1-76 to 77 1/2 1 st floor, sarojini Devi Road, Secunderabad-500003. (Respondent No.1)
2). Vikram, S/o. Ramanand Singhg.
Age 25 years, Occ Driver, R/o H.No 5-5-156/128 Mallikarjuna Nagar, Chintala kunta, saroornagar,Ranga Reddy-500074 (Respondent No 3)

Take this Notice that the petitioner herein has filed the above MVOP against you and another respondent by claming compensation before above mentioned court Hence the above MVOP is posted for your appearance and counter, if you fail to appear before the above mentioned court on 04-01-2023 by 10:30 a.m., the matter will be decided in your absence

(By Order of the Court)
PUTTA THIRUPATHI REDDY
MA(Eco). LLM(Con)
ADVOCATE
Flat No. 1, Ravi Residency Apartment, H.No: 13-4-48/F/1,Opp: Central Bank of India, Left side of Rajadhani, Theater, Vikas Nagar, Dilsukh Nagar, Hyderabad. Telangana-500060Phone: 9440687160

IN THE COURT OF THE PRL. DISTRICT JUDGE AT: BHONGIR
I.A.NO. 382 OF 2022
IN
O.S.NO.5 OF 2015

Between:
Kadagatla Muthyam Reddy
.....Petitioner/Plaintiff
AND
Kadagatia Kamalamma & others
.....Respondents/Defendants No. 1 to 3
AND
Kandagatla Umarani and Others,
.....Proposed Respondents/Defendants No.4 to 6

To
(D-6) Kandhakatla @ Kadagatla Kalpana, W/o. Sravan Kumar Reddy, aged 33 years, Occ: Housewife, R/o. Kaithapuram Village, Koyyalagudem post, Choutuppal Mandal, Yadadri-Bhongir District, Presently residing Ho.No.4-7-213/1, Padmavathi Colony, Hayath Nagar, Ranga Reddy district.

NOTICE

Please take notice that the above named plaintiff has filed the above Suit against you and others for partition and separate possession, in respect of suit schedule properties and you the above named made as proposed party to the suit in the above I.A.No.382/2022 and the above case is posted on 06-01-2023, for your appearance before the Hon'ble court, if you are not appeared either in person or through your advocate on the said day i.e. on 06-01-2023, 10-30 A.M. before the Hon'ble court, you will be set ex-parte and the matter will be decided by the Hon'ble court.

"BY ORDERS OF THE HON'BLE COURT "
PAILLA. LINGA REDDY
Advocate, Bhongir,
Cell: 9848026024
Tel: (08685) 243400.
Bhongir,Date: 31-12-2022.

IN THE COURT OF THE HON'BLE VIII ADDL DISTRICT JUDGE, RR DISTRICT, AT: LB NAGAR
IA NO. 108 OF 2022
IN
LGOP NO. 794 OF 2016
(old No L.G.C No: 30 OF 2013)

Between:
Mohd. Jamaluddin and others
.......Petitioners/Applicants
AND
Syed Shudath Ali and others
......Respondents/Respondents

To,
Respondent no 16 Mohd. Naseeruddin S/o. Mohd. QumaruddinAged about: 50 years, Occ: Govt Service,R/o. 10-5-391/51, First Lancer, Syed Nagar, Hyderabad.
Respondent no 17 Syed Shijath Ali S/o. Syed Ghulam Ali Aged about: 39 years, Occ: Business, R/o. 9-4-87/73, Tolichowki, Hyderabad.

Take notice that Mohd. Jamaluddin and his brothers have filed the above interlocutory application seeking a relief of impleading of Mr. Ilyas Ahmed S/o Ahmed Khaja, Aged About 35 Years, Occ: Private Employee, R/o H. No 9-10-68/1/A/438, 18 Steps, Rasham Bagh, Golconda Fort, Hyderabad, Telangana State, in respect of Plot no 21, H No. 1-79, in Sy No. 70, admeasuring 100 Sq.Yards situated at Neknampur Village and Gram panchayat, Gandipet Mandal, RR District, in the main LGOP No 794 of 2016, and that you (the Respondents No 16 and 17) are hereby Noticed to appear in the court in person or by a pleader duly instructed, and able to answer all material questions relating to the application on 06-01-2023 at 10-30 A.M and to state whether you contest or do not contest the claim, and if you contest, to receive directions of court as to the date on which you have to file the counter, the date of hearing and other matters. Take further notice, that in the event of the claim not being contested the above application shall be decided at once.
Take further notice that in default of your appearance on the day and hour before mentioned the above said petition will be heard and determined in your absence.

(By order of the Court)
Pinnu Nagaraju
Advocate,
H.No.1-9-323/3, Vidyanagar,
Hyderabad-500 044.
Ph.No. 9848194109.

IN THE COURT OF THE HON'BLE VIII ADDL DISTRICT JUDGE, RR DISTRICT, AT: LB NAGAR
IA NO. 238 OF 2020
IN
LGOP NO. 794 OF 2016
(old No L.G.C No: 30 OF 2013)

Between:
Mohd. Jamaluddin and others
.... Petitioners/Applicants
AND
Syed Shudath Ali and others
......Respondents/Respondents

To,
Respondent no 16 Mohd. Naseeruddin S/o. Mohd. Qumaruddin Aged about: 50 years, Occ: Govt Service,R/o. 10-5-391/51, First Lancer, Syed Nagar, Hyderabad.
Respondent no 17 Syed Shijath Ali S/o. Syed Ghulam Ali Aged about: 39 years, Occ: Business, R/o. 9-4-87/73, Tolichowki, Hyderabad.

Take notice that Mohd. Jamaluddin and his brothers have filed the above interlocutory application seeking a relief of impleading of Shaheen Begum W/o Mohammad Khaleel, aged about 33 years, Occupation: House Wife, R/o H No 19-1-1097/1/13, at Bandlaguda, Doodbowli, Hyderabad, Telangana State, in respect of H No. 2-154/2, in Sy No. 70, admeasuring 70 Sq. Yards situated at Neknampur Village and Gram panchayat, Gandipet Mandal, RR District, in the main LGOP No 794 of 2016, and that you (the Respondents No16 and 17) are hereby Noticed to appear in the court in person or by a pleader duly instructed, and able to answer all material questions relating to the application on 06-01-2023 at 10-30 A.M and to state whether you contest or do not contest the claim, and if you contest, to receive directions of court as to the date on which you have to file the counter, the date of hearing and other matters.
Take further notice, that in the event of the claim not being contested the above application shall be decided at once.
Take further notice that in default of your appearance on the day and hour before mentioned the above said petition will be heard and determined in your absence.

(By order of the Court)
Pinnu Nagaraju
Advocate,
H.No.1-9-323/3, Vidyanagar,
Hyderabad-500 044.
Ph.No. 9848194109.

IN THE COURT OF THE HON'BLE PRL. DISTRICT JUDGE AT: BHONGIR
I.A.NO. 674 OF 2022
IN
O.S.NO. 96 OF 2015

Between:
Yedapally Rajamma @ Erpula Eshwaramma,
... Petitioner/Plaintiff
AND
Donthi Yellamma & others
.....Respondents/ Defendants No. 1 to 7
AND
Thuniki Ilamma and others
.....Proposed Respondents/Defendants No.8 to 161.

To
1. (D-8) Thuniki Ilamma, W/o. Isthari, aged about 62 years, Occ: Agriculture, R/o. H.No.1-12, Pembarthi Village, Janagaon Mandal and district.
2. (D-11) Chala Venkateshwar Rao, S/o. Narayana, aged about 52 years, Occ:Business, R/o. H.No.1-6-717, Mushirabad, Hyderabad.
3. (D-12) Soma Madhusudhan, S/o. Pandu Rangam, aged about 55 years, Occ:Business, R/o. H.No.11-3-266/47, Shabadguda, Warasiguda, Secunderabad.
4. (D-13) Thota Sudha Rani, W/o. Venkatesh, aged about 41 years, Occ: House wife, R/o. H.No.4-95/1, Prashanthnagar, Hyderabad.
5. (D-14) Pokala Buchi Narsimha Rao, S/o. Mallaiah, aged about 67 years, Occ:Business, R/o. H.No.A/23, Municipal H.No.6-7-241, Bansilalpet,Secunderabad.
6. (D-15) Gantaram Swathi Kiran, W/o. Gantaram Santhosh Kumar, aged about 37 years, Occ: Employee, R/o. H.No.4-8-193, Kumarpally, Hanmakonda, Warangal District - 506001.
7. (D-16) Gantaram Archana, W/o. Gantaram Sathish Chandra, aged about 42 years, Occ: Home maker, R/o. H.No.2-2-1074/5, Flat No.527, Alekhya Radha Sadan, 6 No. Road, Amberpet, Hyderabad, Telangana State-500013.

NOTICE

Please take notice, that the above named plaintiff has filed the above Suit against you and others for partition and separate possession, in respect of suit schedule properties and you the above named made as proposed party to the suit in the above I.A.No.674/2022 and the above case is posted on 09-01-2023, for your appearance before the Hon'ble court, if you are not appeared either in person or through your advocate on the said day i.e. on 09-01-2023, 10-30 A.M. before the Hon'ble court, you will be set ex-parte and the matter will be decided by the Hon'ble court.

"BY ORDERS OF THE HON'BLE COURT "
PAILLA. LINGA REDDY
Advocate, Bhongir,
Cell: 9848026024
Tel: (08685) 243400.
Bhongir,Date: 31-12-2022.

IN THE COURT OF THE HON'BLE PRL. DISTRICT JUDGE AT: BHONGIR
I.A.NO. 673 OF 2022
IN
O.S.NO.IN 96 OF 2015

Between:
Yedapally Rajamma @ Erpula Eshwaramma,
.....Petitioner/Plaintiff
AND
Donthi Yellamma & others
.....Respondents/ Defendants 1 to 7
AND
Thuniki Ilamma and others,
.....Proposed Respondents/Defendants No.8 to 16

To
1. (D-8) Thuniki Ilamma, W/o. Isthari, aged about 62 years, Occ: Agriculture, R/0. H.No.1-12, Pembarthi Village, Janagaon Mandal and district.
2. (D-11) Chala Venkateshwar Rao, S/o. Narayana, aged about 52 years, Occ:Business, R/o. H.No.1-6-717, Mushirabad, Hyderabad.
3. (D-12) Soma Madhusudhan, S/o. Pandu Rangam, aged about 55 years, Occ:Business, R/o. H.No.11-3-266/47, Shabadguda,Warasiguda, Secunderabad.
4.(D-13) Thota Sudha Rani, W/o. Venkatesh, aged about 41 years, Occ: House wife, R/o. H.No.4-95/1, Prashanthnagar, Hyderabad.
5. (D-14) Pokala Buchi Narsimha Rao, S/o. Mallaiah, aged about 67 years, Occ:Business, R/o. H.No.A/23, Municipal H.No.6-7-241, Bansilalpet, Secunderabad.
6. (D-15) Gantaram Swathi Kiran, W/o. Gantaram Santhosh Kumar, aged about 37 years, Occ: Employee, R/o. H.No.4-8-193, Kumarpally, Hanmakonda, Warangal District-506001.
7.(D-16) Gantaram Archana, W/o. Gantaram Sathish Chandra, aged about 42 years, Occ: Home maker, R/o. H.No.2-2-1074/5, Flat No.527, Alekhya Radha Sadan, 6 No. Road, Amberpet, Hyderabad, Telangana State-500013.

NOTICE

Please take notice, that the above named plaintiff has filed the above Suit against you and others for partition and separate possession, in respect of suit schedule properties and you the above named made as proposed party to the suit in the above I.A.No.673/2022 and the above case is posted on 09-01-2023, for your appearance before the Hon'ble court, if you are not appeared either in person or through your advocate on the said day i.e. on 09-01-2023, 10-30 A.M. before the Hon'ble court, you will be set ex-parte and the matter will be decided by the Hon'ble court.

"BY ORDERS OF THE HON'BLE COURT "
PAILLA. LINGA REDDY
Advocate, Bhongir,
Cell: 9848026024
Tel: (08685) 243400.
Bhongir,Date: 31-12-2022.

IN THE COURT OF THE HON'BLE VIII ADDL DISTRICT JUDGE, RR DISTRICT, AT: LB NAGAR
LGOP NO. 794 OF 2016
(old No L.G.C No: 30 OF 2013)

Between:
Mohd. Jamaluddin and others
.... Applicants
AND
Syed Shudath Ali and others
......Respondents

To,
Respondent no 16 Mohd. Naseeruddin S/o. Mohd. Qumaruddin Aged about: 50 years, Occ: Govt Service, R/o. 10-5-391/51, First Lancer, Syed Nagar, Hyderabad.
Respondent no 17 Syed Shijath Ali S/o. Syed Ghulam Ali Aged about: 39 years, Occ: Business, R/o. 9-4-87/73, Tolichowki, Hyderabad.

Take notice that Mohd. Jamaluddin and his family members have filed the above application seeking a relief of declaring the Respondents as Land Grabbers and other consequential reliefs against you the respondents, in respect of the lands in Sy No. 70, admeasuring Acres 01.01 Guntas situated at Neknampur Village and Gram panchayat, Gandipet Mandal, RR District, and that you (the Respondents No 16 and 17) are hereby Noticed to appear in the court in person or by a pleader duly instructed, and able to answer all material questions relating to the application on 06-01-2023 at 10-30 A.M and to state whether you contest or do not contest the claim, and if you contest, to receive directions of court as to the date on which you have to file the counter, the date of hearing and other matters.
Take further notice, that in the event of the claim not being contested the above application shall be decided at once.
Take further notice that in default of your appearance on the day and hour before mentioned the above said petition will be heard and determined in your absence.

(By order of the Court)
Pinnu Nagaraju
Advocate,
H.No.1-9-323/3, Vidyanagar,
Hyderabad-500 044.
Ph.No. 9848194109.

BEFORE THE ADMINISTRATOR GENERAL-STATE SUCCESSION COURT(For the States of TELANGANA)(Testamentary & Intestate Jurisdiction)
AT HIGH COURT, HYDERABAD (DISTRICT JUDGE CADRE)
CA.NO. 64 OF 2022

Between:
1.Valluri Satya Hanumantha Viswam S/o V.Venkatswarlu,
2.Valliri Venkatswarlu S/o late Valluri Hanumantha Rao, Both are residing at R/o 3-4-1005/4,Sarojini Devi residency,
5 th Floor,Flat No 503,Barkathpura, Hyderabad-500027 . ..Applicants
AND
The Tahsildar,Amberpet,Hyderabad or all concerned. ... Respondents

NOTICE

The above named Petitioner /Petitioners have filed the above C.A. for grant of Succession Certificate/ Letter of Administration U/s.29 of the Administrator General Act, 1963 for an Transfer Title of old apartment Schedule given below standing in the name of the deceased Smt Valluri Lakshmi Naga Samatha Kamani to be effected by the 1st Respondents. The said C.A. stands posted on 03.02.2022 11.00 A.M. if anybody have got any objection for grant of the above relief in favour of the said Petitioner/Petitioners they may file their objections before the under signed on the said date. Otherwise the matter will be heard and decided as per the Rules.

SCHEDULE PROPERTY

All That Flat bearing No 506,on fifth floor in premises No.2-2-647/188 on PlotNo.145,146 & 146/B,At Central Excise Colony,Bagh Amberpet Hyderabad.NORTH :Open to Sky,SOUTH :Corridor,EAST : Open to Sky,WEST:Flat No :505

By Order of the Administrator General Court
PONAKA RAHUL REDDY
ADVOCATE
F 501 Bhaskara Signature ApartmentModel colony S R nagar
Hyderabad-500038
Cell:8328292320

బుల్డోజర్ రాజకీయం



యూపీ నుంచి ఎంపీ దాకా అరాచకత్వం
రెచ్చిపోయిన బీజేపీ ప్రభుత్వాలు
అణగారిన వర్గాల ప్రజల ఇండ్లు, నిర్మాణాలు కూల్చివేత

న్యూఢిల్లీ : దేశంలో అణగారిన వర్గాల ప్రజలపై బీజేపీ బుల్డోజర్ రాజకీయాలు పీడకలలను మిగిల్చాయి. ఆక్రమణల పేరుతో కేవలం ఒక వర్గం వారినే లక్ష్యంగా చేసుకుంటూ ఈ రాజకీయాలు సాగాయి. ఈ ఏడాదిలో (2022లో) యూపీలో రెండో సారి అధికారంలోకి వచ్చిన తర్వాత అక్కడి యోగి ప్రభుత్వం రెచ్చిపోయింది. బుల్డోజర్లతో అక్రమ నిర్మాణాలుగా చెప్పబడిన ఇండ్లను నిర్దాక్షిణ్యంగా కూల్చివేసింది. కనీసం ఒక నిర్దిష్ట ప్రక్రియను పాటించకుండా నియంతృత్వంగా వ్యవహరించింది. గొడవలు జరిగాయని తెలిసిన వెంటనే.. అక్కడికి బుల్డోజర్లు దిగడం.. ఒక వర్గం వారిని లక్ష్యంగా చేసుకుంటూ వారి ఇండ్లను కూలగొట్టడం వంటివి యోగి సర్కారు చేసింది. బాధితులకు అండగా నిలిచి ప్రభుత్వాన్ని నిలదీయాల్సిన ప్రతిపక్షాలు పూర్తిగా విఫలమయ్యాయి. అడ్డూ, అదుపు లేకపోవడంతో యోగి ప్రభుత్వం తన నిజస్వరూపాన్ని మరింతగా బయటపెట్టి కఠినంగా వ్యవహరించింది. యోగి సర్కారు బుల్డోజర్ రాజకీయం ఇతర రాష్ట్రాలకూ పాకింది. ఢిల్లీ మునిసిపల్ కార్పొరేషన్, మధ్యప్రదేశ్, గుజరాత్, అసోం, బీహార్ వంటి రాష్ట్రాలూ బుల్డోజర్లను అమాయకపు ప్రజల ఇండ్లపై ప్రయోగించాయి.

ఢిల్లీ : ఈ ఏడాది ఏప్రిల్ 20న అధికారులు జహంగీర్‌పురిలోని మసీదు ద్వారం కూల్చారు అక్కడి మునిసిపల్ అధికారులు. అదే నెల 16న హనుమాన్ జయంతి సందర్భంగా బజరంగ్‌దళ్ సభ్యులు ఊరేగింపు వెళు న్న సందర్భంగా వారు ముస్లింలతో ఘర్షణకు దిగారు. అయితే, కోర్టు ఆదేశాలున్నప్పటికీ.. అదేమీ పట్టించుకోని అక్కడి మునిసిపల్ యంత్రాంగం (బీజేపీ నేతృత్వంలోని) మసీదు గేటును కూల్చివేసింది. జులై 6న ఢిల్లీ డెవలప్‌మెంట్ అథారిటీ (డీడీఏ) న్యూఢిల్లీలోని నిజాముద్దీన్ ఈస్ట్‌లోని సరాయ్ కాలే ఖాన్ ఎదురుగా ఉన్న గయాస్‌పూర్ బస్తీలో 60కి పైగా అద్దెదారులపై బుల్డోజర్‌ను ప్రయోగించింది. అలాగే, అంగన్వాడీలను కూడా కూల్చేసింది. కానీ, ఒక గోశాలను మాత్రం కనీసం ముట్టుకోకపోవడం గమనార్హం.

యూపీ : ఈ ఏడాది మార్చి 21న ఇద్దరు లైంగికదాడి నిందితులు అమీర్, ఆసిఫ్ ల ఇంటికి బుల్డోజర్‌ను తీసుకొచ్చి వారిని లొంగిపోయేలా బలవంతం చేసింది అక్కడి ప్రభుత్వం. ఈ క్రమంలో నిందితులు ఇండ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఈ విషయాన్ని యూపీ పోలీసులు కోర్టులో కూడా అంగీకరించడం గమనార్హం. ఏప్రిల్ 13న రాంపూర్ జిల్లా పోలీసులు హత్య నిందితుడి ఇంటిని కూల్చివేయడంపై విచారణకు ఆదేశించారు. సహరాన్‌పూర్‌లో ఇద్దరు నిందితులు అబ్దుల్ వాకీర్, ముజమ్మిల్‌ల ఆస్తులను కూల్చినట్టు ఎస్ఎస్పీ ఆకాశ్ తోమర్ అంగీకరించారు. జూన్ 13న ప్రయాగ్‌రాజ్ డెవలప్‌మెంట్ అథారిటీ జావేద్ మొహమ్మద్ (అలియాస్ జావేద్ పంప్) ఇంటిని కూల్చేసింది. డిసెంబర్ 10న జైషే మహ్మద్ కమాండర్‌గా భావిస్తున్న ఆషిక్ నెంగ్రూ ఇంటిని కూల్చివేశారు.

మధ్యప్రదేశ్ : ఏప్రిల్ 10న ఎంపీలోని ఖర్గోన్‌లో రామనవమి సందర్భంగా రాళ్లదాడి జరిగింది. ఇందులో దాదాపు 80 మందిని అక్కడి ప్రభుత్వ అరెస్టు చేసింది. అయితే, హింసాకాండకు పాల్పడిన వారి 45 ఇండ్లను కూల్చివేశారని ఇండోర్ డివిజనల్ కమిషనర్ పవన్ శర్మ వెల్లడించడం గమనార్హం. అలాగే, షియోపూర్‌లో సామూహిక లైంగికదాడి కేసులో నిందితులుగా ఉన్న ముగ్గురు మైనారిటీ వర్గానికి చెందిన వారి ఇండ్లను శివరాజ్‌సింగ్ చౌహాన్ సర్కారు కూల్చివేసింది. పోలీసుల సమక్షంలోనే వారి ఇండ్లు బుల్డోజర్లతో నేలమట్టం కావడం గమనార్హం. మొరెనా జిల్లాలోని బాన్‌మోర్ పట్టణంలో లైంగికదాడి నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న గిర్రాజ్ రజాక్ అనే రోజువారీ కూలీ ఇంటిని 'అక్రమ నిర్మాణం'గా పేర్కొంటూ రాష్ట్ర ప్రభుత్వం కూల్చివేసింది.

గుజరాత్ : ఏప్రిల్ 10న ఆనందద్ జిల్లాలోని ఖంబత్ పట్టణంలో రామ్‌నవమి ఊరేగింపు సందర్భంగా రాళ్లు రువ్విన ఆరోపణలు వచ్చాయి. అనంతరం ఆ జిల్లా కలెక్టర్.. ప్రభుత్వ భూమిలో ఉన్న అక్రమ కట్టడాలను కూల్చివేయాలని ఆదేశించారు. వీటిలో చాలా వరకు ఘర్షణల్లో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఒక వర్గానికి చెందినవారివే కావడం గమనార్హం. ఏప్రిల్ 21న సూరత్ మునిసిపల్ కార్పొరేషన్ పోలీసులతో కలిసి గ్యాంగ్‌స్టర్ సోదరులు ఆరిఫ్, సజ్జు కొఠారీకి చెందిన ఆస్తులను కూల్చేసింది. అక్టోబరులో బెట్ ద్వారకా ద్వీపంలో సుమారు 10వేల మంది జనాభా ఉన్న 100 నిర్మాణాలు కూల్చివేయబడ్డాయి. వీటిలో ఎక్కువ భాగం మైనారిటీ సామాజికవర్గానికి చెందినవారివే కావడం గమనార్హం. నవంబర్‌లో, కచ్ జిల్లాలోని జఖౌ హార్బర్‌లో 300 ఇండ్లు, గుడిసెలు, గోడౌన్‌లు అక్రమంగా ఉన్నాయని భావించి కూల్చేశారు. దీంతో మత్స్యకారులు, చిరు వ్యాపారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు.

అసోం: మే 21న అసోంలోని నాగోన్ జిల్లాలోని ఎనిమిది ఇండ్లను అక్కడి అధికారులు కూల్చేశారు. జంతు హక్కుల కార్యకర్త వినీత్ బగారియా ఆత్మహత్య కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న బైదుల్లా ఖాన్ నివాసాన్ని జులై 12న దిబ్రూఘర్ జిల్లా యంత్రాంగం కూల్చివేసింది. అదేనెలలో, కరీంగంజ్‌లోని ముస్లిం ప్రాబల్యం ఉన్న ప్రాంతంలో 90 ఇండ్లు ఆక్రమణల వ్యతిరేక డ్రైవ్‌లో నేలమట్టమయ్యాయి. అయితే, తమ వద్ద భూమికి సంబంధించిన పత్రాలు న్నాయని బాధితులు వెల్లడించడం కొసమె రుపు. సెప్టెంబరులో 100 మెగావాట్ల సోలార్ ప్లాంట్ ఏర్పాటు కోసం బోర్కొల్లా నియోజకవర్గ పరిధిలో ప్రభుత్వ భూమిలో నివసిస్తున్నారని పేర్కొంటూ 299 కుటుంబాలను అక్కడి నుండి ఖాళీ చేయించారు. వీరిలో 243 మంది మైనారిటీ వర్గాలకు చెందిన కుటుంబాలే కావడం గమనార్హం.

బీహార్ : బీజేపీతో జేడీ(యూ) కొనసాగించిన సంకీర్ణ ప్రభుత్వంలోనూ బుల్డోజర్ రాజకీయాలు సాగాయి. ఏప్రిల్‌లో బీహార్ రెవెన్యూ మంత్రి రామ్ సూరత్ రాయ్ (బీజేపీ) పరారీలో ఉన్న నేరస్థులు, రాష్ట్ర ప్రభుత్వ భూమిని ఆక్రమించే వారిపై బుల్డోజర్ డ్రైవ్‌ను ప్రారంభిస్తామని హెచ్చరించారు. అయితే, ఆయన ప్రకటనను సీనియర్ జేడీ(యూ) నాయకుడు ఉపేంద్ర కుష్వాహా వ్యతిరేకించడం గమనార్హం. అయినప్పటికీ కొన్ని చోట్ల బీజేపీ మంత్రుల ఒత్తిళ్లతో నిర్మాణాల కూల్చివేతలు జరిగాయి. అయితే, ఇలాంటి విషయాల్లో పాట్నా హైకోర్టు అధికారుల తీరునే తప్పుబట్టడం గమనార్హం.

రిషభ్ పంత్‌కు చిన్నపాటి ప్లాస్టిక్ సర్జరీ

న్యూఢిల్లీ : రోడ్డు ప్రమాదానికి గురై డెహ్రాడూన్‌లో చికిత్స పొందుతున్న టీమ్‌ఇండియా యువ క్రికెటర్ రిషభ్ పంత్‌కు చిన్నపాటి ప్లాస్టిక్ సర్జరీ జరిగినట్లు ఢిల్లీ క్రికెట్ అసోసియేషన్ డైరెక్టర్ శ్యామ్ తెలిపారు. ముఖం మీద అయిన గాయాలకు డెహ్రాడూన్‌లోని మ్యాక్స్ ఆసుపత్రిలో ఈ సర్జరీ చేసినట్టు పేర్కొన్నారు. తొలుత ఢిల్లీకి ఎయిర్ అంబులెన్స్ ద్వారా తరలించాలని భావించినప్పటికీ.. మ్యాక్స్‌లోనే శస్త్రచికిత్సను నిర్వహించారు. ఈ మేరకు శ్యామ్ శర్మ పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

బస్సు డ్రైవర్, కండక్టర్‌కు ప్రశంసలు

వికెట్ కీపర్ రిషభ్ పంత్ రోడ్డు ప్రమాదం నుంచి ప్రాణాలతో క్షేమంగా బయటపడడానికి సాయపడిన బస్సు డ్రైవర్ సుశీల్, కండక్టర్ పరమ్ జీత్ కు హర్యానా రోడ్ వేస్ అధికారులు ప్రశంసా పత్రాలు, షీల్డ్‌ను బహూకరించి, వారిని అభినందించారు. మానవత్వానికి వీరు (డ్రైవర్, కండక్టర్) నిదర్శనమని హర్యానా రాష్ట్ర రవాణా మంత్రి మూల్ చంద్ శర్మ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సైతం వీరిని ప్రశంసించింది.

ఐద్వా జాతీయ మహాసభలను జయప్రదం చేయండి

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి

- హైదరాబాద్‌లో కాగడాల ప్రదర్శన



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

జనవరి మూడు నుంచి తొమ్మిది వరకు కేరళలోని త్రివేండ్రంలో జరగనున్న అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి పిలుపునిచ్చారు. ఐద్వా ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌లోని ఆ సంఘం రాష్ట్ర కార్యాలయం ఐలమ్మ భవనం నుంచి బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య పార్క్ వరకు కాగడాలతో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లు లక్ష్మి మాట్లాడుతూ మూడేండ్లకోసారి ఐద్వా చేసిన కృషిని సమీక్షించుకుని భవిష్యత్ కార్యాచరణను రూపొందించుకోవడానికి మహాసభలు జరుగుతాయని చెప్పారు. ఈ మూడేండ్లలో అనేక ఒడిదుడుకులు ఎదుర్కొని సంఘం పనిచేసిందన్నారు. సమాజంలో ఎక్కువమంది మొత్తం కోవిడ్-19 బారిన పడి అనేక అవస్థలు పడ్డారని అన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలు, ధరల పెరుగుదల, మహిళలపై పెరిగిన దాడులు వంటి అంశాలపై మహాసభల్లో చర్చిస్తామని వివరించారు. ఇంకోవైపు మోడీ ప్రభుత్వం దోషులకు అండగా నిలబడడం ప్రమాదకర సంకేతమని చెప్పారు. కోవిడ్ విపత్కర పరిస్థితుల్లోనూ ఐద్వా మహిళ పక్షాన, ప్రజలకు అండగా నిలబడి పోరాడిందని గుర్తు చేశారు. ప్రజాపంపిణీ వ్యవస్థ కోసం, అధిక ధరలకు వ్యతిరేకంగా ఉద్యమాలు చేశామన్నారు. మహిళలపై దాడులు జరిగిన సందర్భాల్లో బాధితుల పక్షాన నిలబడి పోరాడి విజయాలు సాధించామని అన్నారు. రాబోయే మూడేండ్ల కాలంలో స్త్రీలకు ఉపాధి కోసం ప్రయివేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా విద్యావైద్యం పేదలకు ఉచితంగా ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహిళల రక్షణ కోసం చట్టాలను పటిష్టంగా అమలు జరపాలనీ, చట్టసభల్లో స్త్రీలకు 33 శాతం రిజర్వేషన్ బిల్లు కోసం తీర్మానాలు చేసి కార్యాచరణ రూపొందిస్తామన్నారు. రాబోయే కాలంలో మహిళలు రాజ్యాంగం ఇచ్చిన హక్కులను కాపాడుకోవాలనీ, ఐద్వా చేపట్టే పోరాటాలు, పిలుపుల్లో భాగస్వాములు కావాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు ఆర్ అరుణజ్యోతి, ఉపాధ్యక్షులు కెఎన్ ఆశాలత, పి శశికళ, ఎమ్ వినోద, కె నాగలక్ష్మి, రాష్ట్ర నాయకులు ఎ పద్మ, ఎం లక్ష్మమ్మ షబానా, ఎస్ పద్మ, సత్తెమ్మ, బి కవిత తదితరులు పాల్గొన్నారు

నవచిత్రం



సాహూ గారపాటి, బాలకృష్ణ, హరీష్ పెద్ది, అనిల్ రావిపూడి

బాలయ్య సెట్లో న్యూ ఇయర్ సెలబ్రేషన్స్

బాలకృష్ణ, అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో రూపొందుతున్న క్రేజీ ప్రాజెక్ట్ ఎన్‌బికె 108 షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ప్రొడక్షన్ డిజైనర్ రాజీవన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో వేసిన భారీ జైలు సెట్‌లో మాసీవ్ యాక్షన్ సీక్వెన్స్‌తో తాజాగా టీమ్ మొదటి షెడ్యూల్‌ను పూర్తి చేసింది. ఈ యాక్షన్ సీక్వెన్స్‌కి వెంకట్ మాస్టర్ యాక్షన్ కొరియోగ్రఫీ చేశారు. ఈ షెడ్యూల్‌లో బాలకృష్ణ, శరత్ కుమార్‌తో పాటు మరికొంతమంది ఆర్టిస్ట్‌లపై కీలక సన్నివేశాలను చిత్రీకరించారు. ఈ సెట్‌లోనే ఎన్‌బికె 108 యూనిట్ నూతన సంవత్సర వేడుకలని గ్రాండ్‌గా సెలబ్రేట్ చేశారు.

షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి, హరీష్ పెద్ది ప్రతిష్టాత్మకంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. బాలకృష్ణ మునుపెన్నడూ పోషించని పాత్రలో కనిపించనున్నారు. ఈ సినిమాలో బాలకృష్ణ మార్క్ మాస్ యాక్షన్, అనిల్ రావిపూడి మార్క్ ఎలిమెంట్స్ ఉండబోతున్నాయి. బాలకృష్ణ స్టార్‌డమ్‌ని దృష్టిలో పెట్టుకుని దర్శకుడు అనిల్ రావిపూడి ఓ పవర్‌ఫుల్ కథను రాశారు.

ఈ చిత్రంలో హీరోయిన్ శ్రీలీల కీలక పాత్ర పోషిస్తోంది. మ్యూజికల్ సెన్సేషన్ ఎస్ తమన్ సంగీతం అందిస్తున్నారు. ప్రముఖ నటీనటులు, సాంకేతిక నిపుణులు పనిచేస్తున్నారు. సి రామ్ ప్రసాద్ సినిమాటోగ్రఫీ అందిస్తుండగా. తమ్మి రాజు ఎడిటర్‌గా, రాజీవ్ ప్రొడక్షన్ డిజైనర్‌గా పని చేస్తున్నారు. యాక్షన్ పార్ట్‌కి వి.వెంకట్ కొరియోగ్రఫీ అందిస్తున్నారు అని చిత్ర బృందం తెలిపింది.

ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఎస్ కృష్ణ, డీవోపీ: సి రామ్ ప్రసాద్, ఎడిటర్: తమ్మి రాజు, ప్రొడక్షన్ డిజైనర్: రాజీవ్, ఫైట్స్: వి.వెంకట్.

రెండింటిలోనూ పవర్‌ఫుల్ యాక్షన్ సీక్వెన్స్‌లు



రామ్, లక్ష్మణ్

ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నిర్మాతలు నవీన్ యెర్నేని, వై రవిశంకర్ ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న చిరంజీవి- బాబీ కొల్లి కాంబినేషన్‌లో 'వాల్తేరు వీరయ్య', బాలకృష్ణ - గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో 'వీరసింహారెడ్డి'. ఈ చిత్రాలు సంక్రాంతి కానుకగా ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానున్నాయి.

ప్రేక్షకులు ఎంతగానో ఎదురుచూస్తున్న 'వాల్తేరు వీరయ్య' జనవరి 13న రిలీజ్ అవుతుండగా, 'వీరసింహారెడ్డి' జనవరి 12న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. భారీ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్స్‌గా రూపొందిన ఈ రెండు చిత్రాలకు రామ్ లక్ష్మణ్ మాస్టర్స్ యాక్షన్ కొరియోగ్రఫీ అందించారు.

ఈ సందర్భంగా విలేఖరుల సమావేశంలో ఈ రెండు చిత్రాల విశేషాలను షేర్ చేసుకున్నారు.

'క్యారెక్టరైజేషన్, బాడీ లాంగ్వేజ్ ప్రకారం కూడా యాక్షన్ డిజైన్ చేయాలి. 'వీరసింహారెడ్డి'లో బాలయ్య బాబు చైర్‌లో కూర్చుని ఉంటారు. ఎదురుగా రౌడీలు వస్తుంటారు. బాలయ్య క్యారెక్టరైజేషన్ ప్రకారం.. ఈ రౌడీలని కూడా నిల్చునికొట్టాలా? అనే ఆలోచన వచ్చింది. దీంతో ఆయన చైర్‌లో కూర్చునే ఒక పవర్ ఫుల్ ఫైట్‌ని కంపోజ్ చేశాం. చైర్‌లో కూర్చునే ఫైట్ చేయొచ్చు అనే మూడ్ చాలా అద్భుతంగా క్రియేట్ అయ్యింది. అది బాలయ్య క్యారెక్టరైజేషన్‌లో ఉన్న మ్యాజిక్. అలాగే చిరంజీవిగారి 'వాల్తేరు వీరయ్య'లో ఇంటర్వెల్ సీక్వెన్స్ చేశాం. లుంగీ కట్టుకొని, శ్రీకాకుళం యాస మాట్లాడుతూ అందరితో సరదాగా కలిసిపోయే చిరంజీవి ఇంటర్వెల్‌లో సడన్‌గా రెండు గన్స్ పట్టుకొని స్టయిలిష్‌గా కనిపిస్తారు. ఈ యాక్షన్ సీక్వెన్స్ అద్భుతంగా వచ్చింది. అలాగే చిరంజీవి, శ్రుతి హాసన్ మధ్య ఒక సరదా ఫైట్ కూడా కంపోజ్ చేశాం. దీన్ని ప్రేక్షకులు బాగా ఎంజాయ్ చేస్తారు. అలాగే 'వీరసింహా రెడ్డి' ఇంటర్వెల్ ఫైట్ టర్కీలో చేశాం. అక్కడ భారీగా ఖర్చు అయ్యింది. అయితే ఫైట్ మాత్రం చాలా పవర్ ఫుల్‌గా ఉంటుంది. చిరంజీవి 'వాల్తేరు వీరయ్య', బాలకృష్ణ 'వీరసింహారెడ్డి' సినిమాలు సంక్రాం తి వస్తున్నాయి. ఇద్దరి ఫ్యాన్స్‌లో భారీ అంచనాలు ఉంటాయి. అభిమానులు అంచ నాలు అందుకునే విధంగా రెండు సినిమాల్లో భిన్నమైన కథలు. దర్శకులు బాబీ, గోపీ చంద్ మలినేని రెండు భిన్నమైన క్యారెక్టరైజేషన్స్, బాడీ లాంగ్వేజ్ రాసుకున్నారు.

నవ్వకుండా ఉంటే రూ.లక్ష బహుమతి

సాయిరోనక్, అంకిత సాహా, బిస్మి నాస్ హీరో, హీరోయిన్లుగా నటించి ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చిన సినిమా 'రాజయోగం' . ఈ చిత్రాన్ని శ్రీ నవబాలా క్రియేషన్స్, వైష్ణవి నటరాజ్ ప్రొడక్షన్స్ పతాకాలపై మణి లక్ష్మణ్‌రావు నిర్మించారు. దర్శకుడు రామ్ గణపతి తెరకెక్కించిన ఈ సినిమా విడుదలైన అన్ని చోట్లా మంచి రెస్పాన్స్ తెచ్చుకుని ఘన విజయాన్ని సాధించింది. ఈ సందర్భంగా చిత్ర బృందం హైదరాబాద్‌లో సక్సెస్ మీట్ నిర్వహించింది. దర్శకుడు రామ్ గణపతి మాట్లాడుతూ, 'మా సినిమాకు థియేటర్ల నుంచి సూపర్బ్ రెస్పాన్స్ వస్తోంది. ఒక్క క్షణం కూడా స్క్రీన్ నుంచి చూపు తిప్పుకోకుండా చూస్తున్నామని ప్రేక్షకులు చెబుతున్నారు. ఇది నా మొదటి సినిమా అయినా, అనుభవజ్ఞుడైన దర్శకుడిలా తెరకెక్కించానని అనే ప్రశంసలు వస్తున్నాయి. ఇంకా సినిమా చూడని వారు త్వరగా చూసేయండి. ఎంత మంచి సినిమా అయినా మూడు రోజులకు మించి థియేటర్లలో ఉంచడం లేదు. సినిమా చూసి ఎంజాయ్ చేయండి. అలాగే ఈ చిత్రం చూసి నవ్వకుండా ఉండగలిగితే వాళ్ళకు లక్ష రూపాయల బహుమతి ఇస్తాం అని మా నిర్మాతలు ప్రకటించారు అంటే మాకెంత నమ్మకమో మీరు అర్థం చేసుకోండి' అని అన్నారు. 'ఈ సినిమాకి వస్తున్న రెస్పాన్స్ చూస్తుంటే మేము పడిన కష్టానికి ఫలితం దక్కిందని అనిపిస్తోంది. అయితే మంచి చిత్రానికి కూడా థియేటర్స్, షోస్ దొరకడం లేదు. ప్రేక్షకులు చూడాలని అనుకున్నా, ఆ టైమ్‌కు షోస్ ఇవ్వకుంటే ఎలా చూస్తారు?, నా లాంటి కొత్త హీరోలు, దర్శకులు ఎన్నో ఆశలతో ఇండస్ట్రీకి వచ్చాం. చేసిన మంచి సినిమాలకైనా థియేటర్ల పరంగా సపోర్ట్ దొరక్కపోతే ఎలా?, మా సినిమా లాంటి మంచి చిత్రాలను ఎంకరేజ్ చేయాలని కోరుతున్నా. మంచి సినిమాలో నటించానని హ్యాపీగా ఉంది' అని హీరో సాయి రోనక్ తెలిపారు.



విజయానందంలో 'రాజయోగం' చిత్ర బృందం

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

డిసెంబర్ 31 అర్ధరాత్రి లాస్ట్ 60 సెకన్లు కౌంట్ చేస్తూ కొత్త సంవత్సరానికి నూతనుత్తేజంతో స్వాగతం పలికేందుకు సిద్ధమయ్యారు. సరికొత్త ఆశలు, లక్ష్యాలు, భావాలతో కొత్త సంవత్సరాన్ని కొత్త ప్రదేశంలో జరుపుకునేందుకు మీరు సిద్ధమైపోండి. 2022కు స్వాగతం చెప్పేందుకు 10 బెస్ట్ ప్రదేశాల జాబితా మీ కోసం....

కొత్తకు ఎప్పుడు స్వాగతం పాతకు వందనం...

గోవా



ఇండియాలో న్యూ ఇయర్ సెలబ్రేషన్‌కు గోవా చాలా స్పెషల్. న్యూ ఇయర్ సెలబ్రేషన్ల కోసం అద్భుతమైన ప్రదేశాలలో ఒకటి. గోవా బీచ్‌లు మీకు స్వాగతం పలుకుతున్నాయి. రెట్టించిన ఉత్సాహంతో పర్యాటకులు ఆహ్లాదకరమైన వాతావరణం, విభిన్న సంస్కృతితో కొత్త సంవత్సరాన్ని స్వాగతించడానికి గోవా సరైన ఎంపిక అని మీకు అనిపిస్తుంది. ఇక్కడి ప్రకృతి అందాలు విభిన్న సంస్కృతి కలగలిసి వేడుక మూడ్ సెట్ చేయడానికి సరిపోతుంది.



మనాలి, హిమాచల్ ప్రదేశ్

'వ్యాలీ ఆఫ్ ది గాడ్స్' ఏడాది పొడవునా పర్యాటకులతో కిక్కిరిసి ఉంటుంది. అయితే నూతన సంవత్సరం సందర్భంగా మనాలి కూడా చూడదగ్గ ప్రదేశం. ఈ పట్టణం మీ నూతన సంవత్సరాన్ని ప్రారంభించడానికి ఒక అందమైన ప్రదేశం. గడ్డకట్టే వాతావరణంతో పాటు భోగి మంటలను ఆస్వాదించే వినోదం నూతన సంవత్సర ఆనందాన్ని రెట్టింపు చేస్తుంది. మనాలిలోని ప్రసిద్ధ ప్రదేశాలలో కుటుంబం, స్నేహితులు, ప్రియమైనవారితో చాలా ఎంజాయ్ చేయవచ్చు. నూతన సంవత్సరం సందర్భంగా తప్పకుండా వీక్షించే ప్రదేశాల్లో మనాలి ఒకటి. ఇక్కడ సందడిగా ఉన్న మార్కెట్లలో షాపింగ్ కూడా చేయవచ్చు. మీరు పార్టీలను ఆస్వాదించాలనుకుంటే, ఓల్డ్ మనాలిని సందర్శించవచ్చు. నూతన సంవత్సర వేడుకలలో కొత్త రుచులను ఆస్వాదించవచ్చు. పాత మనాలిలో అద్భుతమైన కేఫ్‌లకు మీకు స్వాగతం చెబుతాయి. నూతన సంవత్సర వేడుకలకు రుచికరమైన వంటకాలతో, కొత్త ప్రదేశాలతో మనాలి స్వాగతం చెబుతోంది. మనాలిలో నూతన సంవత్సర వేడుకల్లో హిప్పీ సంస్కృతిని ఆస్వాదించవచ్చు. మీరు సోలాంగ్ వ్యాలీ, కుఫ్రి వంటి పరిసర ప్రాంతాలకు చూసేందుకు రోడ్ ట్రిప్ ప్లాన్ చేసుకోవచ్చు. మంచుతో నిండిన రోడ్లపై సమయం గడపడం మిమల్ని మరింత ఉత్తేజపరుస్తుంది.;



గుల్మార్గ్, జమ్ము-కశ్మీర్

ప్రశాంతమైన గుల్‌మార్గ్ పట్టణంలో కొత్త సంవత్సరాన్ని ఆస్వాదించండి. ప్రకృతి ఒడిలో నూతన సంవత్సరాన్ని పలకరించాలనుకునే వారు ఈ నగరానికి వస్తే అసాధారణ అనుభూతిని పొందుతారు. ముఖ్యంగా మంచు, నిశ్శబ్దాన్ని ఇష్టపడే వారికి ఈ పట్టణం చాలా పర్ఫెక్ట్. మీ ప్రియమైన వారిని ఈ అద్భుతమైన ప్రదేశానికి తీసుకెళ్లితే వారు కచ్చితంగా ఆశ్చర్యపోతారు. ఈ ప్రదేశం ప్రకృతి ప్రేమికులకు స్వర్గధామం. భారతదేశంలో నూతన సంవత్సరాన్ని జరుపుకోవడానికి ఉత్తమమైన ప్రదేశాలలో ఒకటి.



ఊటీ, తమిళనాడు

నూతన సంవత్సరాన్ని కూల్ గా స్వాగతించాలనుకుంటున్నారా అయితే ఊటీ చాలా చక్కటి ప్రదేశం. ప్రశాంతతతో పాటు ప్రకృతి అందాలకు ఊటీ మేటి. ఊటీలో సాయంత్రాలు.. సంగీతం, కలర్ ఫుల్ పార్టీలతో ఆనందంగా సాగుతోంది. నిస్సందేహంగా దక్షిణ భారతదేశంలో నూతన సంవత్సరాన్ని జరుపుకోవడానికి ఊటీ ఉత్తమమైన ప్రదేశాలలో ఒకటి. నూతన సంవత్సర పర్యటనల కోసం ఊటీ ఉత్తమ ఆలోచన కావచ్చు. కుటుంబ-స్నేహపూర్వక ఈవెంట్‌ల నుంచి సంతోషకరమైన పార్టీల వరకు, దీజే పార్టీల నుంచి వేరైటీ ఫుడ్ ఐటమ్స్ వరకు మరెన్నో 2022 నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా ఉన్నాయి. ఊటీలో నూతన సంవత్సర ఈవెంట్‌లు, పార్టీలను నిర్వహించే అనేక అద్భుతమైన ప్రదేశాలు ఉన్నాయి.



కోల్‌కతా, పశ్చిమ బెంగాల్

దేశంలో అత్యంత డైనమిక్ నగరాల్లో ఒకటి కోల్‌కతా. నూతన సంవత్సరాన్ని జరుపుకోవడానికి ఇది ఉత్తమమైన ప్రదేశాలలో ఒకటి. అన్ని వయసుల వారు నూతన సంవత్సరాన్ని ఎంతో ఉత్సాహంగా ఆస్వాదించవచ్చు. నగరంలోని నైట్‌క్లబ్‌లు నూతన సంవత్సర వేడుకల సందర్భంగా అన్నీ సిద్ధంగా ఉన్నాయి. అన్ని టెన్షన్లను విడిచిపెట్టి కోల్‌కతాలో తిరిగేస్తూ ఎంజాయ్ చేయవచ్చు. గ్రూవింగ్ సంగీతాన్ని ఆస్వాదిస్తూ..రుచికరమైన వంటకాలను టేస్ట్ చేయవచ్చు. ఒకవేళ మీరు ఇంకా మీ ప్రణాళికలను రూపొందించుకోకపోతే నూతన సంవత్సరాన్ని ఆస్వాదించడానికి సిటీ ఆఫ్ జాయ్ సరైన గమ్యస్థానం.



ఢిల్లీ

దేశం రాజధాని ఢిల్లీలో రిఫ్రెష్‌మెంట్, మెలోడీ, లైట్లు, డ్యాన్స్ మధ్య నూతన సంవత్సరాన్ని ఆనందించండి. ఇక్కడ నూతన సంవత్సరాన్ని జరుపుకోవడానికి అనేక ప్లేసెస్ ఉన్నాయి. ఖరీదైన పార్టీలతో, మీరు అద్భుతమైన లాంజ్‌లు, ఢిల్లీలోని ప్రత్యేకమైన నైట్‌క్లబ్‌లలో పార్టీలను ఆస్వాదించవచ్చు. మీరు ఇక్కడి నైట్ క్లబ్ లలో దేశంలోని అత్యుత్తమ దీజేలు ప్లే చేసే పాటలను ఆస్వాదించవచ్చు. హౌజ్ ఖాస్, కన్నాట్ ప్లేస్, గ్రేటర్ కైలాష్ లను సందర్శిస్తూ రాత్రి జీవితాన్ని ఆస్వాదించవచ్చు. మీరు థీమ్ పార్టీలలో భాగం కావాలనుకుంటే, ఈ సమయంలో లొకేషన్‌లు ఎక్కువగా రద్దీగా ఉంటాయి. కాబట్టి మీ పార్టీ టిక్కెట్‌లను ముందుగానే బుక్ చేసుకోండి. భారతదేశంలో నూతన సంవత్సరాన్ని జరుపుకోవడానికి దిల్లీ ఉత్తమమైన ప్రదేశాలలో ఒకటి.



బెంగళూరు, కర్ణాటక

దేశంలోని ఐటీ హబ్‌లో రాబోయే నూతన సంవత్సరాన్ని ఆస్వాదించడానికి సిద్ధంగా ఉండండి. ఆహ్లాదకరమైన వాతావరణంలో నూతన సంవత్సరాన్ని జరుపుకోవడానికి అత్యుత్తమ ప్రదేశాలలో ఒకటి. పచ్చని ఉద్యానవనాలు, పబ్బులు, కేఫ్‌లు, వినోద కేంద్రాలు, విలాసవంతమైన బహిరంగ ప్రదేశాలతో.. బెంగుళూరులో మీ సెలబ్రేటరీ మూడ్‌ని ఎంజాయ్ చేయవచ్చు. ఈ నగరంలో అద్భుతమైన హోటళ్లు, రిసార్ట్‌లు ఉన్నాయి. ఇక్కడ మీరు మీ కొత్త సంవత్సరాన్ని ప్రత్యేకంగా మార్చుకోవచ్చు. దీజేల సంగీతంతో పార్టీ వేదికలు దుమ్మురేపుతాయి. మీరు బెంగుళూరులోని స్మాలీస్ రెస్టో కేఫ్, నాగార్జున, ది హమ్మింగ్ ట్రీ వంటి బెస్ట్ రెస్టారెంట్‌లలో చక్కటి భోజనాన్ని కూడా ఆస్వాదించవచ్చు.



వాయనాడ్, కేరళ

వాయనాడ్ లేదా గ్రీన్ ప్యారడైజ్.. భారతదేశంలోని ఉత్తమ నూతన సంవత్సర గమ్యస్థానాలలో ఒకటి. ప్రశాంతమైన వాతావరణంలో నూతన సంవత్సరాన్ని ఆస్వాదించడానికి ఈ పరిపూర్ణ ప్రదేశం అద్భుతమైనది. కొత్త అనుభూతిని పొందాలనుకునే వారు తప్పనిసరిగా సందర్శించాల్సి ప్రదేశం. పచ్చని సుగంధ తోటల చుట్టూ తిరుగుతూ సుందరమైన దృశ్యాలను ఆస్వాదించవచ్చు. జలపాతాల సింఫొనీ, ఆకుపచ్చ తోటలు మీకు ఎంతో ప్రశాంతతను కలుగజేస్తాయి. నగరంలోని ఏదైనా బహిరంగ పచ్చికభూముల వద్ద టెంట్ వేసుకుని సీనరీస్ ఎంజాయ్ చేయవచ్చు. వాయనాడ్‌లో అనేక రిసార్ట్‌లు కూడా ఉన్నాయి. ఇక్కడ మీరు ప్రశాంతమైన టైం గడపవచ్చు.

ఉదయపూర్, రాజస్థాన్



ఉదయపూర్‌లోని 'సిటీ ఆఫ్ లేక్స్' నూతన సంవత్సరం వేడుకలు జరుపుకునేందుకు చక్కటి ప్రదేశం. మీ ప్రియమైన వారితో ఆనందించడానికి ఇది ఉత్తమ ప్రదేశం. మీరు ఇక్కడ రాజభవనాలలో స్మారక చిహ్నాలను చూడవచ్చు. స్థానిక మార్కెట్లలో తిరుగుతూ నగర సందర్శనకు ప్లాన్ చేసుకోవచ్చు. కొత్త సంవత్సరాన్ని జరుపుకోవడానికి గొప్ప పార్టీలతో రాచరిక జీవనశైలిలో స్థానిక రుచులను ఎంజాయ్ చేయవచ్చు. ఉదయపూర్‌లో మీ కుటుంబం, స్నేహితులు, ప్రియమైనవారితో కలిసి నూతన సంవత్సరాన్ని ఆస్వాదించడానికి అనేక రిసార్ట్‌లు క్లబ్‌లు ఉన్నాయి.



పాండిచ్చేరి

పాండిచ్చేరిలో నూతన సంవత్సర వేడుకలలో మునుపెన్నడూ లేని విధంగా ఆస్వాదించవచ్చు. రిసార్ట్‌లు, పబ్బులు, బీచ్‌లు, క్లబ్‌ల వరకు అనేక రకాల పార్టీలు మీకు స్వాగతం చెబుతాయి. పాండిచ్చేరి నైట్ లైఫ్ పార్టీలు యువతను ఉర్రూతలూగిస్తాయి. పాండిచ్చేరిలో నూతన సంవత్సరాన్ని జరుపుకోవడానికి పోర్ట్ బీచ్ పార్టీ, బీచ్ బాష్ **NYE** కాటమరాన్ బీచ్ ఫెస్టివల్ సిద్ధంగా ఉన్నాయి. ప్యారడైజ్ బీచ్, ప్రామెనేడ్ బీచ్ పాండిచ్చేరి, అశోక్ బీచ్ రిసార్ట్, **LB2** లాంజ్, పబ్ జిప్పర్, ఉమామి కిచెన్, క్రాస్కీస్ రెస్ట్రోపబ్, జింగీ సలై, సీగల్స్ బీచ్ రిసార్ట్, అరోమా గార్డెన్స్, ఆరోవిల్, అతిథి TGI గ్రాండ్, చిన వీరంపాట్నం, చిన్న వీరంపాటిన్, ఐలాండ్ పార్టీ 2022 నూతన సంవత్సరాన్ని స్టైల్‌గా స్వాగతించడానికి గుడ్ డెస్టినేషన్.;

- అనంతోజు మోహన్ కృష్ణ

విద్వేష గిటారు..



నరుడి అహంకారం అందలమెక్కి
భువిపై విషపు జల్లులను
కురిపిస్తున్నాడు
మనిషి స్వార్థ బొంతను కప్పుకొని
విచిత్ర విపత్తులకు పురుడు
పోస్తున్నాడు

పుడమి పై తరువులను తరిగేసి
ఇలపై ఎండిన ఎడారిని
పరుస్తున్నాడు
ధరణి ఒడిలో ఒదిగిన గుట్టలను
కరిగించి
కాసుల కట్టల గుట్టలను
పేర్చుతున్నాడు
పచ్చదనాన్ని హత్య చేసి మానవుడు
అడుగడుగునా పొగ గొట్టాలను
నాటేసి
కాలుష్య రొంపుని భూమి పై
నింపుతున్నాడు

అవనికి తనువు నిండా గాయాలను
చేస్తూ
విలాసాల ఊయలలో
ఊరేగుతున్నాడు
భూమి భూషణలన్నీ బుగ్గి పాలు
జేస్తూ
భావి బతుకు తీగలను
తెంపేస్తున్నాడు
అన్నం పెట్టే మట్టిని అమ్ముకుంటూ
ప్రకృతిని వికృతి చేస్తున్నాడు

పరులపై ప్రకోపాన్ని పెంచుకుంటూ
విద్వేష గిటారును మీటుతున్నాడు
కడుపులో కత్తులను పెట్టుకొని
మమతలను మంటల్లో
కాల్చుతున్నాడు
కారుణ్యాన్ని కానలలో వదిలేసి మనిషి
ఒంటరి గుహలో కాలాన్ని
నెట్టుతున్నాడు

- తాటిపాముల రమేశ్
7981566031

నా అభిలాష

కలువ చంద్రుని కలల మధ్యలో
ఊగిసలాడాలని
వెన్నెల వేణువుకు తీగనైతే
గానమై లోకమంతా
పరుచుకోవాలని నా అభిలాష
పరవశించాలని నా అభిలాష
చీకటి కోణపు చరవేగంలో
శాంతికి చిహ్నమై
వెలుగులు నింపాలని
సమసమాజ నిర్మాణానికి



చక్కని ప్రేమ నా మస్తిష్కంలో
రంగు రంగుల హరివిల్లై
బాగా విచ్చుకోవాలని
చిరునవ్వుల తొనికిసలో
సరిగమలు పదనిసలై
ఆలపించాలని నా అభిలాష

చిరు శ్వాసల వెచ్చదనంలో
మదన వీచికల మారుతంలా
స్వేచ్ఛగా విహరించాలని
సుస్వప్నాల మాధుర్యంలో
మధుర భావ తరంగిణిలా
పునాదిగా వుండిపోవాలని
ఎప్పటినుంచో నా అభిలాష

చివరిదాకాజి
కల్మషమెరుగని
మనసు మైదాన పాన్పుపై
హాయిగా సేద తీరాలని
నాకున్న గొప్ప అభిలాష

- నరెడ్డులరాజారెడ్డి
9666016636

నవ సంవత్సరం



సంవత్సరాలన్నొక్కొక్కటి
గతిస్తూ
మనకై మరో నూతన
వత్సరాన్నందిస్తూ తరాలనెన్నో
చరిత్రలో కలిపేస్తూ
నవ్యత్వాన్ని సంతరించుకుని
సరికొత్తగా ముస్తాబైంది

ఎన్నెన్నో నవ్యానుభూతుల్ని
మోసుకొస్తు ముందునిలిచేది
ఎదురైన సంఘటనలేవైనా
ఎదమాటున దాచుకుంటూ
గాయాలేవైనా సంతోషలేపనాలతో
భవితవ్యంపై ఆశల్నిరేపుతూ
నవజీవనగమనంలోకి నడిపించే
సజీవనేస్తమది

ఆకాశానికి ఆశలరంగుల్నితొడిగి
ఆలోచనకు
అందుకునే దారిచూపేది

కాలచక్రం రివ్వునతిరిగే
కాలగర్భంలో కలిపసినోల్లెందరో
ఐనా
బతికేవాళ్ళకి భరోసానిచ్చేది
ఆనందానికి చిరునామయ్యేది
అనంతమైన విశ్వానికి విశ్వాసాన్ని
సమకూర్చేదది

ముసుగుతన్ని పడుకుంటే
అనుకున్నదేది పొందలేం
అడుగేయాల్సిందే
పరమార్థం తెలుసుకోవాలంటే
పరుగాగేదాక అలుపును
తరమాల్సిందే

తనువున్నంతదాకా
దేహం దాహాన్ని తీర్చాల్సిందే

ఆత్మాభిమానంతో
అవమానాల్నెదిరించాల్సిందే
ఆనందగీతాల్నాలపించాలంటే
సుందరస్వప్నాలకై
పరితపించాల్సిందే
ఆత్మసంతృప్తికై అహర్నిశలు
ఆరాటపడాల్సిందే
ఆత్మ పరమాత్మలో కలిసేదాకా
ఆత్మదీపానికింత
భక్తి చమురునందించాల్సిందే

-సి.శేఖర్(సియస్సార్),
9010480557

అవుటర్ రింగ్ రోడ్

కార్పోరేట్ గద్ద
గాల్లో కాలర్ ఎగరేస్తుంటే
ఊరి పొలిమేర
పిల్లల కోడిలా మారిపోతుంది.

అయినా
రెక్కల కింద
కొన్ని పిల్లలు
లెక్క తప్పి పోతాయి.

పరిహార ప్రహసనం
పునరావృతం
అవుతూనే ఉంటుంది.

అనకొండలా మారిన
అవుటర్ రింగ్ రోడ్
గ్రామాల్ని మింగి
ముద్దలు ముద్దలుగా
విశాలమైన రహదారుల్ని
నగరం కోసం కక్కుతుంది.

అందులో ఎక్కడో
మింగుడు పడని
మా ఇంటి పెంకులు ఉండొచ్చు.

ఆ రహదారులపై
కాస్త జాగ్రత్తగా
ముందుకు సాగండి.

- కుడికాల వంశీధర్
9885201600